ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
27-6-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 147 పేజీలు: 8+4 వెల: 6.50

'సర్'కు యేడాది..
6 కోట్ల ఓట్లు తొలగింపు
5లో
వెనిజులా భూకంపంలో
600 దాటిన మృతులు


# టీచర్లే ఛేంజ్ మేకర్లు


శుక్రవారం సింగపూర్ అధ్యయనయాత్రకు వెళ్లిన టీచర్ల సమావేశంలో మాట్లాడుతున్న లోకేష్

## విద్యా వ్యవస్థలో మార్పునకు ఉపాధ్యాయులే నాయకత్వం వహించాలి
## విద్యారంగంలో ఎపి.ని నం.1 చేద్దాం
## సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లిన టీచర్లతో మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు గారి ప్రజా ప్రభుత్వం టీచర్లను లీడర్లు భావిస్తోంది, కష్టపడి మంచి ఫలితాలు సాధించే ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపునిస్తామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఇటీవల సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లిన 37మంది ఉత్తమ ఉపాధ్యాయులతో మంత్రి లోకేష్ ఉండవల్లి నివాసంలో సమావేశమయ్యారు. సింగపూర్ అధ్యయన యాత్రలో తాము తెలుసుకున్న అంశాలు, రాష్ట్రంలో వాటిని అమలు చేయడానికి గల అవకాశాలను వారు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజంలో మార్పునకు నాయకత్వం వహించే లీడర్లని అన్నారు. విద్యద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుంది, అందుకోసమే నేను పట్టుదల, కమిట్ మెంట్ తో విద్యాశాఖను తీసుకున్నాను, ప్రపంచంలో అత్యుత్తమ మోడల్ విద్యావిధానం కోసం అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశించిన స్వర్ణాంధ్ర సాధనలో విద్యాశాఖ కీలకపాత్ర వహిస్తుంది, క్వాంటమ్, ఏఐ వంటి అధునాతన సాంకేతికతలు అమలు చేయడం విద్యాశాఖ ద్వారా మాత్రమే సాధ్యమని అన్నారు. నేను చిన్న వయసులోనే అమెరికా వెళ్లి స్టాన్ ఫోర్డ్‌లో విద్యనభ్యసించాను, అక్కడ 100 దేశాల విద్యార్థులతో కలిసి ఐడియాస్, నాలెడ్జి, కల్చర్ పంచుకునే అవకాశం లభించిందని తెలిపారు. విదేశాల్లో శిక్షణపొందిన ఉపాధ్యాయులంతా ఛేంజ్ మేకర్స్‌గా తయారు కావాలి. సింగపూర్ అధ్యయన యాత్రలో మీరు నేర్చుకున్న అం >>2

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం



## యువత భవిష్యత్తును కాపాడడమే లక్ష్యం
## మాదకద్రవ్యాలు సేవిస్తే శిక్షలు ఖాయం
## ఈగల్ టీమ్‌తో నిరంతరం నిఘా: సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 26 ,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో డ్రగ్స్‌కు చోటు లేదని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా సందేశం ఇచ్చారు. డ్రగ్స్‌పై పోరాటం అంటే యువత భవిష్యత్తును కాపాడటమే అని అన్నారు. ఏపీలో డ్రగ్ ట్రాఫికింగ్‌పై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. డ్రగ్స్ అక్రమ రవాణాదారులను చట్టం ముందు నిలబెడతామని అన్నారు. డ్రగ్స్ మహమ్మారి బారినపడ్డ వారికి అన్ని విధాలా సహాయం అందించి సాధారణ జీవితంలోకి తీసుకువస్తామన్నారు. గౌరవప్రదమైన పునరావాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల జోలికి ఎవరూ పోకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ యాంటీ నార్కోటిక్ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నాయని తెలిపారు. నేటి తరం పిల్లలు ఎంతో ఫాస్ట్‌గా, క్లారిటీగా ఉంటున్నప్పటికీ, చిన్న అవగాహన లోపం వల్ల డ్రగ్స్‌బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్ (నివారణే మేలు) అన్నట్లుగా, యువత వీటి జోలికి వెళ్లకుండా ముందే కాపాడుకోవడం ముఖ్యమని చెప్పారు. 60 నుండి 70శాతం స్నేహితుల ప్రభావమే పలువురు ఈ వ్యసనానికి బానిసలుగా మారడానికి కారణమన్నారు.దేశంలో దాదాపు 3.5నుండి 4 కోట్ల మంది గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని, ముఖ్యంగా 13నుండి 18సంవత్సరాల వయస్సువారు ఎక్కువగా దీనికి ఆకర్షితులవుతున్నారని హోంమంత్రి ఆందోళన వ్యక్తం >>2



## మాదకద్రవ్య రహిత భారత్‌ను నిర్మిద్దాం: అమిత్‌షా
2లో



## కొత్తగా ఏడు బుల్లెట్‌ట్రైన్ కారిడార్లు
### గంటకు 350 కి.మీ వేగంతో బి35 కొత్తరైళ్లు

**న్యూఢిల్లీ,జూన్ 26:** భారతదేశ రైల్వే వ్యవస్థలో వందే భారత్ రైళ్లు వేగంగా దూసుకుపోతుంటే ఇప్పుడు అంతకంటే వేగంగా దూసుకుపోయే బుల్లెట్ రైళ్లకూడా భారత్‌లో పరిగెత్తబోతున్నాయి. బుల్లెట్ ట్రైన్ కారిడార్లను కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది. 7 కొత్త బుల్లెట్ ట్రైన్ కారిడార్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ కారిడార్ల కోసం బి35 పేరుతో అత్యాధునిక హైస్పీడ్ రైళ్లను అభివృద్ధి చేయాలని నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్ణయించింది. ఈ రైళ్ల రూపకల్పన, తయారీ కోసం సంస్థలు ఎంపిక చేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించింది. భారత్‌లోనే తయారు కానున్న ఈ బి35 బుల్లెట్ ట్రైన్లు గరిష్టంగా గంటకు 350 >>2

# సకాలంలో సబ్సిడీ ఎరువులు



## ఎపిఎఐఎంఎస్ 2.0తో అక్రమ మళ్లింపులకు పూర్తిగా చెక్
## ఎరువుల కొరత రాకుండా చర్యలు
## కౌలు రైతులు సహా అర్హులందరికి సమాన అవకాశం: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పారదర్శకంగా, సకాలంలో సబ్సిడీ ఎరువులు అందించేందుకు ప్రవేశపెట్టిన APAIMS 2.0వ్యవస్థ విజయవంతంగా అమలవుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ ఏడాది జూన్ 8వ తేదీ నుంచికృష్ణా, కాకినాడ జిల్లాలను మినహాయించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఏపిఎఐఎంఎస్ 2.0 ద్వారా యూరియా, డీఏపీ పంపిణీ చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 2,97,733 మంది రైతులకు 48, 588 మెట్రిక్ టన్నుల యూరియా, 12,874మెట్రిక్ టన్నుల డీఏపీ విజయవం తంగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ వ్యవస్థను అమలు చేస్తోం దన్నారు. దీనివల్ల అర్హులైన నిజమైన రైతులకు మాత్రమే సబ్సిడీ ఎరువులు అందేలా పూర్తి భరోసా కల్పించామని మంత్రి పేర్కొన్నారు.రైతు సాగు చేస్తున్న పంట, సాగు విస్తీర్ణం, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రీయ సిఫార్సుల ఆధారంగా అవసరమైన పరిమాణంలోనే ఎరువులు అందజేస్తున్నామని తెలిపారు. దీంతో సమతుల్య ఎరువుల వినియోగం పెరిగి, రైతులకు దిగుబడులు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ సబ్సిడీ కూడా సక్రమంగా వినియోగమవుతుందని చెప్పారు. ఏపిఎఐఎంఎస 2.0 ద్వారా ఎరువుల దుర్వినియోగం, అక్రమ నిల్వలు, మళ్లింపులు, రైతులు కాని వ్యక్తులకు విక్రయాలు పూర్తిగా అరికట్టే అవకాశం లభించిందన్నారు. ఎరువుల నిల్వలు, సరఫరా, పంపిణీపై రాష్ట్రవ్యాప్తంగా రియల్‌టైమ్ పర్యవేక్షణ సాధ్యమవుతోందని, భౌతిక నిల్వల సమన్వయంతో ఖచ్చితమైన నిల్వల నిర్వహణ జరుగుతోందని వివరించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత తలెత్త కుండా, అవసరమైన సమయంలో అవసరమైన పరిమా ణంలో రైతులకు ఎరువులు అందేలా ప్రణాళికాబద్ధంగా పంపిణీ నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. కౌలు రైతులతో సహా అర్హులైన ప్రతి రైతుకు సమాన అవకాశాలు కల్పించేలా ఈ వ్యవస్థ రూపొందించబడిందని చెప్పారు. ఎరువుల కొరత, నాణ్యత, అధిక ధరలు లేదా పంపిణీలో ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నంబర్ 155251 కు కాల్ చేయవచ్చని మంత్రి తెలిపారు.
రైతులు తమ ఎరువుల కొనుగోలు చరిత్ర, అర్హత వివరాలను కూడా సులభంగా తెలుసుకునే అవకాశం కల్పించామని, రైతుకేంద్రీకృత, పారదర్శక, సాంకేతికత ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థగా ఏపిఎఐఎంఎస్ 2.0 వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఏ నిజమైన రైతుకూ ఎరువు నిరాకరించ బడకూడదు. ఏ అనధికార వ్యక్తి లేదా రైతు కాని వ్యక్తికి సబ్సిడీ ఎరువు అందకూడదు అన్నదే ఏపిఎఐఎంఎస 2.0 మార్గదర్శక సూత్రమని మంత్రి స్పష్టం చేశారు. వ్యవస్థ ప్రారంభ దశలో కొద్దిపాటి సాంకేతిక సమస్యలు ఎదురైనప్పటికీ వాటిలో అధిక భాగం ఇప్పటికే పరిష్కరించామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో అప్పుడప్పుడు వీగిశ లేదా సర్వర్‌కు సంబంధించిన తాత్కాలిక సమస్యలు ఎదురవుతున్నా, ప్రత్యేక సాంకేతిక బృందాలు 24/7 పర్యవేక్షణ చేస్తూ వాటిని వెంటనే పరిష్కరిస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం APAIMS 2.0పూర్తిస్థాయిలో సజావుగా పనిచేస్తూ రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా ఎరువుల పంపిణీ >>2


ప్రమాద స్థలంలో తుఫాను వాహనం

## రెండు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం
### మాచర్లలో నలుగురు, పీలేరులో ముగ్గురు

**మాచర్ల, జూన్ 26 ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా మాచర్ల సమీపంలోని నగరవనం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాదు నుంచి పొదిలికి వెళ్తున్న తుఫాన్ వాహనం రోడ్డుపై ఆగి ఉన్న లారీని వేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. తుఫాను వాహనంలో మొత్తం 13 మంది ప్రయాణిస్తుండగా ఈ దుర్ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారమందుకున్న >>2



## ముదిరిన అయోధ్య విరాళాల వివాదం
### ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, మరో సభ్యుని రాజీనామా
5లో
### 8 మంది నిందితుల అరెస్టు

## సాయికృష్ణ అదృశ్యం కేసు
# మరో ముగ్గురి కోసం గాలింపు
### ఘటనపై తీవ్రంగా స్పందించిన మానవ హక్కుల కమిషన్
### సిబిఐ దర్యాప్తు కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన సాయికృష్ణ తల్లి

**విజయవాడ.జూన్ 26, ప్రభాతవార్తప్రతినిధి:** లాకప్ డెత్ అయిన గాదే సాయికృష్ణ కేసులో సిట్ కీలక ఆధారాలను సేకరిస్తుంది. ఇప్పటికే ఈ కేసులో సీఐ నాగరాజుకు అతడి స్నేహితుడు, ఇద్దరు సిబ్బంది సహకరించినట్లు సిట్ దర్యాప్తులో గుర్తించింది. నాగరాజు అరెస్టుతో హెడ్‌కానిస్టేబుళ్లు అశోక్, నాని అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ క్రమంలో శుక్రవారం హెడ్‌కానిస్టేబుల్ అశోక్ ఇంటికి సిట్ పోలీసులు వెళ్లారు. అతను ఇంట్లో లేకపోవడంతో పోలీసులు తిరిగి వచ్చేసారు. ఈ కేసులో సీఐ నాగరాజును రిమాండ్ నుంచి తమ కస్టడీకి అప్పగించాలని సిట్ విజయవాడ కోర్టు పిటిషన్ వేసింది.సాయికృష్ణ కేసులో నిందితుడు నాగరాజు నుంచి మరింత సమాచారం రాబట్టాల్సి ఉందని 12 రోజుల కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో కోరారు. అరెస్టు చేశాక విచారణకు సమయం లేకపోయిందని, దీనివల్ల పూర్తి వివరాలు రాలేదని పిటిషన్‌లో పేర్కొంది. కౌంటర్ దాఖలుకు సమయం కావాలని నాగరాజు తరఫు న్యాయవాది సమయం కోరడంతో 29వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. ఈ క్రమంలో సిట్ పలువురు అనుమాని స్తోంది,సిఐకి లాకప్‌డెత్‌లో సహకరించినకానిస్టేబుళ్లు సురేశ్, అశోక్, నాని ముగ్గురూ వద్దేశ్వరం వెళ్లారని సిట్ గుర్తించింది. ప్రస్తుతం పరారీలో ఉన్న ముగ్గురి కోసం సిట్ అధికారులు గాలిస్తు న్నారు. మే 29న వద్దేశ్వరం వెళ్లిన సీసీ ఫుటేజ్‌ను సిట్ స్వాధీనం చేసుకుంది. సీడీఆర్, సీసీ ఫుటేజ్ ఆధారంగా సాయికృష్ణ అదృశ్యం కేసులో ముగ్గురు కీలకంగా ఉన్నారని సిట్ గుర్తించింది. సాయికృష్ణ మృతదేహాన్ని ఏం చేశారు? ఎక్కడ పడేశారు? అన్న వాటిపైనా సిట్ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. కస్టడీలోనే మరణించినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న ప్రత్యేక దర్యాప్తు బృందం పూర్తి వివరాల కోసం విచారణను వేగవంతం చేసింది. ఈ క్రమంలో టాస్క్‌ఫోర్స్ బృందం సాయికృష్ణను మార్యాపురం నుంచి తీసుకొచ్చి కృష్ణలంక స్టేషన్‌లో అప్పగించినట్లు తేలింది. మే 6 నుంచి 8వ తేదీ వరకు స్టేషన్‌లో ఉన్నా ఆ తర్వాత ఏమయ్యాడో మిస్టరీగా మారింది. స్టేషన్‌లో మొత్తం 60 మంది సిబ్బంది ఉన్నారు. వీరిని అందరినీ సిట్ ప్రశ్నించి, స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తోంది. కృష్ణలంక స్టేషన్‌లో సీసీటీవీ ఫుటేజీ మాయంపైబాధ్యులు రికార్డులు సమర్పించేలా >>2



## తరుణ వ్యాధులకు చెక్
### అన్ని పంచాయతీల్లో ముందస్తు చర్యలు: డి.సిఎం పవన్
### దోమల నియంత్రణపై అధికారులతో సమీక్ష

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల్ని ఆదేశించారు. 'ఫ్రైడే – డ్రైడే' కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.క్రమం తప్పకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలన్నారు.అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలన్నారు.ముఖ్యంగా వర్షపు నీరు, మురుగునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవటం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయాలి. శుభ్రత పాటించాలన్నారు.వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో తరుణ (సీజనల్) వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీటి భద్రత, దోమల నియంత్రణ చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రజారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మురుగు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవటం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయగలుగుతామన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, రోజు వారీ చెత్త సేకరణ శాస్త్రీయపద్ధతిలో నిర్వహించాలని, ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామంలో క్రమం తప్ప కుండా ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి మురుగునీటి నిల్వలను తొలగించే ఏర్పాటు చేయాలన్నారు. సోషల్‌మీడియా, వాట్సప్ గ్రూపులు, మైక్ అనౌన్స్‌మెంట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలనిసూచించారు. పాఠశాలలు, >>2



గ్రానైట్ లారీ దగ్ధమవుతున్న దృశ్యం


ఓబుల్‌రెడ్డి(ఫైల్)

## చెట్టును ఢీకొని దగ్ధమైన లారీ
### ఉరవకొండ మండలంలో దుర్ఘటన
### డ్రైవర్ ఓబుల్ రెడ్డి సజీవ దహనం, తీవ్రగాయాలతో బయటపడిన క్లీనర్

**ఉరవకొండ, జూన్ 26 ప్రభాతవార్త:** అనంతపురం–బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో ఉరవకొండ మండలం కొట్టాలపల్లి–బూదగవి గ్రామాల మధ్య శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డుప్రమాదం విషాదం నింపింది. గ్రానైట్ లోడ్‌తో వెళుతున్న లారీ ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొని బోల్తాపడి లారీ దగ్ధంకాగా లారీలో మంటలు చెలరేగి డ్రైవర్ ఓబుల్‌రెడ్డి (41)సజీవ దహనమయ్యాడు. అతికష్టం మీద క్లీనర్ పుల్లయ్య ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించి ఉరవకొండ సీఐ బి.మహానంది తెలిపిన మేరకు వివరాల్లో వెళితే కర్నాటక రాష్ట్రం బళ్లారి సమీపంలోని ఈల్‌కల్‌నుంచి గ్రానైట్ లోడతో లారీ అనంతపురం–బళ్లారి >>2

# నడక భక్తులకు 'దివ్య దర్శనం' లేదా?



### రోజూ అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాల్లో తిరుమల చేరుతున్న 20వేల మంది
### 14 సంవత్సరాల క్రితం ఆరంభించిన పథకానికి తిలోదకాలు!
### టోకెన్లను పునరుద్ధరించాలని కోరుతున్న భక్తులు

**తిరుమల,జూన్ 26ప్రభాతవార్తప్రతినిధి:** కాలినడకన ఏడు కొండలకు నడచివచ్చే భక్తుల సౌలభ్యం కోసం ప్రవేశపెట్టిన దివ్యదర్శనం టోకెన్లకు నేడు టిటిడి పెద్దలు పూర్తిగా చరమగీతం పెట్టేశారు. మెట్లదారిలో తిరుమలకు వచ్చే భక్తులకు మరింత త్వరగా దర్శనం చేయించేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సాధారణ సర్వదర్శనం కంటే ,సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లకంటే దివ్యదర్శనం టోకెన్‌లు కలిగిన భక్తులకు రెండుగంటలు ముందుగానే శ్రీవారి దర్శనం చేసుకునే వెసలుబాటు ఉండేది. ఇప్పుడు ఆ దివ్యదర్శనాన్ని పూర్తిగా రద్దుచేసే శారు. దీంతో కాలినడకన వచ్చినా భక్తులకు సర్వదర్శన టైమ్‌స్లాటే అమలవుతోంది. రోజువారీగా 20వేలమంది వరకు భక్తులు కాలినడకన అలిపిరి, శ్రీవారిమెట్టుమార్గాల్లో తిరుమలకు చేరుకుంటున్నారు. ఇలా వస్తున్న భక్తులకు వీలైనంత త్వరగా వెంకన్న దర్శనం చేయించాలని దాదాపు 14 సంవత్సరాల క్రిందట దివ్యదర్శనం పేరుతో టోకెన్లు జారీ చేసే విధానం అమలుచేశారు. తొలుత ఈ టోకెన్‌లు కలిగిన భక్తులకు ఒక లడ్డూఉచితంతోబాటు మరో లడ్డూ అదనంగా రెండులడ్డూలు మంజూరు చేశారు. ఆ తరువాత 2014లో ఏర్పాటైన తెలుగుదేశం ప్రభుత్వంలోని టిటిడి బోర్డుపెద్దలు ఈ పథకానికి తిలోదకా లిచ్చేశారు. వరుసగా కొలువుదీరిన టిటిడి బోర్డులు రకరకాలుగా లడ్డూ ప్రసాదాలను కుదిస్తూ చివరకు 2019లో ఏర్పాటైన వైసిపి ప్రభుత్వంలోని టిటిడిబోర్డు పెద్దలు అన్నిదర్శనాల భక్తులకు ఒకలడ్డూ ఉచితంగా అందించేలా ఆమోదించి అమలు చేస్తున్నారు. లడ్డూల కోసం కాకున్నా >>2



ద్రాక్షారామం మార్కెట్‌లో దగ్ధమవుతున్న దుకాణ సముదాయాలు

ద్రాక్షారామంలో అగ్నిప్రమాదం:

## 48 దుకాణాలు బూడిద.. రూ.3 కోట్ల నష్టం!

**రామచంద్రపురం,జూన్ 26 ప్రభాత వార్త:** డా బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం ద్రాక్షారామంలోని స్థానిక మార్కెట్ సముదాయంలో గురువారంఅర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా చెలరేగిన మంటలు క్షణాల వ్యవధిలోనే వ్యాపించి,సుమారు 48కి పైగా కూరగా యలు, మాంసం, కిరాణా దుకాణాలను పూర్తిగా బూడిద చేశాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 కోట్ల వరకు ఆస్తినష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. సమాచారం అందుకున్న రామచంద్రపురం, మండపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. **రూ.60 లక్షల తక్షణ సాయం ప్రకటించిన మంత్రి:** ప్రమాద స్థలాన్ని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, జాయింట్ కలెక్టర్ టి. నిధియా దేవి, ఎస్పీ రాహుల్ మీనా, ఇతర ప్రజాప్రతినిధులు పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ స్పందిస్తూ.. తన తండ్రి ఖిసత్యం వాసంశెట్టి ఫౌండేషన్‌ఖి ద్వారా రూ.20 లక్షలు, అలాగే ఇతర దాతల నుంచి మరో రూ.40 లక్షలు.. మొత్తంగా రూ.60 లక్షల ఆర్థిక సహాయాన్ని కేవలం గంట వ్యవధిలోనే సేకరించి ప్రకటించారు. ప్రభుత్వం తరపున డిజాస్టర్ మేనేజ్మెంట్ ద్వారా పూర్తి సాయం అందిస్తామని జేసీ హామీ ఇవ్వగా, పోలీస్ శాఖ తరపున ఎస్పీ రాహుల్ మీనా రూ.50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు.

# సకాలంలో సబ్సిడీ ఎరువులు

>> కొనసాగు తోందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో సబ్సిడీ ఎరువుల పంపిణీలో చోటుచేసుకున్న అక్రమాలు, మళ్లింపులు, నిల్వలు, రైతులు కాని వ్యక్తులకు విక్రయాల వంటి అవకతవకలకు పూర్తిగా అడ్డుకట్ట వేయడానికే ఏపిఐఎంఎస్ 2.0 వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ పారదర్శక విధానం అమలులోకి రావడంతో అక్రమాలకు అవకాశం లేకుండా పోయిందని, దీంతో కొందరి స్వార్థ ప్రయోజనాలకు గండిపడిందని పేర్కొ న్నారు.గతంలో తనకు అనుకూలమైన కొందరు డీలర్లు, డిస్ట్రిబ్యూటర్ల ద్వారా యూరియా, డీఏపీ వంటి సబ్సిడీ ఎరువులను అక్రమంగా మళ్లించే అవకాశం ఉండేదని, ఇప్పుడు ఏపిఐఎంఎస్ 2.0 వల్ల అలాంటి అక్రమాలకు పూర్తిగా చెక్ పడిందన్నారు. వాస్తవాలను వక్రీకరించి రాజ కీయ లబ్ధిపొందాలని చేసే ప్రయత్నాలను రైతులు విశ్వసిం చరని, పారదర్శక పాలనతో నిజమైన రైతుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. 2026-27 పంట సంవత్సరానికి మార్కెట్ పరిస్థితులు, దేశీయ, అంతర్జాతీయ డిమాండ్, రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లో పొగాకుఉత్పత్తి పరిమాణాన్ని సుమారు 81 మిలియన్ కిలోలకు నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, పొగాకు మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, కొనుగోలు విధానంలో పారదర్శకత పెంచడం, పంట నియంత్రణ వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు తీసుకురావడం, రైతులకు మెరుగైన ప్రయోజనాలు కల్పించడం కోసం అన్ని భాగస్వాములతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర, ఖరీఫ్ రైతులకు సకాలంలో ఎరువుల సరఫరా జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

# నడక భక్తులకు 'దివ్య దర్శనం' లేదా?

>> దేశంలోని నలుమూలల నుండి వస్తున్న భక్తులు ఏడుకొండలవాడిపై భక్తితో, తమ మొక్కుబడుల్లో భాగంగా కాలినడకన తిరుమలకు వస్తుండటం పరిపాటి. ఇలా కాలినడకన తిరుమలకు చేరుకునే భక్తులకు "దివ్య"దర్శనమ్ టోకెన్లు జారీచేసే విధానం అమలు చేశారు. అయితే కరోనా సమయంలో వీటిని రద్దుచేసినా ఆ తరువాత మళ్ళీ పునరుద్దరణ జరగలేదు. టిటిడి బోర్డు పెద్దలు, టిటిడి అధికారులు సామాన్యభక్తులకు మరింత తక్కువసమయంలో సంతోషంగా శ్రీవారి దర్శనం చేయించా లనే తపనతో వినూత్న ఆలోచనతో ఎఐ అమ లు చేస్తున్నారు. అయితే కాలినడక భక్తులకు కూడా సర్వ దర్శనమ్ టైమ్‌స్లాట్ టోకెన్లే జారీచేస్తుండటంతో దర్శ నానికి సాధారణ రోజుల్లోనూ దాదాపు ఆరేడుగంటలపైనే నిరీక్షణ తప్పడంలేదు. 2020సంవత్సరం వరకు వేంకటేశ్వరస్వామి దర్శనంలో కాలినడకన వచ్చే భక్తులకు ప్రత్యేకంగా దివ్యదర్శనమ్ పేరుతో అలిపిరి ,శ్రీవారిమెట్టు నడకమార్గంలోనే టోకెన్లు జారీచేసేవారు. రోజువారీగా 15వేల టోకెన్ల వరకు అందుబాటులో ఉండేది. అయితే ఇవి పునరుద్దరణ చేయకపోవడంతో కాలినడకన అలిపిరి, శ్రీవారిమెట్టుమార్గంలో చేరుకునే భక్తులకు సర్వదర్శనమ్ టైమ్‌స్లాట్ టోకెన్లే జారీఅవుతున్నాయి. ఈ టోకెన్లు కూడా అలిపిరి భూదేవికాంప్లెక్స్‌లోని కౌంటర్లలో జారీచేస్తు న్నారు. భక్తుల రద్దీని బట్టి టోకెన్లు అందుకున్న భక్తులకు మరుసటిరోజు దర్శనం కేటాయిస్తున్నారు. టోకెన్లు అం దుకున్న భక్తులు అదేరోజు రాత్రి తిరుమలకు చేరుకుంటే వారికి వసతి సౌకర్యం కూడా దొరకడంలేదు. అలిపిరి నడకమార్గంలో ఇప్పటికీ టోకెన్లు పునరుద్దరణ కాలేదు. ఇప్పుడు అలిపిరి భూదేవికాంప్లెక్స్‌లో జారీచేస్తున్న టైమ్‌స్లాట్ సర్వదర్శనమ్ టోకెన్లు అందుకున్న భక్తులు కాలినడకన లేక రోడ్డుమార్గంలో కూడా తిరుమలకు చేరుకుని ఇష్టదైవమ్ దర్శనం చేసుకునే వెసలుబాటు ఉంది. ఇలా రోజుకు శ్రీవారిమెట్టుమార్గంలో ఐదువేలమందివరకు ,అలిపిరి మార్గంలో 15వేలమంది వరకు భక్తులు వస్తున్నారనేది టిటిడి వర్గాల సమాచారం. నడకదారిలో కొండకు వచ్చినా సాధారణ సర్వదర్శనమ్‌లోనే వైకుంఠమ్ -2నుండి ,రద్దీ పెరిగితే ఆలయంవెలుపల క్యూలైన్లనుండి ప్రవేశించాల్సి వస్తోంది.

**నడకదారుల్లో టోకెన్లు ఇవ్వరా!?:** సాధారణంగా తిరుమలకు రోజువారీగా లక్షమందివరకు భక్తులు వస్తుంటే వారిలో 15వేలమంది నుండి 20వేలమంది భక్తులు కాలినడక మార్గాల్లోనే చేరుకుంటున్నారు. మరీ వారాంతం శుక్ర,శని,ఆదివారాల్లో ఈ రద్దీ 25వేలమంది వరకు కనిపిస్తుంది. ఇప్పుడు శ్రీవారిమెట్టుమార్గానికి సంబంధించి కేవలం 3వేల టోకెన్లు మాత్రమే టైమ్‌స్లాట్ టోకెన్లు జారీ చేస్తున్నారు. భక్తుల రద్దీ పెరిగినా ఆ తరువాత మరుసటిరోజే టోకెన్లు జారీ చేస్తారు.

**శ్రీవారిమెట్టుమార్గంలో నడచివచ్చే భక్తుల టోకెన్లు:** స్కానింగ్‌ను 1200వ మెట్లువద్ద జరుగుతుంది. భక్తులకు ఎలాంటి ఇబబందులు,అసౌకర్యం లేకుండా మెట్లవద్ద జారీచేసే టోకెన్లు కౌంటర్లను ఏకంగా శ్రీనివాసమంగాపురంలోని కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలోపలకు మార్చాలని 2025లోనే నిర్ణయించారు. ఇందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకునే దిశగా కార్యాచరణ రూపొందించారు. దీనికోసం పురావస్తుశాఖ అధికారులకు లేఖలు రాశారు. అయితే ఇంతవరకు అతీగతీ లేదు. అలిపిరి నడకమార్గంలోనూ టోకెన్లుజారీని పునరుద్దరించాలని గతంలోనే నిర్ణయించారు. అయితే ఇప్పటికీ దివ్యదర్శనమ్ టోకెన్లు మాత్రం జారీచేయడంలేదు.కాలినడకన తిరుమలకు చేరుకున్న భక్తులను గతం లో దివ్యదర్శనమ్ కాంప్లెక్స్‌క్యూలైన్లనుండి అనుమతించి వీరికి త్వరగా ఆ దేవదేవుని దర్శనం చేయించేవారు.ఇప్పుడా పరిస్థితులు లేకపోవడంతో కాలినడకన వచ్చేభక్తులకు అసౌకర్యం ,ఇబ్బందులు తప్ప డంలేదు..దివ్యదర్శనం పునరుద్దరిస్తారా లేకమంగళం పాడేస్తారా అనేదిభక్తుల్లోఅయోమయం నెలకొంది.

# అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తత!

## హార్ముజ్ నౌకలపై దాడులకు పాల్పడుతున్న ఇరాన్: ట్రంప్

**వాషింగ్టన్,జూన్ 26:** మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణ అమల్లో ఉన్నప్పటికీ అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి చెలరేగుతున్నాయి. హార్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు.సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో స్పందించిన ట్రంప్ ఇరాన్ కనీసం నాలుగు వన్‌వే అటాక్ డ్రోన్లను నౌకలపై ప్రయోగించిందని తెలిపారు. వాటిలో ఒక డ్రోన్ భారీ కార్గో నౌక ఎగువ డెక్‌ను ఢీకొని నష్టాన్ని కలిగించిందన్నారు. అయితే అమెరికా బలగాలు మిగిలిన మూడు డ్రోన్లను కూల్చివేశాయని చెప్పారు.ఈ దాడి ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి స్పష్టమైన ఉల్లంఘన అని ట్రంప్ విమర్శించారు. దాడికిగురైన నౌక పేరు లేదా ఘటన జరిగిన ఖచ్చితమైన సమయాన్ని మాత్రం ఆయన వెల్లడిం చలేదు.ఇదిలా ఉండగా, ఓమన్ తీరానికి సమీపంలో ఓ వాణిజ్య నౌక గుర్తు తెలియని ప్రక్షేపక దాడికి గురైనట్లు యునైటెడ్ కింగ్‌డమ్ సముద్ర భద్రతా సంస్థ యూకేఎంటీఓ వెల్లడించింది. నౌక కుడివైపు భాగంలో దాడి జరగడంతో బ్రిడ్జ్‌కు నష్టం వాటిల్లిందని తెలిపింది. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది.ప్రస్తుతం అమెరికాఇరాన్ మధ్య శాశ్వతంగా యుద్ధానికి ముగింపు పలికే దిశగా చర్చలు కొనసాగుతున్నాయి.హార్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు, ఇరాన్ అధిక శుద్ధి చేసిన యురేనియం నిల్వల భవిష్యత్తు వంటి కీలక అంశాలపై ఇరుదేశాలు చర్చిస్తున్నాయి. ఈ నెలప్రారంభంలో కుదిరిన తాత్కాలిక ఒప్పందంప్రకారం 60రోజుల్లో తుది నిర్ణయానికి రావాల్సి ఉంది.

## తరుణ వ్యాధులకు చెక్

>> అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఇచ్చే తాగు నీటి నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణపై ఎప్పటి కప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. తాగు నీటి సరఫరా వ్యవస్థపై పర్యవేక్షణ ఉండాలని పైపు లైన్లలో లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలు అనేవి కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాకుండా, అవి నిశ్శ బ్దంగా ఆరోగ్యాన్ని నాశనం చేస్తూ, కుటుం బాలను ముక్కలు చేస్తూ, మన సమాజ పునా దులనే బలహీనపరిచే ఒక తీవ్రమైన సామాజిక సవాలు అని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం

>> చేశారు. కేవలం స్నేహితుల ఒత్తిడి వల్లే 60 నుంచి 70 శాతం మంది వీటికి బానిసలవు తున్నారని, ఇలాంటి అలవాట్లు చేసే స్నేహితులు శత్రువులతో సమానమని హెచ్చరించారు. ఎన్నో కష్టాలకోర్చి, తమ స్థాయికి మించి పిల్లలను హాస్టల్స్ లో ఉంచి చదివిస్తున్న తల్లిదండ్రుల ఆశలను యువత అపహాస్యం చేయవద్దని కోరారు. ఒక్కసారి గంజాయికి బానిసైతే జైలు పాలవ్వడం ఖాయ మని, ఈ మధ్య కాలంలో తల్లిదండ్రులు కూడా ఇలాంటి పిల్లలకు బెయిల్ ఇప్పించడానికి ముందుకు రావడం లేదని గుర్తుచేశారు. గతంలో డ్రగ్స్ బారిన పడేవారి సగటు వయసు 25 ఏళ్లు ఉండగా, అది క్రమంగా 20 నుండి18 ఏళ్లకు అంతకంటే తక్కువకు పడిపోవడం యువత భవిష్యత్తుకు పెద్ద ఉపద్రవంగా భావించవమ్మన్నారు. సమాజంలో ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నా లేదా విక్రయిస్తున్నా వెంటనే ఈగల్ టీమ్‌కు గానీ, టోల్ ఫ్రీ నెంబర్లకు గానీ సమాచారం అందించాలన్నారు. నెంబర్లు గుర్తులేకపోతే యూనివర్సల్ నెంబర్ 112 కు లేదా ఏ ప్రభుత్వ విభాగానికైనా సమాచారం ఇచ్చి, ఈ భూతాన్ని మొక్కలోనే తుంచివేయాలన్నారు.డ్రగ్ ట్రాఫికింగ్‌పై జీరో టాలరెన్స్ విధానంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. ప్రతి కుటుంబానికి సురక్షిత భవిష్యత్తు అందించేందుకు కట్టుబడి ఉన్నా మని తెలిపారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' హాష్ ట్యాగ్‌ను తన పోస్ట్‌ను సీఎం చంద్రబాబు ట్యాగ్ చేశారు.

## మాదకద్రవ్య రహిత భారత్‌ను నిర్మిద్దాం: అమిత్‌షా

**విజయవాడ,జూన్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** వచ్చే 2047 నాటికి మాదక ద్రవ్య రహిత భారత్ (డ్రగ్స్ ఫ్రీ భారత్)సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపు నిచ్చారు.శుక్రవారం ఆయన ఢిల్లీ నుండి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు,పోలీసు ఉన్నతాధికారులు,నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో తదితర విభాగాల అధికారులతో నార్కో కోఆర్డినేషన్ పై వీడియో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడి పిలుపు మేరకు 2047 నాటికి డ్రగ్స్ రహిత భారత్ సాధనే లక్ష్యంగా పని చేయాలని ఇందుకు సాంకేతికత సాయంతో పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్రాలకు సూచించారు.ముఖ్యంగా మాదక ద్రవ్యాల సరఫరా,విక్రయం చేసే వారిపై కఠినంగా మరియు జీరో టోలరెన్స్ గా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ఇందుకు సంబంధించిన హాట్ స్పాట్లను గుర్తించి కట్టుదిట్టమైన నిఘా ఉంచి కింగ్ పిన్ లను పట్టుకోవడంతో పాటు వారికి సకాలంలో శిక్షపడేలా చూడాలన్నారు. విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వీడియో సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఏపిలో ఈగల్ పోలీసు విభాగం ప్రత్యేక రాష్ట్ర స్థాయి మాదకద్రవ్య వ్యతిరేక దళం సమర్థవంతంగా పనిచేస్తోందని చెప్పారు.ఒకప్పుడు ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గంజాయి ప్రాంతంగా పేరుపొందిన ఆంధ్రప్రదేశ్ నేడు మాదకద్రవ్యాల నియంత్రణ అమలు లో జాతీయ స్థాయిలో ఒక ఆదర్శప్రాయమైన ప్రమాణంగా నిలిచిందని అన్నారు. రైల్వే నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రాల మధ్య జరిగే మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకోవడానికి ప్రతి జిల్లాలో వారానికి మూడుసార్లు స్థానిక పోలీసులు,జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్,ఈగిల్ మరియు శునక దళాలను సంయుక్తంగా మోహరించి పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈగల్ మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో ఒక ప్రత్యేకమైన, సురక్షితమైన డేటా సెంటర్‌ను నిర్వహించడంతో పాటు రాష్ట్ర మాదకద్రవ్యాల నిరోధక వ్యవస్థకు కేంద్రీకృత నిఘా కేంద్రంగా పని చేస్తోందని తెలిపారు.ఈవీడియో సమావేశంలో ఈగల్ చీఫ్ ఐజిపి ఆకె రవికృష్ణ,ఈగల్ ఎస్పి ఆపరేషన్స్ కెయం. మహేశ్వర రాజు, విశాఖపట్నం ఎన్సిబి ఎస్పి జెడి పంకజ్,ఎన్సిబి డిఎస్పి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.త

# మరో ముగ్గురి కోసం గాలింపు

>> ఆదేశాలు ఇవ్వాలని విజయలక్ష్మి మ్మ మరో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయవాది సతీష్‌బాబు వాదనలు వినిపించారు. సాయికృష్ణ మృతదేహం ఏమైందో రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొనలేదన్నారు. ప్రతి స్టేషన్‌లోని సీసీ కెమెరాల పనితీరుపై పర్యవేక్షించాల్సిన బాధ్యత జిల్లాస్థాయి కమిటీకి ఉందని తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం సీసీటీవీ ఫుటేజీ కోసం జిల్లా స్థాయి కమిటీకి నోటీసులిచ్చింది. నిందితుడిగా ఉన్న నాగరాజుకూ నోటీసులు ఇచ్చింది. విచారణను ఈనెల 29కి కోర్టు వాయిదా వేసింది. ఇక సాయికృష్ణ లాకప్ డెత్ ఉదంతంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణకు చెందిన హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని ఇచ్చిన ఫిర్యాదుతో కస్టడీ హింసపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ తీవ్రంగా స్పందించింది. విజయవాడలో అక్రమ నిర్బంధం, హింస నిజమేనని ప్రాథమిక విచారణలో సిట్‌సైతం నిర్ధారించింది.అంతే కాకుండా సాయికృష్ణ లాకప్ డేత్‌ను సిట్ సిఐ నాగరాజు రిమాండ్ రిపోర్టులోను స్పష్టం చేసింది.చేసింది. డిలీట్ చేసిన సీసీటీవీ ఫుటేజీని వెంటనే రికవరీ చేయాలని, నదిలో కలిపిన బాధితుడి అస్థికలను వెలికితీయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో నమోదైన ఎఫ్ఐఆర్ స్టేటస్, నిందితుల పూర్తి వివరాలు, బాధిత కుటుంబానికి చెల్లించాల్సిన పరిహారంపై వారం రోజుల్లోగా సమగ్ర యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (సమర్పించిన నివేదిక) ఇవ్వాలని ఏపీ పోలీస్ బాసులకు అల్టిమేటం జారీ చేసింది. తన కుమారుడు గాదె సాయికృష్ణ అదృశ్యం కేసును సీబీఐ లేదా స్వతంత్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని కోరుతూ సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి మ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే సాయికృష్ణను కోర్టు ముందు హాజరు పర్చాలని విజయలక్ష్మి కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలోనే కేసులో సీబీఐ లేదా స్వతంత్ర దర్యాప్తును కోరుతూ శుక్రవారం ఆమె హైకోర్టులో అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంలో పోలీస్ ఉన్నతాధికారుల పాత్ర ఉందని, వాస్తవాలను తొక్కిపెడుతు న్నారని విజయలక్ష్మి తన పిటిషన్‌లో పేర్కొ న్నారు. రాష్ట్ర పోలీస్ యంత్రాంగంతో సంబంధం లేని స్వతంత్ర దర్యాప్తు సంస్థకు సాయికృష్ణ అదృశ్యం కేసును అప్పగించాలని ఆమె కోరారు.

## మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించండి: మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్26,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ విని యోగంపై ప్రజల్లో మరింతగా అవగాహన కల్పిం చేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. శుక్రవారం సచివాల యంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఆర్టీజీఎస్‌పై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ లక్ష్యాలు, ప్రాజెక్టుల ప్రగతిపై ఆ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిం చారు. ప్రభుత్వ శాఖల సమాచారాన్ని క్రోడీక రించేందుకు చేపట్టిన డేటాలేక్ పనులన్నీ జులై నాటికి పూర్తికావాలని మంత్రి ఆదేశించారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరులో అడ్డంకులు తొలగించాలి. రేషన్ కార్డుల విభజన, కుటుంబ సభ్యుల పేర్లు చేర్చడం, తొలగించే ప్రక్రియను మరింత సులభతరం చేయాలి. సంజీవని కార్యక్రమాన్ని కూడా డేటా లేక్ తో అనుసంధానించాలి. పాఠశాలల్లో డ్రాప్ అవుట్లను డేటా లేక్ ద్వారా విశ్లేషించి, తగ్గించడానికి గల మార్గాలను అన్వేషించాలి. విద్యారంగంలో సమగ్ర సమాచారాన్ని ట్రాక్ చేస్తున్నాం. అన్ని శాఖల సమాచారం డేటా లేక్ ద్వారా అనుసంధానం కావాలని మంత్రి సూ చించారు. మనమిత్ర ప్రజలకు మరింత చేరువ కావాలి అన్నారు.ప్రజల్లో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై మరింతగా అవగాహన కలిగేలా నెలరోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రజలకు కలిగే ఉపయోగం, వినియోగం, పై వివరించాలన్నారు.





శుక్రవారం తెల్లవారుజామున పీలేరు వద్ద ప్రమాదానికి గురైన కారు, ఆటో

# ఏడుగురు దుర్మరణం

>> పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులను సమీప ఆసు పత్రికి తరలించారు. ప్రమాదంలో మృతుల వివరాలు, గాయపడిన వారి పరిస్థితిపై పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రమాద స్థలంలో మృతి చెందారు. మిగిలిన వారిని 108 వాహనం ద్వారా మార్కాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వైద్యులు వెల్లడించారు. వీరి స్వగ్రామం మార్కాపురం జిల్లా వెలిగండ్ల మండలం సీఎస్‌పురం నాగిరెడ్డిపాలెం. వీరు గత 20 సంవత్సరాలుగా హైదరాబాదులో పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరి బంధువు అంత్యక్రియలకు తుఫాను వాహనం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

**పీలేరులో.. పీలేరు , జూన్ 26 ప్రభాతవార్త:** అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ఆరుగురు తీవ్రంగా గాయపడిన ఈ సంఘటన అన్నమయ్య జిల్లా పీలేరు మండలంలో శుక్రవారం వేకువ జామున చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు పీలేరు మండలం రేగళ్ళ కస్పాకు చెందిన మెహరూన్ (75) తన కోడలు ఇర్ఫానా పుట్టిన ఊరైన కలికిరి మండలం టి.చంద్రావారిపల్లె పంచాయతీ దూదేకుల పల్లెలో ఆమె తల్లిని చూసి అలాగే పీర్ల పండగ చూసి స్వగ్రామం గురువారం రాత్రి ఆటోలో వెళ్లారు. అక్కడ పీర్ల ఊరేగింపు సంబరాలు ముగించుకుని శుక్రవారం వేకువజామున ఆటోలో తిరిగి స్వగ్రామం రేగళ్లకు బయలుదేరారు. పీలేరు మండలం రాజా వడ్డిపల్లె మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారుఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో మెహరూనీతో పాటు మనవడు, ఆటోడ్రైవరు ముబారక్ (55) సంఘటనా స్థలంలో మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీ సులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనం ద్వారా పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో ఇర్ఫానా, ఆమె పెద్ద కుమారుడు మొహ్మద్ నౌహీద్(19), రెండవ కుమారుడు మొహ్మద్ (18),మొహరూనీ కుమార్తె హుస్సేనీ కుమారులైన మొహ్మద్ అజ్యల్, మొహ్మద్ ఆసిఫ్ పీలేరులో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. మార్గ మధ్యంలో మొహ్మద్ మృతి చెందాడు.

# వానలే వానలు!

## మూడు రోజులపాటు భారీ వర్ష సూచన

**విజయవాడ,జూన్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత నుండి మధ్య మహారాష్ట్ర వరకు తెలంగాణ మరియు దాని పరిసర ప్రాంతాలపై నున్న ఉపరితల ఆవర్తనం మీదుగా ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ..దీని ప్రభావంతో రేపు చెదురుమదురుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు... ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు..శనివారం ఉత్తరాంధ్ర, కాకినాడ, కోనసీమ,మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొన్నారు.ఆదివారం కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలన్నారు. ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే పొలాల్లో పనిచేసే రైతులు,శ్రామికులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు.

# టీచర్లే ఛేంజ్ మేకర్లు

>> శాలను స్కూలు, క్లస్టర్, మండలాల్లో అమలు చేసేందుకు నాయకత్వం వహించండి. సహ టీచర్లకు మెంటరింగ్ చేయండి. టీచర్ - స్టూడెంట్ - సబ్జెక్ట్ రిలేషన్ షిప్ ముఖ్యం. ప్రస్తుతం మనం మౌలిక సదుపాయాలపై దృష్టిపెట్టి, సాఫ్ట్ వేర్ మర్చిపోతున్నాం. రాష్ట్రంలో లీప్ మోడల్ విద్యావ్యవస్థ సాధనకు కలిసికట్టుగా పనిచేయాలి. టీచర్లు బోధనపైనే శ్రద్ధ వహించాలని అన్నారు. విద్యావ్యవస్థలో ఆశించిన మార్పు తేవడం వెనువెంటనే సాధ్యం కాదు, ఇందుకు కొంత సమయం పడుతుంది. రాష్ట్రంలో మనం చేపట్టిన సంస్కరణల కారణంగా ఈ ఏడాది లక్షమందికి పైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు మారారు, ఇది శుభపరిణామం, ప్రభుత్వ ఉపాధ్యాయులకు మించిన టీచర్లు ప్రైవేటు స్కూళ్లలో లేరు, ఆదర్శవంతమైన విద్యావ్యవస్థ (ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్) సాధనకు మీ సహకారం కావాలి, కలిసికట్టుగా పనిచేసి అత్యుత్తమ ఫలితాలు సాధించాలి, లక్షలాదిమంది బిడ్డల భవిష్యత్తు మనపై ఆధారపడి ఉంది. ఈరోజు దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ గురించి చర్చ జరుగుతోంది. ఇప్పుడు మనం ఇతర రాష్ట్రాలతో కాదు, ఇతర దేశాలతో పోటీపడాలి, ఉపాధ్యాయులకు నామద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని మంత్రి లోకేష్ చెప్పారు. ఎటువంటి పైరవీలకు తావులేకుండా టీచర్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ తెచ్చి సీనియారిటీ ప్రాతిపదికన పారదర్శకంగా ప్రమోషన్లు ఇచ్చాం. మీకుఅత్యంత శక్తి, సామర్థ్యాలు ఉన్నాయి, ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ ను ప్రపం చానికి చాటిచెప్పాలి, ఇందులో భాగంగా ఇప్పుడు తొలిఅడుగు వేశాం... అభ్యసన ఫలితాలు, ఎనలిటికల్ థింకింగ్ పై దృష్టిసారించాలి. విద్యావ్యవస్థలో అన్ని సమస్యలను ఒకేరోజు పరిష్కరించడం సాధ్యం కాదు,ప్రాధాన్యత క్రమంలో అన్నింటినీ పరిష్కరిస్తాం, ప్రజాప్రభుత్వం మీ వెంట ఉంది, విద్యారం గంలో ఏపీని నెం.1గా తయారుచేసేందుకు సమిష్టిగా కృషిచేద్దామని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. సింగపూర్ టూర్ ద్వారా ఉపాధ్యాయులు వివిధ అంశాలపై కెపాసిటీ బిల్డింగ్ పై శ్రద్ధవహించాలి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75ఏళ్ల వయసులో ఇప్పటికీ నేర్చుకుంటూనే ఉంటారు. ఇటీవల ఆయన సింగపూర్ వెళ్లి ప్రధాని, ఇతర మంత్రులను కలిసి పలు కొత్తవిషయాలపై అధ్యయనం చేశారు, గతకొంతకాలంగా ప్రభుత్వ టీచర్లకు గౌరవం పెరిగింది, మీరు లీడర్లుగా, ఛేంజ్ మేకర్స్ గా తయా రుకండి, మీకు అండగా మేముంటామని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కమిషనర్ తమీమ్అన్సారియా,ఎస్ సీఈఆర్ టీ డైరెక్టర్ ఎం.వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెట్టును ఢీకొని దగ్ధమైన లారీ

>> 42వ నంబర్ జాతీయ రహదారి గుండా నెల్లూరు జిల్లాలోని క్రిష్ణపట్నం పోర్టుకు బయలు దేరింది. లారీ శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో విడనకల్లు మండలం కొట్టాలపల్లి గ్రామ దాటి బూదగవి గ్రామ సమీపంలోకి చేరుకోగానే ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డుపక్కన చెట్టుకు బలంగా ఢీకొని బోల్తా పడింది.దీంతో క్షణాల్లోనే డీజిల్ ట్యాంక్ పేలి లారీ క్యాబిన్‌కు నిప్పంటుకొని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఘోర ప్రమాదంలో లారీడ్రైవర్ ఓబుల్‌రెడ్డి క్యాబిన్ లోపలే చిక్కుకు పోయి బయటకురాలేక లారీతోపాటే సజీవ దహన మయ్యాడు. లారీ క్లీనర్ పుల్లయ్య మాత్రం అతికష్టం మీద లారీ నుండి ప్రాణాలతో బయటపడ్డాడు. లారీక్లీనర్ పుల్లయ్యను సీఐ బి.మహానంది విచారించి ఆయన పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఘోర ప్రమాదంలో సజీవ దహనమైన లారీడ్రైవర్ఓబుల్‌రెడ్డి కడపజిల్లా పులివేందుల నియోజకవర్గంలోని లింగాల మండలం కర్ణ పాపయ్యపల్లి వాసిగా గుర్తించారు.ఆయనకు భార్యరామలక్ష్మి, కొడుకు మహేంద్రనాథ్, కుమార్తె తేజశ్విని ఉన్నారు.

# కొత్తగా ఏడు బుల్లెట్‌ట్రైన్ కారిడార్లు

>> కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రూపొందించనున్నారు. సాధారణ సేవల్లో గంటకు 320 కిలోమీటర్ల వేగంతో నడిచేలా ప్రణాళిక సిద్ధం చేశారు. భవిష్యత్తులో దేశంలోని అన్ని కొత్త బుల్లెట్ ట్రైన్ మార్గాల్లో ఇవే ప్రధాన హైస్పీడ్ రైళ్లుగా మారనున్నాయి. ముంబై - పుణె,పుణె - హైదరాబాద్, హైదరాబాద్ - బెంగళూరు, హైదరాబాద్ - చెన్నై, చెన్నై - బెంగళూరు, ఢిల్లీ - వారణాసి, వారణాసి - సిలిగురి కారిడార్లు ప్రకటించింది. ఈ బుల్లెట్ ట్రైన్ కారిడార్లు అందుబాటులోకి వస్తే ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం భారీగా తగ్గుతుంది.ముంబై - అహ్మదాబాద్: 1 గంట 57 నిమిషాలు, ముంబె - పుణె: 48 నిమిషాలు, బెంగళూరు - చెన్నై: 73 నిమిషాలు, బెంగళూరు - హైదరాబాద్: 2 గంటల 10 నిమిషాలు, పుణె - హైదరాబాద్: 2 గంటల 8 నిమిషాలు, ఢిల్లీ - లక్నో: 2 గంటలు, ఢిల్లీ - వారణాసి 3 గంటల 15 నిమిషాలు తగ్గుతుందని ప్రకటించింది. ఇక దేశంలోని తొలి 508 కిలోమీటర్ల ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా గుజరాత్‌లోని సూరత్‌వాపి మధ్య 97 కిలోమీటర్ల విభాగంలో 2027 ఆగస్టు నాటికి బుల్లెట్ ట్రైన్ సేవలు ప్రారంభించాలని హైస్పీడ్ రైల్వే కారిడార్ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. బి35 బుల్లెట్ ట్రైన్ల అభివృద్ధితో భారత్‌లోనే అత్యాధునిక హైస్పీడ్ రైళ్ల తయారీకి ఊతం లభించనుంది. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ కారిడార్లలో వేగవంతమైన, స్వదేశీ సాంకేతికతతో రూపొందిన రైలు సేవలు అందుబాటులోకి రావడంతో రవాణా రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది.

## వారం - వర్జ్యం

27-06-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, ఆరుద్ర కార్తె
త్రయోదశి రా.12.44, అనూరాధ రా.10.11
వర్జ్యం : తె.4.28-ఉ.6.16
దు.తె.5.37-ఉ.7.17
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** కుటుంబ బాధ్యతలు సమర్థ వంతంగా నిర్వహిస్తారు. శ్రమకు అదృష్టం తోడవుతుంది. అనుకూల ఫలితాలు.

**వృషభం:** కోర్టుకేసులు పరిష్కారమవుతాయి. రాజకీయరంగం లోని వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి.

**మిథునం:** చిన్ననాటి మిత్రుల ద్వారా కీలక సమాచారం అందుకుంటారు. నష్టం రావల్సిన చోట నష్టం రాదు.

**కర్కాటకం:** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. పారిశ్రామిక వర్గాల వారికి అన్ని విధాల ప్రోత్సాహం లభిస్తుంది.

**సింహం:** పొదుపు పథకాల పట్ల ఎక్కువ ఆకర్షితులవుతారు. నూతన యత్నాలలో పురోగతి సాధిస్తారు. బంధువుల కలయిక.

**కన్య :** కీలక వ్యవహారాలలో అవరోధాలు ఏర్పడినా పూర్తి చేస్తారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులుంటాయి.వాహనసౌఖ్యం.

**తుల:** ఉద్యోగులకు విధి నిర్వహణలో బాధ్యతలు పెరుగుతాయి. పారిశ్రామిక రంగాలలోని వారు సామరస్యం వహించాలి.

**వృశ్చికం:** ఆహార నియమాలలో జాగ్రత్త అవసరం. దానధర్మాలు చేస్తారు. శుభ కార్యాలను విజయవంతంగా పూర్తిచేస్తారు.

**ధనుస్సు:** మీ పేరును పలుకుబడిని, హోదాను ఉపయోగించి కీలకమైన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు.

**మకరం:** ఎంతటి వారికైనా మాటల చాతుర్యంతో ఆకట్టుకుంటారు. చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు.

**కుంభం:** దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి. శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకుంటారు. కొత్త పరిచయాలు.

**మీనం:** తగాదాలు, వివాదాలకు దూరంగా వుండండి. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వేదాంతధోరణి అలవరచుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# యువశక్తే దేశానికి పెట్టుబడి

- గంజాయి, మాదకద్రవ్యాలను నిర్మూలిస్తాం • డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం • హోం మంత్రి వంగలపూడి అనిత




**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో అత్యంత శక్తివంతమైన మానవ వనరులైన యువశక్తి భగ్నం కాకుండా, రాబోయే తరాల అభివృద్ధికి వారిని ఒక పెట్టుబడిగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, ఏ తల్లిదండ్రులైనా ఒంట్లో బాగోలేని బిడ్డకు జీవితాంతం సేవ చేయడానికై సిద్ధపతారని చెప్పారు. కానీ.. గంజాయి మత్తులో పడి జైల్లో ఉన్న బిడ్డను విడుదల చేసేందుకు ఏ పేరెంట్స్ కూడా ముందుకు రారన్నారు. హోం మంత్రి అయిన కొత్తలో ఓ వ్యక్తి తనకు ఫోన్ చేసి చెప్పిన విషయం షాక్‌కు గురయ్యేలా చేసిందన్నారు. నాలుగో తరగతి చదువు తున్న పిల్లాడు గంజాయికి బానిసయ్యాడంటూ సదరు వ్యక్తి చెప్పిన విషయం విని భయాందోళనకు గురైనట్లు చెప్పారు. ఈగల్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని.. నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్స్ తిరుగుతున్నాయని హోం మంత్రి తెలిపారు. ఎక్కడో చెట్టు కింద కూర్చొని గంజాయి తీసుకున్నా కూడా డ్రోన్ పట్టేస్తుందన్నారు. అంత స్ట్రిక్ట్‌గా సర్వైలెన్స్ పనిచేస్తున్నాయని చెప్పారు. విజయవాడ కమిషనరేట్‌లో ఏ మూలకు వెళ్లినా సీసీటీవీ కెమెరాలు పనిచేసే పరిస్థితులు ఉన్నాయన్నారు. భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని.. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని యువతకు సూచించారు. చిన్న చిన్న ఆనందాల గురించి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని, తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చే పరిస్థితి తీసుకురావొద్దన్నారు. లీగల్ టీమ్ ఆపరేషన్ గరుడ పేరుతో మెడికల్ షాప్‌లను కూడా తనిఖీ చేస్తోందని అనిత తెలిపారు. గంజాయి పట్టడంలో పోలీస్ డాగ్‌లు ఉత్తమ అవార్డులు కూడా తెచ్చాయని తెలిపారు. మత్తు పదార్థాల సమాచారం ఉంటే 1972కి కాల్ చేయాలని.. ఇన్ఫర్మేషన్ ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌గా మార్చడానికి అందరి సహాయ సహకారాలు ఇవ్వాలని హోం మంత్రి అనిత పిలుపునిచ్చారు. గంజాయి రవాణా, సాగును అరికట్టడానికి 450 మంది సిబ్బంది తో పనిచేస్తున్నఈగల్‌ఖి టాస్క్‌ఫోర్స్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని కొనియాడారు. గత గత ప్రభుత్వ కాలంలో ఏజెన్సీ పరిధిలో దాదాపు 20 వేల ఎకరాల్లో గంజాయి సాగు జరిగేదని దానిని ధ్వంసం చేశామని, ప్రస్తుతం అక్కడ గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించి ఖీజీరో కల్టివేషన్‌ఖి సాధించామని స్పష్టం చేశారు. లిక్విడ్ గంజాయి (హాష్ ఆయిల్) తయారీ కేంద్రాలపై కూడా కఠినచర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గంజాయి లేదా డ్రగ్స్ రవాణా చేసినా, దగ్గర పెట్టు కున్నా, కన్స్యూమ్ చేసినా ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. పట్టుబడితే కనీసం ఆరు నెలల పాటు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. విజయవాడ కమిషనరేట్ పరిధిలో ప్రతి మూలలోనూ సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడైనా గంజాయి లేదా డ్రగ్స్ అమ్మకాలు, రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే 1972 నెంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలని హోం మంత్రి పిలుపు నిచ్చారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హోమ్ మంత్రి అనిత హామీ ఇచ్చారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమం, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి, 20 సూత్రాల కార్యక్రమ అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఈగల్ వింగ్ ఎస్పీ కె. నగేష్ కుమార్, నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్ సంస్థ రాష్ట్ర సమన్వయ అధికారి ఉమారాణి, తదితరు పాల్గొని ప్రసంగించారు. అనంతరం 'నా దేశాన్ని మాదక ద్రవ్యరహితంగా మార్చడానికి నా శక్తి మేరకు నేను కృషి చేస్తా'నని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఈగల్ వింగ్ ఏర్పాటుచేసిన స్టాల్స్ ను హోం మంత్రి పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సిగ్నేచర్ క్యాంపెయిన్ లో "సే నోటు డ్రగ్స్"అని హోం మంత్రి అనిత, డ్రగ్స్ వద్దు బ్రో అని జిల్లా కలెక్టర్ డా.జి లక్ష్మీ శా సిగ్నేచర్‌లు చేశారు. ఈ కార్యక్రమంలో ఈగిల్ వింగ్ ఎస్పీ జి. స్వరూపారాణి, రాష్ట్ర స్థాయి దేవి ఇన్స్టిట్యూషనల్ సొసైటీస్ చైర్ పర్సన్ శ్రీమతి దేవి, స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ, ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారి ఐఎఎస్ ఆర్ణ వీడియో చూసి నవ్వకుండా ఉండలేరు: సిఎం చంద్రబాబు




**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** సోషల్ మీడియాలో ఐఏఎస్ ఆర్ణగా ఎంతో గుర్తింపు పొందిన ఓ చిన్నారి పోస్ట్ చేసిన వీడియోపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సరదాగా స్పందించారు. ఈ వీడియోను చూసి నవ్వకుండా ఉండలేరంటూ ఆయన వ్యాఖ్యానించారు. చిన్నారి ఆర్ణకు తన పూర్తి మద్దతు ఉంటుందని కూడా ఆయన హామీ ఇచ్చారు. ఇటీవల ఆర్ణ తండ్రి తన కుమార్తెకు సంబంధించిన ఓ వీడియోను ఎఐ సహకారంతో రూపొందించి సోషల్ మీడియాలో పంచుకున్నారు. నటుడు వెంకటేశ్ సినిమాలోని డైలాగులను బ్యాక్‌గ్రౌండ్ లో జతచేసి ఈ వీడియోను రూపొం దించారు. తన క్యూట్ హావభావాలతో ఆర్ణ ఆకట్టుకోవడంతో ఈ వీడియో క్షణాల్లో వైరల్ అయింది. లక్షలాది మంది నెటిజన్లు ఈ వీడియోను చూసి మురిసిపోయారు. ఈ వైరల్ వీడియో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా వెళ్లింది. దీనిపై ఆయన తన అధికారిక ఇన్స్టాగ్రామ్ ఖాతాలో స్పందించారు. "సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చిన్నారి ఐఏఎస్ ఆర్ణ వీడియో చూసి నవ్వకుండా ఉండలేరు" అని పోస్ట్ చేశారు. అంతేకాకుండా ఆర్ణకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని కూడా ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్పందనతో ఈ వీడియో ఇప్పుడు మరింతగా ట్రెండ్ అవుతోంది. ఇప్పటికే సోషల్ మీడియా స్టార్‌గా ఉన్న ఆర్ణకు, సీఎం నుంచి ప్రశంసలు దక్కాయి.

# తిరుమల సమాచారం



## శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత

### - తిరుమలలో డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా

**తిరుమల, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీసుశాఖలో స్నేహపూర్వక సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామని, ప్రజలకు పోలీసు శాఖపై మరింత విశ్వాసం పెరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించేలా చూస్తున్నామని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. తిరుపతి జిల్లా పోలీసు శాఖ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సమర్థ వంతంగా పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. హిందూ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీవారి ఆలయ భద్రతతోబాటు యాత్రికుల రక్షణకు పోలీసుశాఖ నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోందన్నారు. పూర్తిస్థాయిలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా ఆలయం పరిసరాలేగాక తిరుమల మొత్తం భక్తుల కదలికలపై నిఘా ఉంచుతున్నారన్నారు. టిటిడితో కలసి పోలీస్‌శాఖ భద్రత పరంగా అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. శుక్రవారం ఉదయం ఎపి డిజిపి హరీష్‌కుమార్‌గుప్త కుటుంబంతో కలసి తిరుమలకు చేరుకున్నారు. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ స్వాగతం పలికారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందు కున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర డిజిపి గుప్తాకు శ్రీవారితీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీవారి చిత్రపటం అందజేశారు.

## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.45 లక్షలు విరాళం



**తిరుమల, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన సాయి బాలాజీ డెవెలపర్స్ సంస్థ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.45 లక్షలు విరాళంగా అందించింది. ఆ సంస్థ భాగస్వామి ఆకుల రవికుమార్ తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడిలను అందజేశారు.

## శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



**తిరుమల, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌లో పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్‌కుమార్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్‌కుమార్, జస్టిస్ సుబేందుసమంత, జస్టిస్ దుర్గాప్రసాద్, జస్టిస్ బులుసు శివశంకరరావు తదితరులు ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## బారాషాహీద్ దర్గా రొట్టెల పండుగ



**నెల్లూరు(కలెక్టరేట్), జూన్ 26 ప్రభాతవార్త:** మొదటి రోజు బారాషాహీద్ దర్గా రొట్టెల పండుగ సందల్ మాలీతో మొదలవుతుంది. 2026లో ఈ పండుగ జూన్ 26, శుక్రవారం నుంచి మొదలైంది. మొదటి రోజు కార్యక్రమం సందల్ మాలీ / సొందల్ మాలీ. దర్గాలోని 12 మంది వీరుల సమాధులకు ఔషధ లేపనం/గంధం పూస్తారు. ఇదే పండుగ ప్రారంభ వేడుక. భక్తులు చెరువులో స్నానం చేసి, తమ కోర్కెల రొట్టెలు తీసుకొని ఒకరికొకరు మార్చుకుంటారు. మొక్కు తీరినవాళ్లు తెచ్చిన రొట్టెను కొత్తగా మొక్కుకునే వాళ్లు తీసుకుంటారు దర్గా దర్శనం చేసుకొని 12 మంది వీరుల సమాధులకు మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఏడాది 1416 లక్షల మంది వస్తారని అంచనా. భద్రత, శానిటేషన్, మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేశారు.

# నేర నియంత్రణలో తిరుపతి జిల్లా భేష్

- మెరుగైన ప్రజా సేవల దిశగా కార్యక్రమాలు • డిజిపి హరీష్‌కుమార్ గుప్తా



**తిరుపతి, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** పుణ్యక్షేత్రాలకు నిలయమైన తిరుపతి జిల్లాలో అటు యాత్రికుల ఇటు ప్రజల భద్రతకు ఆధునిక సాంకేతిక ఆధారిత పోలీసింగ్ విధానం అమలుచేస్తుండటం అభినందనీయమని రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా అన్నారు. పోలీస్ సంక్షేమం, మెరుగైన ప్రజా సేవల దిశగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్ర మాలను ఈ సందర్భంగా డిజిపి అభినందిం చారు. ఇదే స్ఫూర్తితో యాత్రాస్థలం, నిత్యం విఐపిల తాకిడి ఉండే తిరుపతిజిల్లాలో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అధికా రులకు సూచించారు. రెండురోజుల తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఉదయం పోలీస్ వెల్ఫేర్ క్యాంటీన్, జిల్లా పోలీస్ కార్యాలయం ప్రధాన ప్రవేశ ద్వారం (గ్రౌండ్ గేట్), ప్రహరీగోడ నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం జిల్లాలో శాంతి భద్రతలు, నేర నియంత్రణ, పోలీస్ సంక్షేమం, సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌పై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిపారు. డ్రోన్లు, సైబర్ మానిటరింగ్‌తో పటిష్ట భద్రతా వ్యవస్థ నిర్వ హిస్తుండటం పట్ల డిజిపి ప్రశంసించారు. మాదకద్రవ్యాల విక్రయాలు, వాడకం నిర్మూ లనలో తిరుపతి పోలీసుల చర్యలు పూర్తిస్థాయి లో సత్ఫలితాలు నిస్తున్నాయన్నారు. శాంతిభద్ర తల విభాగం అదనపు డిజిపి మధుసూదన్ రెడ్డి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బ రాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాసులుతో కలసి శుక్రవారం తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. జిల్లా పోలీసింగ్, శాంతిభద్రతలు, నేర నియంత్రణ, ప్రజా భద్రత, పోలీస్ సంక్షేమం తదితర అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలవు తున్న పోలీసింగ్ విధానాలు, ప్రజా భద్రత చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణపై సమగ్ర ప్రజెంటేషన్‌ను ఎస్పీ సుబ్బరాయుడు అందిం చారు. కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, సిపి కెమెరా ల పర్యవేక్షణ, రాత్రి బీట్ వ్యవస్థ, ఇంటిగ్రేటెడ్ పోలీసింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన విని యోగంపై డిజిపి సమీక్షించారు.

ప్రజా భద్రతను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో డ్రోన్ సాంకేతికతను నేర నియంత్రణ, జనసమ్మర్ద నిర్వహణ, ప్రత్యేక ఆపరేషన్లలో సమర్థవంతంగా వినియోగిస్తున్నట్లు గుప్తా తెలుసుకున్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా డ్రగ్ టెస్టింగ్, అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ యువతను రక్షించేందుకు చర్యలు చేపడు తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. మహిళల భద్రత కోసం శక్తి టీమ్ ద్వారా తక్షణ స్పందన, అవగాహన కార్యక్రమాలు సమర్థ వంతంగా అమలవు తున్నాయని, సైబర్ నేరాల నియంత్రణకు ఏర్పాటు చేసిన సైబర్, సామాజిక మాధ్యమాల మానిటరింగ్ వ్యవస్థ చురుకుగా పనిచేస్తోందని డిజిపి ప్రశంసించారు.

అంతేగాక తిరుపతి జిల్లాలో రోడ్డుప్రమాదాల నివారణకు ఇటీవల జిల్లా కలెక్టర్‌తో కలిసి నిర్వహించిన రహదారి భద్రత బస్సు యాత్ర, ప్రమాదాలకు గురయ్యే (బ్లాక్ స్పాట్స్) ప్రాంతాల గుర్తింపు, ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాల వివరాలను కూడా ఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు శ్రీనివాస్, రవిమనోహరచారి, శ్రీలత, రామకృష్ణ, డిఎస్పీలు, సిఐలు, పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం నాయకులు సోమశేఖరరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బంగారు కవచం తొలగించి వేదోక్తంగా ఉత్సవర్లకు జ్యేష్ఠాభిషేకం



**తిరుమల, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** జ్యేష్ఠమాసంలో జ్యేష్ఠా నక్షత్రానికి ముగిసేట్లుగా ప్రతి సంవ త్సరం మూడురోజుల పాటు తిరు మల శ్రీవారికి నిర్వహించే జ్యేష్ఠా భిషేకం శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. తరతరాలుగా అభిషేకాలతో అత్యంత ప్రాచీనము లైన స్వామివారి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షించేందుకు 1990వ సంవత్సరంలో ఈ ఉత్స వాన్ని ఏర్పాటు చేశారు. ఆలయం లోని సంపంగి ప్రదక్షిణంలో ఉన్న కల్యాణమండపంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఋత్వికులు శాంతి హోమం నిర్వహించారు. శతకలశ ప్రతిష్ఠ ఆవాహన, నవకలశ ప్రతిష్ఠ ఆవాహన, కంకణ ప్రతిష్ఠ అనంతరం స్వామి, అమ్మవార్లకు అర్ఘ్యం, పాద్యం, ఆచమనీయం చేసి కంకణధారణ చేశారు. ఆ తరువాత శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి కి వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. వేదపండితులు శ్రీసూక్తం, భూ సూక్తం, పురుష సూక్తం, నీలా సూక్తం, నారాయణ సూక్తాలను పఠిస్తుండగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేపట్టారు. సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వజ్రకవచాన్ని అలంకరించారు. సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవమూర్తులు వజ్రకవచంలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. నేడు ఉత్సవర్లు ముత్యపు కవచంతో, ఆదివారం స్వర్ణ కవచంతో స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ అర్చకులు పాల్గొన్నారు.

## వకుళమాత సన్నిధిలో 'అక్షర గోవిందం'

- జులై 3 నుండి చిన్నారులకు అక్షరాభ్యాసం • అన్నప్రాశన సేవలు



**తిరుమల, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** చిన్నారుల్లో సనాతన ధర్మ సంప్రదాయాలపై ఆసక్తి పెంపొందించి వారి విద్యారంభం, జీవితారంభం దైవానుగ్రహంతో శుభప్రదంగా సాగాలనే సంకల్పంతో టిటిడి జూలై 3 నుండి "అక్షరగోవిందం" కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. సాక్షాత్తు శ్రీవేంకటేశ్వర స్వామి తల్లి తిరుపతి రూరల్ పేరూరు వద్ద వకుళామాత ఆలయంలో నూతనంగా "అక్షర గోవిందం" అన్నప్రాశన కార్యక్రమాలను ప్రారంభించనుంది. శ్రీ వేంకటేశ్వరస్వామి, వకుళామాత ఆశీస్సులతో అక్షరాభ్యాసాన్ని జులై 3వ తేదీ మధ్యాహ్నం 12గంటల నుండి 12.30 గంటల వరకు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వకుళామాత సన్నిధిలో చిన్నారులకు సంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాసం నిర్వహిస్తారు. కార్యక్రమం అనంతరం ఆశీర్వచనం, ప్రసాదం, ప్రత్యేక "అక్షర గోవిందం కిట్" అందజేస్తారు.

**3 నుండి 5 సంవత్సరాల చిన్నారులకు అవకాశం:** అక్షరగోవిందం, అన్నప్రాశనం కార్యక్రమంలో 3 నుండి 5 సంవత్సరాల వయస్సు చిన్నారులు పాల్గొనవచ్చు. అక్షర గోవిందం కిట్‌లో రాతపలక, బలపాలు, అకింతలు, పసుపు, కుంకుమ, శ్రీవారి కంకణం, ఫటిక బెల్లం, వకుళామాత, వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారు, సరస్వతీదేవి చిత్రపటాలు, గోవింద నామాలు, వేంకటేశ్వర సుప్రభాతం, పెద్ద బాలశిక్ష తదితర పూజా, విద్యా సామగ్రిని ఉచితంగా అందజేస్తారు.

**వేదోక్తంగా అన్నప్రాశన సేవ:** ఆలయ అర్చకుల పర్యవేక్షణలో వేదమంత్రోచ్చారణల మధ్య చిన్నారులకు తొలి అన్నప్రాశనను ఆగమోక్తం గా నిర్వహించి, వేంకటేశ్వరస్వామి, వకుళా మాతల ఆశీస్సులను అందజేస్తారు.

జులై 4 నుండి మంగళవారం మినహా అన్ని రోజుల్లో వకుళమాత ఆలయ అర్చకులు నిర్ణయించిన శుభ ముహూర్తంలో ఆలయంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ బ్యాచ్‌కు 25 మంది చిన్నారులు చొప్పున రెండు బ్యాచ్‌లలో మొత్తం 50 మందికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు గంట ముందస్తుగా ఆలయ ప్రాంగణంలో పేర్లు నమోదు చేసుకోవాలి. చిన్నారులు తల్లిదండ్రులు, సంరక్షకులతో కలిసి సంప్రదాయ వస్త్రధారణలో హాజరుకావాలని టిటిడి సూచించింది. వకుళామాత, వేంకటేశ్వరస్వామి దివ్య అనుగ్రహంతో తమ పిల్లల విద్యారంభం, అన్నప్రాశనను పవిత్రంగా నిర్వహించుకునేందుకు ఈ ప్రత్యేక సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

## పంచాయతీరాజ్ శాఖలో ప్రమోషన్లు

- 42 మంది ఎంపిడిఒలకు డిడిఒలుగా పదోన్నతి
- కూటమి సర్కారొచ్చాక10 వేల మందికి పైగా...

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** డిప్యూటీ సిఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆ శాఖ అధికారులకు శుభవార్త చెప్పారు. 42 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు (ఎంపిడిఒ), డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా (డిడిఒలు) పదోన్నతులు కల్పించే ప్రక్రియకు పచ్చజెండా ఊపారు. ఇందుకు సంబంధిం చిన సీనియారిటీ జాబితాను డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ (డిపిసి) ఆమోదించింది. దీంతో త్వరలోనే వీరందరూ ఉన్నత హోదాలో బాధ్యతలు చేపట్ట నున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధి శాఖల్లో పదోన్నతుల ప్రక్రియ నిరంత రంగా కొనసాగుతోంది. ఇప్పటికే సుమారు 10 వేల మందికి పైగా సిబ్బందికి ప్రమోషన్లు కల్పించారు. గత పదేళ్లలో ఇంత భారీ సంఖ్యలో ఈ శాఖలో పదోన్నతులు ఇవ్వడం ఇదే ప్రథమమని అధికారులు చెబుతున్నారు.

# ఉద్యాన వర్సిటీ 38 రకాల నూతన వంగడాలను అభివృద్ధి చేయటం అభినందనీయం

### కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ



**తాడేపల్లిగూడెం, జూన్ 26 ప్రభాతవార్త:** ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించటమే లక్ష్యంగా ఉద్యాన విశ్వ విద్యాలయం 38 రకాల నూతన వంగడాలను అభివృద్ధి చేయటం అభినందనీయమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కితాబిచ్చారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం 19వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రాంగణంలోని క్రీడా మైదానంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ కట్టుపల్లి ధనుంజయరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం తన 19 ఏళ్ల ప్రస్థానంలో జాతీయస్థాయిలో ఎన్నో మైలురాళ్ళను అధిగమించటం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు సామాజిక స్పృహతో, రైతుల పక్షాన ఆలోచించే దృక్పథంతో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఉద్యాన విద్య, పరిశోధనలు కేవలం ఆదాయం, ఉద్యోగాల కల్పన కోసమే కాకుండా ప్రజలకు పౌష్టికాహార భద్రత ఆరోగ్య భద్రత కల్పించే గొప్ప కార్యక్రమంలో భాగస్వామ్యాలవుతారని ఉద్యాన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విశ్వ విద్యాలయానికి అవసరమైన ఆడిటోరియం నిర్మాణానికి అవసరమైన నిధులను, బిఎస్సి హార్టికల్చర్ డిగ్రీకి యూజీసీ నుంచి తగిన గుర్తింపు ఇప్పించడానికి కేంద్ర స్థాయిలో కృషి చేస్తానని వివరించారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ కట్టుపల్లి ధనుంజయరావు మాట్లాడుతూ పరిశోధన రంగంలో, విశ్వ విద్యాలయం 38 నూతన ఉద్యాన వంగడాలను రాష్ట్ర విత్తన ఉపసంఘం ద్వారా, 31 పంట రకాలను కేంద్ర విత్తన ఉపసంఘం ద్వారా విడుదల చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. పలు పరిశోధన కేంద్రాలు జాతీయ స్థాయిలో ఉత్తమ కేంద్రాల అవార్డులను అందుకున్నాయని, ఆర్‌కెవివై పథకం కింద విలువైన పరిశోధన ప్రాజెక్టులు మంజూరయ్యాయని తెలిపారు. విస్తరణ కార్యక్రమాల్లో భాగంగా, ఉద్యాన మిత్ర, ఉద్యాన వాణి, యూట్యూబ్ ఛానల్, డిజిటల్ శిక్షణలు, రైతు సలహా సేవల ద్వారా లక్షలాది మంది రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నామని చెప్పారు. రైతు సమస్యలకు తక్షణ పరిష్కారాలను అందించడానికి ఆధునిక డిజిటల్ వేదికలను సమర్థవంతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయం సాధించిన విజయాలను ప్రతిబింబించే ప్రత్యేక వీడియో ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.మాధవి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సీహెచ్. రూత్, డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ బి.ప్రసన్న కుమార్, యూనివర్సిటి లైబ్రేరియన్ డాక్టర్ సి.మధుమతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్ఎస్ విజయ పద్మ, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ డి.వెంకటస్వామి, డాక్టర్ చలపతిరావు, డాక్టర్ విజయ్ భాస్కర్, డాక్టర్ కరుణశ్రీ, డాక్టర్ ఇమ్మాన్యూల్, డాక్టర్ సుశీలతోపాటు విశ్వ విద్యాలయం పరిధిలోని అన్ని సంస్థల నుంచి అధికారులు శాస్త్రవేత్తలు, రైతులు భారీగా హాజరయ్యారు.

## రఘురామకృష్ణంరాజు స్థలం కబ్జా యత్నం

**విశాఖపట్నం, జూన్ 26 ప్రభాతవార్త:** అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు చెందిన 333 గజాల స్థలాన్ని కబ్జా చేసేందుకు భూ బకాసుర్ల ముఠా ప్రయత్నించడం సంచలనం సృష్టిస్తోంది. విశాఖపట్నంలోని మధురవాడలో ఉన్న ఈ స్థలానికి సంబంధించి ఫోర్జరీ సంతకాలతో యథేచ్ఛగా నకిలీ రిజిస్ట్రేషన్లు చేసినట్లు వెలుగులోకి వచ్చింది. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు చెందిన రూ.2 కోట్లకు పైగా విలువైన స్థలాన్ని నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు ఒక ముఠా ప్రయత్నించడం సంచలనం సృష్టిస్తోంది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు 1989లోనే విశాఖ మధురవాడ పరిధిలో 333.33 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం దీని ధర రూ.2 కోట్లకు పైగా ఉంటుంది. అయితే, ఈ విలువైన స్థలంపై కన్నేసిన కొందరు కేటుగాళ్లు.. రఘురామకృష్ణంరాజు సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలను సృష్టించారు. ఆ ఫోర్జరీ డాక్యుమెంట్లతో సదరు స్థలాన్ని పలుమార్లు ఒకరి నుంచి ఒకరికి యాజమాన్య బదిలీ (రిజిస్ట్రేషన్) కూడా చేసినట్లు తెలుస్తుంది.

ఈ ఏడాది మే 25, 26 తేదీల్లో కొందరు వ్యక్తులు ఆ స్థలంలోకి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో స్థానికంగా ఉన్న రఘురామకృష్ణంరాజు స్నేహితుడు ఈ విషయాన్ని గమనించి, తక్షణమే ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన రఘురామకృష్ణంరాజు.. తన వద్ద ఉన్న ఒరిజినల్ డాక్యుమెంట్లను, సదరు వ్యక్తులు చూపిస్తున్న కాగితాలను పరిశీలించగా అసలు విషయం బయటపడింది. తన సంతకాన్ని పక్కాగా ఫోర్జరీ చేసి, నకిలీ రిజిస్ట్రేషన్లతో భూమిని కాజేయాలని చూసినట్లు ఆయన గుర్తించారు. దీంతో పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. తన స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించిన వారితో పాటు, ఈ ఫోర్జరీ వెనుక ఉన్న దోషులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదుల కోరారు. సదరు నకిలీ రిజిస్ట్రేషన్లు ఎక్కడ జరిగాయి, దీని వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులు ఎవరు అనే కోణంలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసినట్లు తెలుస్తుంది.

వార్త

మేధావి అంటే మరెవరో కాదు. ప్రతి చిన్న పెద్ద విషయాన్ని స్పష్టంగా చూడగలవాడే మేధావి.

- గోథె

# వెనిజులా విలవిల


సహజ వనరులకు సంపన్నమైన 'వెనెజులా' ఒక్కసారిగా ప్రకృతి కన్నెర్ర చేసి ఒకే ఒక నిమిషంలో 235 మందిని పొట్టన పెట్టుకుంది. ఎన్నో ఆర్థిక రాజకీయ, సామాజిక సంక్షోభంతో అతలాకుతలమవుతున్న ఆ దేశానికి నిన్నటి తాజా భూకంప విలయం సృష్టించిన విధ్వంస నష్టం తక్కువేమీ కాదు. లాటిన్ అమెరికాలో అత్యంత ధనిక దేశంగా పేర్కొనబడే వెనెజులాను అన్ని సమస్యలు ఒకేసారి చుట్టుముట్టేస్తున్నాయి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పేదరికం, భారీ వలసలు ఆ దేశాన్ని ఇబ్బందుల్లో ముంచెత్తాయి. కోలుకోవడానికి చాలా సమయం పడుతుంది. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న ఈ దేశం గత యేడాది ఆ దేశ అధ్యక్షుడిని అమెరికా బందీ చేయడంతో తీరని నష్టం పొందింది. తాత్కాలిక పాలనలో ఏమాత్రం కుదుర్చుకున్నట్లు లేదు. తీరా ఈ ఉత్పాతం పెను భూకంపంతో వెనెజులా చిగురుటాకులా వణికిపోయింది. నిమిషం వ్యత్యాసంలో రెండు భారీ భూ ప్రకంపనల 'డబ్లెట్' తో దేశమంతా ఒక్కసారిగా అల్లాడిపోయింది. కరాకస్, లా గువైరాల్లో భారీ విధ్వంసమే జరిగింది. భారీ భవనాలెన్నో కుప్పకూలాయి. విద్యుత్ కమ్యూనికేషన్ వ్యవస్థలు నామ రూపాల్లేకుండా పోయాయి. భూకంప తీవ్రత మానవ నష్టం భారీగానే జరిగింది. ఉత్తర వెనెజులాలో గురువారం రెక్టర్ స్కేలుపై 7.2, 7.5 తీవ్రతలతో రెండు శక్తివంతమైన భూకంపాలు నమోదయ్యాయి. కూలిన భవన శిథిలాల్లో వేల మంది ఉండి ఉండచ్చునని ఒక అంచనా. కానీ శిథిలాలు తొలగిస్తే తప్ప ఎంత ప్రాణ నష్టం వాటిల్లిందో చెప్పలేని పరిస్థితి. ఒక ప్రకృతి విపత్తు ఎంతటి మానవ విషాదంగా మారుతుందో ఈ భూకంప దుర్ఘటనలు వివరిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ముందుగా కాలిఫోర్నియా, తర్వాత వెనెజులా, ఆ తర్వాత జపాన్‌లో వరుస భూకంపాలు రావడం నిజంగా ఆశ్చర్యకరమే. వెనెజులా భూకంపం గురించి గూగుల్ కాస్త ముందుగానే అప్రమత్తం చేసింది. ఆండ్రాయిడ్ యూజర్లకు హెచ్చరిక సంకేతాలు పంపింది. అయినా తక్షణ అప్రమత్తత చేసుకోగల వ్యవస్థలను వెనెజులా అభివృద్ధి చేసుకోలేకపోయినందున ప్రాణనష్టం తగ్గించు కోలేకపోయింది. ప్రకృతి విపత్తులను అడ్డుకోవడం మానవ సాధ్యం కాదు. కానీ వాటి ప్రభావాన్ని తగ్గించు కునే విధంగా మానవాళిని సిద్ధం చేయడంలో వెనెజులా వెనుకబడింది. ఈ విషాద తీవ్రత, అప్రమత్తత లేని భూకంప వాతావరణం వెరసి వెనెజులాను ఇప్పట్లో కోలుకోలేని పరిస్థితులు తెచ్చి పెట్టాయి. నాణ్యమైన మౌలిక సదుపాయాలున్న చోట్ల ప్రకృతి విపత్తులను మానవ విపత్తులుగా మారకుండా గణనీయంగా తగ్గించుకోవడం ఎంతో అవసరం. ఎన్నో చమురు బావుల్ని, సంపదను తనలో ఇముడ్చుకున్న వెనెజులాలో భూకంప నిరోధక నిర్మాణ నిబంధనలంటూ ఏమీ లేవు. ఎప్పటికప్పుడు పాత భవనాల భద్రతా అంచనాలు, నూతన భవనాల నిర్మాణంలో ఆధునిక నిర్మాణ వ్యవస్థలను బలోపేతం చేయడంలో అక్కడి పాలనా వ్యవస్థకు ఇంకా అలవాటుకాలేదు. ఈనాటి భూకంపం చాలా రోజుల తర్వాత వచ్చినందున భూకంప సమీక్ష అప్రమత్తత కష్టమైనదే. వెనెజులా భూకంపం ప్రమాదనంతర చర్యలు, విపత్తు నిర్వహణా సామర్థ్యాల విషయమై ప్రపంచానికే ఓ హెచ్చరిక కాగలదు. ప్రపంచ వ్యాప్తంగా జపాన్, చిలీ, వంటి భూకంప ప్రభావిత దేశాలు, కఠిన నిర్మాణ ప్రమాణాలు, ముందస్తు హెచ్చరికల ప్రమాణాలు, ప్రకృతి విపత్తులనెదుర్కోవడంలో ప్రజలకు అవగాహన, సిబ్బందికి శిక్షణ వంటివన్నీ ఆయా దేశాలను స్వయం సిద్ధం చేస్తాయి. కానీ మిగిలిన దేశాల్లో ఈ వ్యవస్థలు లోపభూయిష్టంగా ఉన్నాయి. ఇప్పటికే వెనెజులా ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, సరైన పాలనాలేమి వంటి అంశాలు ఆ దేశాన్ని తిరోగమనంలోకి నెట్టుతున్నాయి. భూకంప ప్రభావంతో ఎంతో మంది నిరాశ్రయులయ్యారు. జూన్ 25న తెల్లవారుఝామున 3.34 నిమిషాలకు వెనెజులాలో భూకంపం జరిగింది. కాస్త అటూ ఇటూలో మూడు ఖండాల్లో భూకంపాలు రావడానికి ఏమాత్రం సంబంధం లేదు. మొత్తంగా వెనెజులాకే ఎక్కువ నష్టం సంభవించింది. గతం కన్నా నయం 'భూకంపం చెప్పి రాదనే' పరిస్థితి నుంచి ఈసారి వెనెజులాలో భూకంపం వస్తోందని గూగుల్ ఆ దేశంలోని లక్షలాది ఆండ్రాయిడ్ ఫోన్లలో భూకంప హెచ్చరికలను ముందే మోగించింది. కానీ వారిలో సంసిద్ధత కనుపించలేదు. దాని బాధ్యత పాలక ప్రభుత్వాలు రూపొందించే ప్రణాళికలు, వ్యవస్థ లదే. గూగుల్ ఆండ్రాయిల్ ఎర్త్ క్వేక్, అలర్ట్ సిస్టమ్ ఉండటం తక్షణ స్పందనతో ప్రజల్ని తనకున్న వనరుల మేరకు భూకంప హెచ్చరికలు పంపడం ఆధునిక యుగంలో ఆహ్వానించదగినదే. గూగుల్ తపని తాను చేసింది. స్వల్ప సమయంలో భూమి కంపించడంతో ఎవరూ ఏమాత్రం జాగ్రత్త పడలేకపోయారు. ఇంతవరకు గతం ప్రస్తుతంలోకి వస్తే వెనెజులా ప్రభుత్వం ఏవిధంగా భూకంప పర్యవసానాలను గట్టెక్కించగలదో వేచి చూడాలి. దెబ్బతిన్న ఇల్లు ఆసుపత్రుల పునర్నిర్మాణం కోసం రూ.1890 కోట్లతో ప్రత్యేక ఫండ్‌ను ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగేజ్ ప్రకటించారు. వెనెజులాలో గత వందేళ్లలో సంభవించిన అతిపెద్ద భూకంపం ఇదే. సమీపంలోని బ్రెజిల్, కొలంబియా సహా మరికొన్ని దేశాల్లో భూకంపనలు వ్యాపించాయి. అక్కడ పెద్ద నష్టమేమీ లేదు. భూప్రకంపనలతో వేలాది మంది చనిపోయి ఉండొచ్చునని అధికారులు అంచనా వేశారు. ఏదిఏమైనా వెనెజులాలకు రాకూడని కష్టం వచ్చింది. ఇప్పుడు బాధితులకు సత్వర సేవలను ఆధునిక విధానంలో అందించడమొక్కటే ఆ దేశ లక్ష్యంగా కనపడుతోంది.

మనుషులందరూ వృద్ధులుగా మారతారు. కాని మంచివారుగా మారటం అరుదు.



స్వీడెన్ బర్గ్

శారీరక సామర్థ్యం ద్వారా మనకు బలం రాదు. అణచిపెట్టలేనంతటి ఆత్మబలం ద్వారానే అది లభిస్తుంది.



మహాత్మా గాంధీ

# పాలకుల నిర్వాకానికి దర్పణం ధరలే

**అదుపులేకుండా పెరిగిపోతున్న ధరలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. బడుగు, పేద వర్గాలే కాదు మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. పరిమితిలేని ఆదాయం కలవారి గురించి చింతలేదు కానీ రెక్కాడితే కానీ డొక్కాడని ప్రజలు, నెలసరి జీతగాళ్లు, పరిమిత ఆదాయం గలవారి పరిస్థితి అయోమయంగా తయారయింది. ఇతర మార్గాల్లో ఆదాయం ఉంటే తప్ప సంసారాన్ని నడపలేని పరిస్థితులు దాపురించాయి. ఎన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా అన్ని వర్గాలకు సంబంధించిన ఈ ధరల పెరుగుదల సమస్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదు. గతంలో ఉల్లిగడ్డల ధరలు పెరగడంతో అధికారాన్ని కోల్పోయిన కేంద్ర ప్రభుత్వ పెద్దలను చూశాం. పాలకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా, ఉద్యోగుల జీతభత్యాలు ఏ రీతిలో పెంచినా ఆశించిన ఫలితాలు రాకపోగా పేదరికం మరింత పెరుగుతుంది.**

దామెర్ల సాయిబాబ

అదుపు ఆజ్ఞా లేకుండా పెరిగిపోతున్న ధరలను నియంత్రిస్తాం, నల్లబజారుదారులపై ఉక్కుపాదం మోపుతాం అంటూ ఎవరు అధికారంలో ఉన్నా చెప్పే మాటలే చెప్తున్నారు తప్ప ఆచరణలో మాత్రం చేయలేకపోతున్నారు. స్వరం మారుతున్నదేతప్ప పాట మాత్రం పాతదే అన్నట్లుగా ఉంది పాలకుల ధోరణి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ధరల విషయంలో ఆవేదన, ఆందోళన వ్యక్తం చేసి రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేపట్టిన నేతలే అధికారంలోకి రావడంతోనే మారిపోతున్నారు. ఇటీవల అదుపు లేకుండా పెరిగిపోతున్న నిత్యావసర ధరలతో సామాన్యులు విలవిల్లాడిపోతున్నారు. ఒక్కరోజు ఉన్న ధర మరుసటి రోజు ఉండడం లేదు. ఒక పట్టణంలో ఉన్న ధర మరో నగరంలో ఉండడం లేదు. ఇక ధరలు కొండెక్కడానికి గల కారణాలు, కారకులు ఎవరో, ఎవరికి చెప్పుకోవాలో, ఎవరు చర్యలు తీసుకుంటారో దిక్కుతోచక సన్నజనంతోపాటు మధ్యతరగతి ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. పోని ఉత్పత్తి చేస్తున్న రైతుకు గిట్టుబాటు ధర వస్తున్నదంటే అదీ లేదు. అక్కడ పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. పండించిన పంటలకు ధరలు తగ్గిపోతున్నాయి. గిట్టుబాటు ధరలు రాక అన్నదాతలు అన్నానికి జరక్క, అప్పులు చెల్లించలేక, ఆత్మాభిమానం చంపులేక ప్రాణత్యాగం చేస్తున్నారు. రైతుల వద్ద పంటలు ఉన్నప్పుడు వాటి ధరలు విపరీతంగా పడిపోతున్నాయి. వారి వద్ద నుంచి ప్రైవేట్ వ్యక్తుల గోదాముల్లోకి చేరుకోగానే ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి.ఇదంతా ఒక పక్కా వ్యూహం ప్రకారం కృత్రిమ కొరత సృష్టించి ఇష్టానుసారంగా ధరలను పెంచుకుంటున్నారు. ఇదేదో ఇప్పటికిప్పుడు కొత్తగా వచ్చిందని చెప్పడం లేదు. ఎప్పటి నుంచో జరుగుతున్నది. రాను రాను పెరిగిపోతున్నది.ఇందులో కొందరు దళారులు,వ్యాపారస్తులు కీలకపాత్ర వహిస్తారన్న విషయం అధికారులతోసహా అందరికి తెలిసిందే. కొందరు దళారులు కమిషన్ల రూపంలో కోట్లాది రూపాయలు భోంచేస్తున్నారు. చట్టప్రకారం లైసెన్సులు పొందినా, నిబంధనలను అతిక్రమించిఅటు రైతులను, ఇటు వినియోగదారులను దోపిడీచేస్తున్నారు. ఇలా దోపిడీకి గురికాకుండా నివారించి రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించి వినియోగదారులకు సరసమైన ధరలకు నిత్యావసర వస్తువులను అందించడంలో కీలకపాత్ర వహించాల్సిన మార్కెట్ కమిటీలు రైతులు, వినియోగదారులకు భక్షక కంపెనీలుగా తయారయ్యాయి. దళారులను అదుపు చేయలేకపోగా కొన్ని చోట్ల వారితోనే కుమ్మక్కైపోతున్నారు. అనేక సందర్భాల్లో ఈ విషయాలు వెలుగుచూశాయి. రైతులు ఉద్యమించారు. ధర్నా చేశారు. కొన్ని చోట్లదాడులు కూడా చేశారు. అయినా ఏమాత్రం ఫలితంఉండడం లేదు. ఇందుకు ప్రధాన కారణం ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం అంటూ వేదికలు ఎక్కిఅరిచే పెద్దలే మార్కెట్ కమిటీల విషయంలో ఇదే ప్రజాస్వామ్యాన్ని భూస్థాపితం చేయడమే. నామినేషన్ పద్ధతి ఎవరు ఎప్పుడు ప్రవేశపెట్టారో కానీ, రైతుల పాలిట శాపాలుగా పరిణమించాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎంపిక కావాల్సిన రైతు ప్రతినిధులకు బదులు బంధుమిత్రులనో, లేక తమ తోకలుగా, బాకాలుగా ఉన్న రాజకీయ కార్యకర్తలను ఈ కమిటీల్లో నేతలు నియమించుకుంటున్నారు. ఇలా మార్కెట్ కమిటీలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా రూపాంతరం చెందాయి. ఇందులో ప్రజలచే తిరస్కరించబడినవారు, ఎన్నికల్లో పోటీ చేసే సత్తా లేనివారు, ప్రజాసేవ అంటే ఏమిటో తెలియని వారిని సైతం ఈ కమిటీల్లో చేర్పిస్తున్నారు. పాలకుల దయాదాక్షిణ్యాలమీద ఎంపిక అయిన పాలక మండళ్ల ఉనికి నామ మాత్రమే కాదు దళారుల సంక్షేమ ధ్యేయంగా పనిచేసే పరి స్థితులు ఏర్పడ్డాయి. పాలక మండళ్లకు ఏసి గదులు, కార్లు లాంటి సౌకర్యాలు కల్పించుకొనేందుకు మార్కెట్ కమిటీ నిధులు వెచ్చించే పెద్దలు రైతులు అహర్నిశలు కష్టపడి పండించి మార్కెట్లోకి తెచ్చిన పంటను వర్షం నుండి కాపాడుకునేందుకు టార్పాలియన్లు ఇవ్వలేకపోవడం పరిశీలిస్తే పరిస్థితి అర్థమవుతుంది. ధరల నిర్ణయంలో దళారులదే కీలక పాత్రగా మారిపోయింది. అవసరం అనుకుంటే పోటీగా ఇతర ప్రాంతాల నుంచిసరుకులు రప్పించి స్థానిక రైతుల ఉత్పత్తులను దెబ్బతీస్తున్నారు. కొందరు రైతుల పేరుతోనే గ్రామాల్లో సరుకును నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెరిగిన తర్వాత మార్కెట్లోకి దించుతున్నారు. ఇలా ఇష్టం వచ్చిన రీతిలో ఇష్టానుసారంగా ధరలు పెరిగిపోతున్నాయి. ఈ భాగోతమంతా బహిరంగంగా జరుగుతున్నా కోట్లాది మంది రైతులు అల్లాడుతున్నా పాలకులు హెచ్చరికలు, ప్రకటనలు సమీక్షలు, సమావేశాలతో కాలం గడుపుతున్నారే తప్ప ఏమీ చేయలేకపోతున్నారు. పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్నా మార్కెట్ కమిటీల్లో తమ అనుచరులను ఎలా నియమించుకోవాలి? ప్రత్యర్థులను ఎలా తొలగించాలి? అనే ఆలోచించి, చర్చించి చట్టాలు తెచ్చేందుకు ప్రయత్నాలు చేశారేతప్ప ఈ కమిటీలు ప్రజలకు ఎలా ఉపయోగపడుతు న్నాయి? రైతులకు ఎలా సేవలు అందిస్తున్నాయనే విషయంలో ఆలోచించడం లేదనే చెప్పొచ్చు. వ్యాపారులు లాభాల కోసమేవ్యాపారాలు చేస్తున్నారనేది వాస్తవం. అలాగే కమిషన్ల కోసమే దళారీ వ్యవస్థ ఉన్నదనేది కూడా నిజం. అలా వారు వ్యవహరించడాన్ని తప్పుపట్టలేం. కానీ నెలనెలా వేలాది రూపాయలు జీతభత్యాల రూపేణ ప్రజాధనాన్ని భోంచేస్తున్నా అధికారులను ఏమనుకోవాలి? కేవలం కొందరు అధికారుల అవినీతి, నిర్లక్ష్యం, అసమర్థత, ఆశ్రిత పక్షపాతం కారణంగా వీటన్నింటికి మించి రాజకీయ జోక్యంతోనే ఈపరిస్థితులు దాపురిస్తున్నాయి.ధరలు అదుపు తప్పు తున్నప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇతరప్రాంతాల నుంచి సరుకులు తెప్పించి వినియోగదారులకు అందుబాటులో ఉంచి ధరలను నియంత్రించేందుకు గతంలో ఎన్నోసార్లు ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు అలాంటి ప్రయత్నాలేమి జరగడం లేదు. గతంలో ఉల్లిగడ్డల ధరలు అందుబాటులో లేనంతగా పెరగడంతో ప్రభుత్వమే ఇతర రాష్ట్రాలనుంచి కొనుగోలుచేసి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకు వచ్చింది.దీంతోధరలు తగ్గాయి.అలానే కందిపప్పు విషయంలోకానీ ఇతర పప్పుధాన్యాల విషయంలో అప్పటి పాలకులు తీసుకున్న చర్యల కారణంగా ధరలను నియంత్రించగలిగారు. గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితే వస్తే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులతో ఒక్కసారిగా ఉమ్మడి రాష్ట్రంలో దాడులు నిర్వహించారు. కోట్లాది రూపాయల విలువైన అక్రమ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. అవన్నీ మార్కెట్లోకి రావడంతో ధరలు దిగి వచ్చాయి. ఏదిఏమైనా ధరలనియంత్రణ విషయంలో పాల కులు వ్యవహరిస్తున్న తీరుసర్వత్రా విమర్శలకు గురవుతున్న ది. అదుపులేకుండా పెరిగిపోతున్న ధరలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. బడుగు, పేద వర్గాలే కాదు మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు.పరిమితిలేని ఆదాయం కలవారి గురించి చింతలేదు కానీ రెక్కాడితేకానీ డొక్కాడని ప్రజలు, నెలసరి జీతగాళ్లు,పరిమిత ఆదాయంగలవారి పరిస్థితి అయోమయంగా తయారయింది. ఇతర మార్గాల్లో ఆదాయం ఉంటే తప్ప సంసారాన్ని నడపలేని పరిస్థితులు దాపురించాయి. ఎన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా అన్నివర్గాలకు సంబంధించిన ఈధరల పెరుగుదల సమస్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదు. గతంలో ఉల్లిగడ్డల ధరలు పెరగడంతో అధికారాన్ని కోల్పోయిన కేంద్ర ప్రభుత్వ పెద్దలను చూశాం. పాలకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా, ఉద్యోగుల జీతభత్యాలు ఏ రీతిలో పెంచినా ఆశించిన ఫలితాలు రాకపోగా పేదరికం మరింత పెరుగుతుంది. ●

## ఒక్క మాట

# ఉపాధి కల్పనకు మూలస్తంభాలు ఎంఎస్‌ఎంఈలు

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు ఏ దేశ ఆర్థిక వ్యవస్థకు, దాని సమగ్ర అభివృద్ధికి వెన్నెముక వంటివి. ఇవి స్థానిక, జాతీయ ఆర్థిక వ్యవస్థలకు, ముఖ్యంగా శ్రామిక పేదలు, మహిళలు, యువత, బలహీన వర్గాల వారి సుస్థిర జీవనోపాధులకు దోహదపడతాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం వ్యాపారాలలో 90శాతం, ఉపాధిలో 60-70 శాతం, ప్రపంచ జీడీపీలో 50 శాతం వాటా ఎంఎస్‌ఎంఈలదే. ఎంఎస్‌ఎంఈలు ఆర్థిక వ్యవస్థలను పరివర్తన చెందిస్తున్నాయి, ఉద్యోగ కల్పన, ఆదాయాన్ని ప్రోత్సహించడం, సమానమైన ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ఎంఎస్‌ఎంఈల పాత్రపై అవగాహన పెంచేందుకు, 2017 నుండి ప్రతి ఏటా జూన్ 27వ తేదీని 'ప్రపంచ ఎంఎస్‌ఎంఈ దినోత్సవం'గా ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ప్రకటించింది.దేశ ఆర్థిక వ్యవస్థకు, స్థానిక ఉపాధి కల్పనకు, గ్రామీణ లేదా వెనుకబడిన ప్రాంతాల్లో పారిశ్రామికీకరణకు ఎంఎస్‌ఎంఈలు మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వర్గీకరణ వాటి ఉత్పత్తి, పెట్టుబడి, వార్షిక టర్నోవర్‌లపై ఆధారపడి ఉంటాయి. మైక్రో ఎంటర్‌ప్రైజ్,పరిశ్రమ అనగా ఒక కోటిలోపు పెట్టుబడితో 5 కోట్ల లోపు వార్షిక టర్నోవర్ నమోదు చేయబడుతుంది. చిన్న లేదా స్మాల్ ఎంటర్‌ప్రైజ్ విభాగంలో పెట్టుబడి 10 కోట్ల వరకు ఉంటూ వార్షిక టర్నోవర్ 50కోట్ల వరకుఉంటుంది. మధ్యతరహా లేదా మీడియం పరిశ్రమలో 50 కోట్ల వరకు పెట్టుబడులు,250కోట్ల వరకు వార్షిక టర్నోవర్ ఉంటుంది. ఎంఎస్‌ఎంఈలు ఆవిష్కరణ, ఉద్యోగ కల్పన, సుస్థిర అభివృద్ధికి శక్తివంతమైన చోదక శక్తులుగా ఉపకరిస్తున్నాయి.




ఎంఎస్‌ఎంఈలు సాంకేతికత, డిజిటల్ మౌలిక సదుపాయాలు, సరసమైన ఆర్థిక సహాయం, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వాలు భాగస్వామ్యాలకు ప్రాప్యతను విస్తరించడం ద్వారా సమ్మిళిత వృద్ధిని నడిపిస్తాయి. స్థితిస్థాపకతను బలోపేతం చేస్తాయి. పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయి. డిజిటల్ టెక్నాలజీలు, ఏఐ, గ్రీన్ ఇన్నోవేషన్‌లో వేగవంతమైన పురోగతులు, ఎంఎస్‌ఎంఈలకు ఉత్పాదకతను పెంచుకోవడానికి అపూర్వమైన అవకాశాలను అందిస్తున్నాయి. నైపుణ్య శిక్షణ, ఆవిష్కరణ, మరింత న్యాయమైన నిబంధనలు ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించడానికి ఉత్తమ మార్గాలు. నేటి ఎంఎస్‌ఎంఈలు రాజకీయ అస్థిరత, యుద్ధాలు, ఘర్షణలు, వాతావరణ మార్పులు, డిజిటల్ మార్పుల వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. తగినంత రుణ సౌకర్యాలు లేకపోవడం,పేలవమైన మౌలిక సదుపాయాలు కఠినమైన పరిస్థితులలో పనిచేయడం వంటి కారణాల వల్ల ఎంఎస్‌ఎంఈలు సజావుగా నడవడం మరింత కష్టతరం అవుతోంది. ప్రపంచ ఎంఎస్‌ఎంఈల దినోత్సవం 2026ఇతివృత్తం ఆవిష్కరణ, సుస్థిర పారిశ్రామిక అభివృద్ధిద్వారా ఎంఎస్‌ఎంఈలకు సాధికారత కల్పించడం ఏఐ ఆధారిత భవిష్యత్తులో మానవ కేంద్రీకృత వ్యవస్థాపకత. ఐక్యరాజ్యసమితికి అనుబంధంగా ఉన్న హ్యూమన్‌సెంటర్డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫోరమ్ ఎంఎస్‌ఎంఈల భవిష్యత్ తరం" అనే సమాంతర ఇతివృత్తంతో నడుస్తోంది. దీని ప్రభావం ఈ రంగంలోని తదుపరి తరానికి నిర్వచనం ఇవ్వబోయే మహిళా సీఈఓలు, యువ వ్యవస్థాపకులు సూక్ష్మసంస్థలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. భారతదేశంలో, ప్రభుత్వం పారిశ్రామిక సంస్థలు ఈ రోజును చిన్న వ్యాపారాల కోసం విధాన సంస్కరణలు, ఆర్థిక చేరిక ప్రయత్నాలు డిజిటల్ పరివర్తన కార్యక్రమాలను ప్రముఖంగా ప్రస్తావించడానికి ఉపయోగిస్తాయి. భారతదేశంలో 7.4 కోట్లకు పైగా ఎంఎస్‌ఎంఈలు ఉన్నాయి.ఇవి 32కోట్లకు పైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తూ, జాతీయ జీడీపీకి సుమారు 31.1శాతం వాటాను అందిస్తున్నాయి. ఈ సంస్థలు మొత్తం ఎగుమతులలో సుమారు 48.6 శాతం వాటాను కూడా అందిస్తున్నాయి. ●

# సమాజంలో పెరుగుతున్న 'వృద్ధాప్య' సవాళ్లు

డి చంద్రభాను

ప్రపంచంలోనే అత్యధిక యువత ఉన్న దేశం మనదే. ఇదే మన బలం అని ఇన్నాళ్లు చెబుతూ వచ్చాం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ కీలక శక్తిగా ఎదుగుతుందని ఆశలు వ్యక్తమవుతున్నాయి. కానీ ఈ పరిస్థితి ఎప్పటికీ అలాగే ఉండదు. దేశంలో జననాల రేటు తగ్గుతోంది. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా మారకముందే, వృద్ధాప్య సమాజం సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. ఇదే మన ముందున్న అసలు సమస్య. ప్రస్తుతం దేశ జనాభాలో దాదాపు 68 శాతం మంది 15 నుంచి 64 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారే. ప్రపంచంలోని చాలా దేశాలతో పోలిస్తే ఇది మనకు లభించిన అరుదైన అవకాశం. కానీ ఈ అవకాశానికి కూడా ఒక గడువు ఉంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం 2050 నాటికి 60 ఏళ్లు దాటిన భారతీయుల సంఖ్య 34 కోట్లకు చేరే అవకాశం ఉంది. అంటే నేటి అమెరికా మొత్తం జనాభాతో సమానమైన వృద్ధ జనాభా ఒక్క భారత్‌లోనే ఉండబోతోంది. మరోవైపు, దేశంలో మొత్తం సంతానోత్పత్తి రేటు ఇప్పటికే జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 స్థాయి కంటే దిగువకు పడిపోయింది. కేరళ, తమిళనాడు,ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి అనేక రాష్ట్రాల్లో ఈ సంఖ్య మరింత తక్కువగా ఉంది. అంటే నేడు యువ దేశంగా కనిపిస్తున్న మనం, రేపు వృద్ధుల సంఖ్య వేగంగా పెరిగే దేశంగా మారబోతున్నాం. వృద్ధాప్యం అసలు సమస్య కాదు. ప్రపంచంలోని ప్రతి దేశం ఏదో ఒక దశలో ఈ పరిస్థితిని ఎదుర్కొంటుంది. అసలు ప్రమాదం వేరే. ధనిక దేశంగా మారకముందే వృద్ధాప్య సమాజంగా మారడమే మన ముందున్న సవాలు. జపాన్, దక్షిణ కొరియా, తైవాన్, చైనా వంటి దేశాలు మాత్రం ముందుగా తమ ఆర్థిక బలాన్ని పెంచుకున్నాయి. ప్రజల ఆదాయాలు పెరిగాయి. ఆరోగ్య,సామాజిక భద్రతా వ్యవస్థలను బలోపేతం చేసుకున్నాయి. ఆతర్వాతే అక్కడ వృద్ధుల సంఖ్య పెరిగింది. మన పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. ఇంకా మనం అభివృద్ధిచెందుతున్న దేశంగానే ఉన్నాం. తలసరి ఆదాయం ఇప్పటికీ అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే చాలా తక్కువ. యువ నిరుద్యోగం ఇప్పటికీ పెద్ద సమస్యగానే ఉంది. వివిధ అంచనాల ప్రకారం యువతలో నిరుద్యోగం 15శాతానికి మించి ఉంది. చదువుకున్న వారికి తగిన ఉద్యోగాలు దొరకడం లేదు. మహిళల ఉద్యోగాల్లో భాగస్వామ్యం కూడా 40శాతం కంటే తక్కువగానే ఉంది. కోట్లాది మంది ఇప్పటికీ అసంఘటిత రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అంటే మనం ఇంకా పూర్తిగా ఎదగకముందే కొత్త సవాళ్లు మన ముందుకువస్తున్నాయి.అందుకే సంపన్న దేశంగా ఎదగకముందే వృద్ధాప్య సమాజంగా మారడం, అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొనే అత్యంత క్లిష్టమైన సమస్యల్లో ఒకటిగా నిపుణులు భావిస్తున్నారు. అయితే జనాభా పరిమాణమే దేశ బలాన్ని నిర్ణయించే రోజులు



క్రమంగా ముగుస్తున్నాయి. ఒకప్పుడు ఎక్కువ జనాభా అంటే ఎక్కువ శ్రామిక శక్తి, ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యం అనిభావించేవారు. కానీ కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్,ఆటోమేషన్ వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో, కేవలం ఎక్కువ మంది యువత ఉండటం మాత్రమే సరిపోదు. అధిక నైపుణ్యాలు, ఉత్పాదకత, సాంకేతిక సామర్థ్యాలే దేశాల మధ్య పోటీలో అసలు తేడాను నిర్ణయిస్తున్నాయి. అంటే మన దేశానికి లభించిన జనాభా ప్రయోజనం శాశ్వతం కాదు. దాన్ని ఉపయోగించుకోవాల్సిన సమయం కూడా అపరిమి తం కాదు. రాబోయే రోజుల్లో వృద్ధుల సంఖ్య పెరగడం కేవలం సామాజిక సవాలు మాత్రమే కాదు. అదే పరిస్థితి కొత్త వ్యాపారాలు, కొత్త ఉద్యోగాలు, కొత్త సేవలకు కూడా మార్గం చూపవచ్చు. రాబోయే దశాబ్దాల్లో ఆరోగ్య సేవలు, వృద్ధుల సంరక్షణ, బీమా, ప్రత్యేక గృహాలు, సహాయక పరికరాలు, ఇంటి వద్దే వైద్య సేవలు వంటి రంగాల్లో భారీ డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది. జపాన్, ఐరోపా దేశాలు ఇప్పటికే ఈ రంగాలను కొత్త వృద్ధి అవకాశాలుగా మార్చుకున్నాయి. మన దేశంలో మాత్రం ఈ అంశంపై ఇంకాపెద్దగా చర్చ మొదలుకాలేదు. వృద్ధాప్యాన్ని కేవలం సమస్యగా కాకుండా, కొత్త ఆర్థిక అవకాశంగా కూడా చూడాల్సిన అవసరం ఉంది. ఇప్పుడున్న పరిస్థితిని చూసి మనకు ఇంకా చాలా సమయం ఉందని అనుకోవడం ప్రమాదకరం. మహిళలకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడం, యువతకు నైపుణ్యాలను పెంచడం,ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడం, వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటి అంశాలపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలి. అదే సమయంలో కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, ఆటోమేషన్ వంటి సాంకేతికతలను ఉపయోగించి ఉత్పాదకతను పెంచాల్సిన అవసరం కూడా ఉంది. ఎందుకంటే భవిష్యత్తులో దేశాల బలాన్ని నిర్ణయించేది జనాభా సంఖ్య కాదు. ఆ జనాభా ఎంత సమర్థంగా పనిచేస్తుందన్నదే అసలు విషయం. దశాబ్దాలుగా మనం యువ జనాభాను ఒక వరంగా భావిస్తున్నాం. కానీ వరాలు కూడా శాశ్వతంకావు. అవకాశాలకు కూడా ఒక గడువుఉంటుంది.చైనా తన యువ జనాభాను ఉపయోగించుకుని ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదిగింది. ఇప్పుడు అదే దేశం వృద్ధాప్య సమాజం సవాళ్లను ఎదుర్కొంటోంది. మన దేశానికి కూడా ఇప్పుడు ఒక అరుదైన అవకాశం లభించింది. కానీ అలాంటి అవకాశాలు ఎప్పటికీ ఎదురుచూడవు. మరోవైపు, జనాభా మార్పులు దేశ వ్యాప్తంగా ఒకేలా ఉండవు. దక్షిణ భారతదేశంలోని అనేక రాష్ట్రాలు ఇప్పటికే తక్కువ జననాలరేటుతో వేగంగా వృద్ధాప్య సమాజాలుగా మారుతుండగా,కొన్ని ఉత్తర రాష్ట్రా లు ఇంకా యువజనాభాతో ఉన్నాయి. ఈ అసమానతలు భవిష్యత్తులో దేశంలోనే కొత్త ఆర్థిక,సామాజిక, వలస సవాళ్లకు దారితీసే అవకాశంఉంది. అందుకే దేశమంతటికీ ఒకే విధానం సరిపోదు.రాష్ట్రాల పరిస్థితులను బట్టి వేర్వేరువ్యూహాలు అవసరం.ప్రస్తుతం మన ముందున్న అసలు ప్రశ్న జనాభా ఎంత ఉందనేదికాదు. ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశంగా ఉన్నమనం, ఈ అవకాశాన్ని సంపదగా మార్చుకోగలమా లేదా అనేదే తేల్చుకోవాల్సిన విషయం. నేడు మనకు వరంగా కనిపిస్తున్న ఈఅవకాశం, రేపు మనం కోల్పోయిన అవకాశంగా చరిత్రలో మిగిలిపోవచ్చు. ●

# ప్రజావాక్కు

### మరో అవకాశం ఇవ్వండి

**దేశవ్యాప్తంగా** గత ఆదివారం జరిగిన నీట్ యూజీ రీ టెస్ట్‌కి కొంత మంది విద్యార్థులు ట్రాఫిక్ జామ్స్, రైళ్ల ఆలస్యంగా రావడం, సిటీబస్‌లు సమయానికి రాకపోవడం తదితర కారణాల వల్ల నీట్ యూజీ పరీక్ష రాయలేకపోయారు.వారిలోచాలామంది పరీక్షాకేంద్రాలకు నాలుగు నుంచి ఐదు నిమిషాలు మాత్రమే ఆలస్యంగా చేరుకున్నారు. ఇవన్నీ క్షమించదగిన విషయాలే. ఎందుకంటే ఇవన్నీ విద్యార్థుల అదుపులో లేని కారణాలు. మధ్యప్రదేశ్‌లో తండ్రి బైకు పంక్చర్ కావడంతో రెండు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన బిడ్డను సెంటర్‌లోకి రానివ్వలేదు. జగిత్యాలలో తమ బిడ్డనులోనికి పంపాలని సెక్యూరిటీ సిబ్బందికాళ్ళమీద పడిందోమాతృమూర్తి.క్రమశిక్షణ పేరుతో సమయపాలన వంటి సాంకేతిక అంశాలలో వ్యవస్థ కూరుకుపోవడంలో అర్థం లేదు. అందువల్ల అటువంటి విద్యార్థులకు కరుణతో మళ్లీ నీట్ పరీక్ష రాయడానికి అవకాశం కల్పించాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### సహ చట్టాన్ని నీరుగారుస్తున్న అధికారులు

ప్రజాసేవకులైన అధికారుల పనితీరు, పాలనలో పారదర్శకత, జవాబుదారీ తనం పౌరులు తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం 2005 లో తీసుకురాబడింది. ఎందుకంటే అధికారులు తీసుకుంటున్న లక్షలు లక్షల జీతాలు ప్రజలు పన్నులుగా చెల్లించిన డబ్బేకనుక.అందువలన అది దుర్వినియోగం అవుతుందా సద్వినియోగం అవుతుందా అని తెలుసుకోవలసిన అవసరం సామాన్యుడికి సైతం ఉంది. ఐతే అధికారులు మాత్రం అవకాశం వచ్చినపుడల్లా ఈ చట్టాన్ని దుర్వినియోగ పరుస్తున్నారు. ఒకసారి పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారినీ సమాచారం కోరితే నిర్ణీత సమయంలో కోరిన సమాచారం ఇవ్వడులేదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### బయోమెట్రిక్ అమలు చేయాలి

ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన లేకుండా విధి నిర్వహణలో సేవల పట్ల ప్రజలను ఇబ్బందిపెడుతూ వారికి నచ్చిన సమయానికి విచ్చేసి మరల తొందరగా వెళుతున్నారు. కావున అధికారులు ఉద్యోగులకు ఉదయం, సాయంత్రంబయోమెట్రిక్ విధానాన్ని అమలు కఠినతరం చేస్తేనేమారుమూల ప్రజలకు మేలుచేసే అవకాశం ఉంది.

-మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించాలి

ప్రజారోగ్య పరిరక్షణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు కీలక పాత్ర పోషిస్తాయి. గ్రామీణ, పట్టణ పేద ప్రజలకు ఇవే మొదటి వైద్య సేవలకేంద్రాలుగా నిలుస్తాయి.అయితే పెరుగుతున్న జనాభా, కొత్త వ్యాధులు, వైద్య సేవలపై పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో ఈ ఆసుపత్రుల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఏర్పడింది.అనేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోవైద్యులు,నర్సులు,సాంకేతిక సిబ్బంది కొరత కనిపిస్తోంది. అవసరమైన మందులు,పరీక్షా పరికరాలు, అత్యవసర చికిత్స సదుపాయాలు కూడా కొన్నిప్రాంతాల్లో తగిన స్థాయిలో లేవు. ఫలితంగా చిన్నవ్యాధులకే ప్రజలు పెద్ద నగరాల్లోని ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనివల్ల ప్రభుత్వ వైద్య వ్యవస్థపై అదనపు భారం పడుతోంది. జిల్లా ఆసుప త్రుల్లో ఆధునిక నిర్ధారణ పరికరాలు,ప్రత్యేక వైద్య సేవలు, ఐసీయూ సదుపాయాలు, తగినపడకల సంఖ్యను పెంచడం అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అప్పడలా ఇప్పుడిలా

**ఒకప్పుడు** ఎక్కడో దూర ప్రాంతంలో ఉన్న మాత్రులకి, చుట్టాలకి ఫోను చేసి మాట్లాడాలంటే ట్రంక్ కాల్ బుక్ చేసుకుని గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు చేతిలో ఉండే సెల్‌ఫోనుతో క్షణాల్లో ప్రపంచంలో ఎక్కడున్న వారితోనైనా మాట్లాడవచ్చు. వీడియోకాల్ అయితే ఎదురుగ ఉన్న మనిషితో మాట్లాడుతున్నట్లు ఉంటుంది. గతంలో బజారుకి వెళ్లి వస్తువు కొనాలంటే జేబులో డబ్బులు ఉండాల్సిందే. అదే ఇప్పుడు షోరూంలో ఎంత ఖరీదు వస్తువు అయినా రోడ్డు పక్కన బండి మీద అమ్మే కూరగాయలు అయినా జేబులో నయాపైసా లేకపోయినా ఫోన్ పే చేసి కొనుక్కోవచ్చు. ఇదంతా అభివృద్ధే. అయితే ఈ అభివృద్ధి పుష్కరకాలంలో సాధించింది కాదు.

- మిథునం, హైదరాబాద్

### గురుకులాల్లో కుల వివక్షత?

**తెలంగాణా** రాష్ట్రంలో ఉన్న వివిధ గురుకులలలో కుల వివక్షత విపరీతంగా ఉంది. టీచింగ్, నాన్ టీచింగ్ ఎస్సి, ఎస్టీ, వికలాంగుల సిబ్బంది పై వివక్షత ఉంది. కనుక ప్రభుత్వం ప్రతి గురుకుల ప్రిన్సిపాల్‌లకు వివక్షత లేకుండా చూసే విధంగా ఆదేశాలు జారీ చేయాలి. కుల వివక్షతపై ప్రతి జిల్లా కేంద్రంలో ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ చట్టం 1989 పై అవగాహనా చైతన్య కార్యక్రమం నిర్వహించడం అవసరం.

- కదురు శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన విలో ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ముదిరిన అయోధ్య విరాళాల వివాదం







### ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, మరో సభ్యుని రాజీనామా

### బ్యాంకుల పాత్రపైనా 'సిట్'దర్యాప్తు

### ఎఫ్ఐఆర్‌లోని 8 మంది నిందితుల అరెస్టు

### దోషులను వదిలేది లేదు: సీఎం ఆదిత్యనాథ్

**అయోధ్య, జూన్ 26:** అయోధ్య రామమందిరానికి సంబంధించిన నిధుల దుర్వినియోగం వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' అధిపతి చంపత్ రాయ్, ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా తమ పదవుల నుంచి తప్పుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ సమాచారశాఖ డైరెక్టర్ అందించిన సమాచారం ప్రకారం, ట్రస్ట్‌కు చెందిన ఈ ఇద్దరు కీలక సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. నైతిక కారణాలతోనే వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కోట్లాది మంది భక్తులను దిగ్భ్రాంతికి గురిచేసిన రామమందిర విరాళాల వివాదం నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. ఆలయ సిబ్బంది, బ్యాంకు అధికారులతో కుమ్మక్కై వందల కోట్ల రూపాయల విలువైన కానుకలు, విలువైన వస్తువులను దుర్వినియోగం చేశారని నివేదికలు వెల్లడించాయి. ఆలయ రోజువారీ కార్యకలాపాలు, శ్రీరాముడికి సమర్పించే కానుకల (చడావా) నిర్వహణను పర్యవేక్షించే బాధ్యత ట్రస్ట్‌పై ఉన్నందున, ఆలయంలో జరిగిన తీవ్రమైన అక్రమాలకు సంబంధించి బాధ్యతను నిర్ధారించే చర్యలో భాగమే ఇది. రామమందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల నిర్వహణలో లోపాలను ఎత్తిచూపుతూ సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) సమర్పించిన ప్రాథమిక నివేదిక తర్వాత, అధికారులను తొలగించాలనే డిమాండ్, వారిపై పెరుగుతున్న ఒత్తిడి నేపథ్యంలో ఈ రాజీనామా జరిగాయి. ఆలయ నిధులను అక్రమంగా తరలించడానికి కుమ్మక్కయ్యారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆలయ సిబ్బంది, లెక్కింపు సిబ్బంది, మాజీ బ్యాంకు అధికారులతో సహా ఎనిమిది మంది వ్యక్తులపై గురువారం రాత్రి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న నిందితులందరిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. అరెస్టు అయిన వారిలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామశంకర్ యాదవ్ (అలియాస్ తిన్ను) ఉన్నారు.

**పలువురు బ్యాంకు అధికారుల పాత్రపైనా సిట్ దర్యాప్తు:** రామ మందిర విరాళాల వివాదంలో నగదు, కానుకలను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై ఆలయ సహాయకుడు, మాజీ బ్యాంకు సిబ్బంది, నగదు లెక్కింపులో పాల్గొన్న వారితో సహా ఎనిమిది మంది పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చడంతో, ఈ దొంగతనంలో 'కుమ్మక్కు' అయినందుకు పలువురు బ్యాంకింగ్ అధికారులు విచారణను ఎదుర్కొనే అవకాశం ఉంది. అరెస్ట్ అయిన ఎనిమిది మంది నిందితులను ప్రస్తుతం విచారిస్తున్నారు. విచారణ సమయంలో, తిను, సుభాష్ ఈ దొంగతనం జరిగిన తీరు గురించి, అలాగే ఇందులో మరికొంత మంది ప్రమేయం గురించి సంచలన విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. ఆలయ కానుకల దుర్వినియోగానికి మధ్యవర్తులుగా లేదా మాధ్యమాలుగా వ్యవహరించిన పలువురు ప్రభుత్వ బ్యాంకు అధికారుల పేర్లను కూడా వారు వెల్లడించినట్లు సమాచారం. ఈ నిధుల దుర్వినియోగం రాకెట్‌లో ఒకరు కాదు, పలువురు బ్యాంకింగ్ అధికారులు పాలు పంచుకున్నట్లు తేలింది. వారి అనుమానాస్పద ప్రవర్తనపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. ఆలయ దొంగతనం ప్రణాళిక, అమలులో తిన్ను యాదవ్, సుభాష్ శ్రీవాస్తవ కీలక పాత్ర పోషించినట్లు విచారణలో తేలింది. సుభాష్ ఈ ఆపరేషన్‌లో ఇతరులను చేర్చుకుని, ఆలయంలో నగదు కానుకలను లెక్కించే సిబ్బందికి విధులను కేటాయించారని ఆరోపణలు ఉన్నాయి. టెంపుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ మాజీ డ్రైవర్ అయిన తిన్ను, ఈ దొంగతనం వివాదంలో ప్రధాన వ్యక్తిగా వెలుగులోకి రాగా, అరెస్టయిన ఎనిమిది మందిలో సుభాష్ మాజీ బ్యాంకింగ్ ఉద్యోగిగా ఉన్నాడు. ఆలయంలో నగదు లెక్కింపు సిబ్బందిని పర్యవేక్షించింది సుభాషేనని, విరాళాలను దుర్వినియోగం చేయడంలో అతనే కీలక పాత్ర పోషించాడని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేర విధానానికి సంబంధించి, ప్రజల కంట పడకుండా ఉండేందుకు మొదట నగదు కట్టలను బాత్రూమ్‌లో దాచి, ఆ తర్వాత రాత్రివేళ ఆలయ ప్రాంగణం నుండి బయటకు తరలించినట్లు సమాచారం.ఆ తర్వాత, దొంగిలించిన డబ్బును వేర్వేరు ప్రాంతాల్లో వేరు చేసి, మోసగాళ్ల ఖాతాలకు మళ్లించారు. ఈ ముఠా గత 23 ఏళ్లుగా ఈ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు భావిస్తున్నారు.

**దోషులను వదిలిపెట్టేదిలేదు: సీఎం యోగి**
రామమందిర విరాళాల వివాదంలో దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం మరోసారి స్పష్టం చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక నివేదిక సమర్పించిన వెంటనే చర్యలు మొదలయ్యాయని, దోషులు చట్టం ముందు నిలబడేలా చూస్తామని హామీ ఇచ్చారు. జూన్ 19న అయోధ్యలో పర్యటించినప్పుడు దర్యాప్తు తర్వాత చర్యలు తీసుకుంటానని తాను చెప్పానని, ఆ 'శిక్షా ప్రక్రియ' ఇప్పటికే మొదలైందని సీఎం పేర్కొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ అమరుల పేర్లను ప్రకటించిన భారత్

**న్యూఢిల్లీ,జూన్ 26:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన భయంకర ఉగ్రదాడికి ప్రతికారంగా భారత సైన్యం పాకిస్థాన్ గుండెల్లో దడ పుట్టేలా జరిపిన మెగా కౌంటర్ ఆపరేషన్ ఆపరేషన్ సిందూర్. ఈ భీకర ఆపరేషన్‌లో భారత సైన్యానికి చెందిన ఐదుగురు, ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన ఒక సర్జెంట్ వీరమరణం పొందారు ప్రభుత్వం నప్రకటించింది.సుబేదార్ మేజర్ పవన్ కుమార్ -హెడ్‌క్వార్టర్స్ 10 ఇన్ ఫాంట్రీ బ్రిగేడ్. రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్ - 4వ బెటాలియన్, జమ్మూకశ్మీర్ లైట్ ఇన్‌ఫాంట్రీ రెజిమెంట్. లాన్స్ నాయక్ దినేష్ కుమార్ - 5 ఫీల్డ్‌రెజిమెంట్. అగ్నివీర్ మూడ్ మురళీ నాయక్ -851 లైట్ రెజిమెంట్ (మన తెలుగు రాష్ట్రానికి చెందిన వీరుడు కావడం విశేషం). హవల్దార్ సునీల్ కుమార్ సింగ్ - 237 ఫీల్డ్ వర్క్‌షాప్. సర్జెంట్ సురేంద్ర కుమార్ - 39 వింగ్, భారత వైమానికదళం. ఆపరేషన్ సిందూర్‌లో శత్రువుల స్థావరాలను ధ్వంసం చేస్తూ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు గానూ రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్‌కు మరణానంతరం దేశపుమూడవ అత్యున్నత సైనిక పురస్కారమైన వీరచక్రను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. స్కై ఆపరేషన్స్‌లో కీలక పాత్ర పోషించిన ఐఏఎఫ్ సర్జెంట్ సురేంద్ర కుమార్‌కు మరణానంతరం వాయుసేన మెడల్‌తో గౌరవించింది.



# 'సర్'కు యేడాది!

### 6 కోట్ల ఓట్లు తొలగింపు

### కొనసాగుతున్న ప్రక్రియ

### డిసెంబర్‌కి ముగింపు

**న్యూఢిల్లీ, జూన్ 26:** ఓటర్ల జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ్ణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా ఇప్పటివరకు దాదాపు ఆరు కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయి. ఈ ప్రక్రియ మొదలై జూన్ 26నాటికి యేడాది పూర్తయింది. ప్రతిపక్షం, ఎన్నికల సంఘం మధ్య వివాదానికి కారణమైన ఈ ప్రక్రియ, సుప్రీంకోర్టు దీని రాజ్యాంగబద్ధతను సమర్థించడంతో 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు, గత ఏడాది జూన్ 24న బీహార్‌లో ఈ ఎస్ఐఆర్ పైలట్ ప్రక్రియ ప్రారంభమైంది. బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత, అక్కడి ఓటర్ల జాబితా నుండి దాదాపు 65 లక్షల పేర్లు తొలగించబడ్డాయి. అయితే, పత్రాలు లేవనే కారణంతో పౌరుల ఓటు హక్కును తొలగించేందుకు ఎన్నికల సంఘం బిజెపి ఆదేశాల మేరకు పనిచేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టడంలో ఎన్నికల సంఘం (ఇసి) వ్యవహరించిన తీరు రాజ్యాంగబద్ధమేనని మార్చిలో సుప్రీంకోర్టు ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఎస్ఐఆర్ సమయంలో పేర్లు తొలగించబడిన వ్యక్తులు పశ్చిమ బెంగాల్, బీహార్‌లలో రాష్ట్ర సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత, ఓటర్ల జాబితా ప్రక్షాళన డేటాను సామాజిక భద్రతా పథకాలతో అనుసంధానిస్తున్నట్లు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. అర్హులైన పౌరులెవరూ జాబితాలో లేకుండా పోకూడదని, అనర్హులు ఎవరూ చేరకూడదని నిర్ధారించే ప్రక్రియగా పేర్కొంటూ, ఎస్ఐఆర్ ఇప్పుడు ఎన్‌సిఇఆర్‌టి సామాజిక శాస్త్ర పాఠ్య పుస్తకంలో కూడా చోటు దక్కించుకుంది.

గత యేడాది అక్టోబర్ 27న ప్రకటించిన ఈ ప్రక్రియ రెండవ దశలో ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా రాష్ట్రాల్లో మొత్తం ఓటర్ల జాబితాలో 10.2 శాతం పేర్లు తొలగించబడ్డాయి.

వీటితోపాటు కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ముందు మొత్తం ఓటర్ల సంఖ్య 50.99 కోట్లకు పైగా ఉండేది. ఈ ప్రక్రియ తర్వాత, ఓటర్ల సంఖ్య 45.81 కోట్లకు చేరింది. అంటే 5.18 కోట్లకు పైగా తగ్గుదలనమోదైంది. శాతం పరంగా చూస్తే, ఓటర్ల జాబితాలో 10.2 శాతం మేర తగ్గింపు జరిగింది. ఓటర్ల జాబితాల నుండి మొత్తం 66,88,636 మంది మరణించిన ఓటర్ల పేర్లను తొలగించారు. ఇందులో అత్యధికంగా ఉత్తరప్రదేశ్ నుండి 25.47లక్షల మంది, ఆ తర్వాతి స్థానంలో ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్ నుండి 24.16లక్షలమంది ఉన్నారు. అదనంగా, ఎస్ఐఆర్ ప్రక్రియలో వచ్చిన అభ్యంతరాలు, వాటి పరిష్కారం ఆధారంగా మరో 63.16 లక్షల పేర్లను తొలగించారు. 12రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాలు వేర్వేరు తేదీలలో విడుదలయ్యాయి, వీటిలో ఉత్తరప్రదేశ్ చివరిగా తన డేటాను విడుదల చేసింది.

36.73 కోట్ల మంది ఓటర్లతో కూడిన ఎస్ఐఆర్ ప్రక్రియ మూడవ దశ మే 14న ప్రారంభమైంది. ఈ యేడాది చివరలో ముగుస్తుంది. ఈ దశ ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్,సిక్కిం, త్రిపుర, తెలంగాణ, ఉత్తరాఖండ్ అనే 16రాష్ట్రాలు, ఢిల్లీ, చండీగఢ్, దాద్రా- నగర్ హవేలీ, డామన్- దయ్యూ అనే మూడు కేంద్ర పాలిత ప్రాంతాలలో అమలు చేయబడుతోంది.



వెనిజులాలో భూకంపంధాటికి మట్టిలో కూరుకుపోయిన కార్లు

## వెనిజులా భూకంపంలో 600 దాటిన మృతులు

### వేలాదిమంది గల్లంతు

### తక్షణ సాయం అందించిన భారత్


**కారకాస్, జూన్ 26:** వెనిజులాలో సంభవించిన రెండుభారీ భూకంపాలు దేశాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టాయి. రిక్టర్ స్కేలుపై 7.2, 7.5 తీవ్రతతో సంభవించిన భూకంపాల కారణంగా ఇప్పటివరకు 600మందిపైగా మృతి చెందగా, 4,300 మందికి పైగా గాయపడ్డారు. వేలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. అనధికారిక లెక్కలప్రకారం లక్షమందికిపైగా ఈజంట భూకంపాలకారణంగా గల్లంతయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెపుతున్నారు. వెనిజులా ఆరోగ్య మంత్రి కార్లోస్ అల్వారాడో మాట్లాడుతూ, ఆసుపత్రులకు చేరుకునేలోపే వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. శిథిలాల కింద ఇంకా ఎంతో మంది చిక్కుకుపోయి ఉండటంతో సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని తెలిపారు.రాజధాని కారకాస్‌తో పాటు ఉత్తర తీర ప్రాంతాల్లో భవనాలు భారీగా కూలిపోయాయి. లా గువైరా ప్రాంతంలో అత్యధిక ప్రాణనష్టం సంభవించింది. అక్కడి ప్రధాన విమానాశ్రయం కూడా దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని స్థానికులు తమ చేతులతోనే రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన భారీ యంత్రాలు ఇంకా చేరలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పిపోయిన తమ చిన్నారుల కోసం తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.భూకంప ప్రభావంతో కారకాస్ నగరంలో విద్యుత్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. మెట్రో రైలు సేవలను నిలిపివేయగా, సహజ వాయువు సరఫరాను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. పాఠశాలలకు కొన్ని రోజుల పాటు సెలవులు ప్రకటించి, వాటిని సహాయ శిబిరాలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది.వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెస్ దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని సజీవంగా రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సహాయక చర్యల కోసం భారీ నిర్మాణ యంత్రాలను అందించాలని పరిశ్రమలను కోరారు.భూకంప బాధితుల సహాయార్థం అమెరికా కొన్ని ఆర్థిక ఆంక్షలను తాత్కాలికంగా సడలించింది. భూకంప సహాయ కార్యక్రమాలకు సంబంధించిన లావాదేవీలకు అక్టోబర్ 23 వరకు అనుమతి ఇచ్చింది.అమెరికా, మెక్సికో, బ్రెజిల్, కెనడా, స్పెయిన్, పోర్చుగల్, ఖతార్, డొమినికన్ రిపబ్లిక్ తదితర దేశాలు సహాయక బృందాలు, వైద్య సిబ్బంది, ఔషధాలు, తాగునీటి శుద్ధి పరికరాలు, డ్రోన్లు, శునక దళాలను వెనిజులాకు పంపిస్తున్నట్లు ప్రకటించాయి.అమెరికా భూగర్భ సర్వే సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, మొదటి భూకంపం కారకాస్‌కు పశ్చిమాన సముద్ర తీరానికి సమీపంలో సంభవించగా, కేవలం నిమిషం వ్యవధిలోనే రెండో భారీ భూకంపం అదే ప్రాంతాన్ని తాకింది. తక్కువ లోతులో సంభవించిన ఈ రెండు భూకంపాలు వరుసగా రావడంతో విధ్వంసం మరింత తీవ్రంగా మారిందని భూకంప నిపుణులు తెలిపారు.

భూకంపంతో అతలాకుతలమైన వెనుజులాకు ఆయా దేశాలు సాయం చేసేందుకు ముందుకు వస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ కూడా లాటిన్ అమెరికా దేశానికి ఆపన్న హస్తం అందించేందుకు సిద్ధమైంది. ఇందుకోసం 'ఆపరేషన్ అమిస్టాడ్' కొనసాగుతోందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు.

ఇందులో భాగంగా సహాయక చర్యలకు అవసరమైన సామగ్రితో భారత సైన్యానికి చెందిన రెండు సి-17 విమానాలు బయలుదేరినట్లు చెప్పారు. భారత సైన్యానికి చెందిన ఫీల్డ్ హాస్పిటల్ యూ నిట్, అత్యవసర సమయాల్లో క్షతగాత్రులకు అవసరమైన ప్రాథమిక చికిత్స అందించే సామార్థ్య మున్న రెండు మొబైల్ ఆస్పత్రి టెంట్లు సహా 35 టన్నులకు పైగా సహాయక సామగ్రి, ఔషధాలు, వైద్య పరికరాలు పంపించినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. క్లిష్ట సమయంలో వెనుజులా ప్రభు త్వానికి, అక్కడి పౌరులకు అవసరమైన సాయం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. అమి స్టాడ్ అంటే స్పానిష్ భాషలో స్నేహం అని అర్థం.

## ఒక్క రాత్రే రష్యాపైకి 660 డ్రోన్లు: ఉక్రెయిన్ భీకర దాడి

**కీవ్, జూన్ 26:** ఉక్రెయిన్-రష్యా మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. తాజాగా మాస్కో ఆధీనంలో ఉన్న క్రిమియాతోపాటు రష్యా వ్యాప్తంగా 12 ప్రాంతాలపై కీవ్ వందల కొద్దీ డ్రోన్లతో విరుచుకుపడింది. ఒక్క రాత్రే 660 డ్రోన్లను ప్రయోగించింది. వీటన్నింటిని తాము సమర్థవంతంగా అడ్డుకున్నామన రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. రాజధాని మాస్కో సహా అజోవ్, నల్ల సముద్ర తీరంలోని నగరాలు, క్రిమియాను ఉక్రెయిన్ లక్ష్యంగా చేసుకుంది. తమ నగరంవైపు దూసు కొచ్చిన 47 డ్రోన్లను కూల్చివేసినట్లు మాస్కో మేయర్ వెల్లడించారు. అయితే, దీని వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందా? అనే వివరాలను ఆయన బయటపెట్టలేదు. నోవోమోస్కోవ్‌స్కీ ప్రాంతం లోని ఓ



కెమికల్ ప్లాంట్, హైడ్రోఎలక్ట్రిక్ ప్లాంట్‌పై ఉక్రెయిన్ డ్రోన్లను ప్రయోగించగా అక్కడ భారీగా మంటలు చెలరేగినట్లు వార్తలు వస్తు న్నాయి. అయితే, దీనిపై రష్యా నుంచి అధికారిక ప్రకటన రాలేదు. ఈ దాడుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఈ యుద్ధాన్ని ముగించేందుకు యేడాది కాలంగా అమెరికా చేపట్టిన శాంతి ప్రయత్నాలు ఎలాంటి పురోగతి సాధించలేదు. ఈ నేపథ్యంలోనే రష్యా సైనిక స్థావరాలు, విద్యుత్ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఉక్రెయిన్ ఇటీవల కాలంలో తమ దాడులను ఉధృతం చేసింది. దీనిపై తాజాగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎక్స్ వేదికగా స్పందించారు. 'యుద్ధం ముగించేలా రష్యాపై ఒత్తిడి తెచ్చే లక్ష్యంగా 40 రోజుల పాటు కీలక ఆపరేషన్ చేపట్టనున్నాం' అని వెల్లడించారు. ఈ సమయంలో తమ చర్యలు అత్యంత ఉధృతంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ప్రకటన వెలువడిన కొద్ది గంటలకే రష్యాపై కీవ్ డ్రోన్లతో విరుచుకుపడటం గమనార్హం.

## కేతన్ విగ్గు ధరించేవాడు..బట్టతల నాకు నచ్చేదికాదు: సియా

**పూణె,జూన్ 26:** మహారాష్ట్రలోని పూనేకు చెందిన కేతన్ అగర్వాల్ హత్య కేసు విచారణలో అనేక ఆసక్తికర విషయాలు బయటపడుతున్నాయి. కేతన్ హత్యకు దారితీసిన పరిస్థితులపై ప్రధాన నిందితురాలు సియా గోయల్ భిన్నమైన సమాధానాలు ఇస్తోంది. తాజాగా పోలీసుల విచారణలో కొన్ని ఆసక్తికర విషయాల్ని తెలిపింది. కేతన్ అగర్వాల్‌ను పెళ్లి చేసుకోవడం తనకు ఇష్టం లేదని, ఇందుకు అతడు విగ్గు ధరించడమే కార ణమని సియా తెలిపింది. కేతన్ చూడటానికి అంతగా బాగుండేవాడు కాదని, బట్టతల ఉందని, పైగా తను విగ్గు వాడటం తనకు నచ్చలేదని చెప్పింది. అతడికి జుట్టు బాగా ఊడిపోవడం వల్ల విగ్గు పెట్టుకున్నాడని, తనకు కాబోయే వాడు ఇలా విగ్గు ధరించడం తనకు అస్సలు ఇష్టం లేదని పోలీ సులకు చెప్పింది. ఇదే సమయంలో పెళ్లిని ఆపేందుకు తాను ప్రయత్నిస్తుంటే ఇప్పుడు అంత సమయం లేదని, ఇప్పటికే పెళ్లిని ఆపే విషయంలో సమయం మించిపోయిందని కేతన్ తనతో అన్నట్లు సియా తెలిపింది. పెళ్లికి సంబంధించిన ఏర్పాట్లు చాలా దూరం వెళ్లిపోయాయని, దీంతో పెళ్లి ఆపడం సాధ్యం కాదనేలా అతడు చెప్పినట్లు సియా వివరించింది. మరోవైపు కేతన్ విగ్గు అంశంపై కేతన్ తండ్రి మీడియాతో మాట్లాడాడు. తన కొడుకు విగ్గు వాడటం గురించి వారి కుటుంబానికి ముందే చెప్పామన్నాడు. సియాకు ఏమాత్రం అసంతృప్తి, ఇబ్బంది ఉన్నా ఈ పెళ్లి ఆపాలని తాము కూడా భావించినట్లు చెప్పారు. ఇక, ప్రస్తుతానికి సియాకు ఆమె కుటుంబ సభ్యుల నుంచి పెద్దగా సహకారం లభించడం లేదు. ఆమె అరెస్ట్ అయిన తర్వాత నుంచి సియా కుటుంబ సభ్యులు ఎవరూ ఆమెను కలవలేదు. అయితే, సియా గోయల్ ప్రియుడు చేతన్ చౌదరి కుటుంబ సభ్యులు మాత్రం అతడిని తరచూ కలుస్తున్నారని విచారణ అధికారులు తెలిపారు. సియా తప్పు చేసి ఉంటే ఆమెను



ఉరితీసినా తమకు ఏ అభ్యంతరం లేదని ఆమె తండ్రి మీడియాతో చెప్పారు. కేతన్ తండ్రి మాట్లాడుతూ సియా చేసిన నేరం రుజువైతే ఆమెను కూడా అలాగే, కొండపైనుంచి తోసి చంపేయాలని కోరాడు. కేతన్ హత్యపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. పిల్లల్లో ఇలాంటి నేర ప్రవృత్తి సంబంధమైన ఆలోచనలకు దూరంగా పెంచాలని ఆయన సూచించారు.



## రూ.320 కోట్లుపన్నులు చెల్లించిన కింగ్ ఛార్లెస్

**లండన్,జూన్ 26:** బ్రిటన్ రాచకుటుంబ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది. రాజుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తానుచెల్లించిన వ్యక్తిగత పన్నుల వివరాలను బహిరంగపరచి కింగ్‌చార్లెస్III సరికొత్త చరిత్ర సృష్టించారు. ఒక బ్రిటన్‌రాజు తన సొంత పన్ను వివరాలను ఇలాఅధికారికంగా ప్రకటించడం ఇదే తొలిసారి.బకింగ్‌హామ్ ప్యాలెస్ విడుదల చేసిన వార్షిక ఆర్థికనివేదికల ప్రకారం సెప్టెంబర్ 2022లో రాజుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కింగ్ చార్లెస్‌రూ.320కోట్లకుపైగా (30మిలియన్ పౌండ్లు) వ్యక్తిగత పన్నులు చెల్లించారు. 2024-25ఆర్థిక సంవత్సరంలోనే మూలధన లాభాల పన్నుల కింద రూ.140కోట్లుకట్టారు.యునైటెడ్ కింగ్‌డమ్‌లోనే అత్యధిక పన్ను చెల్లించే టాప్100 మంది వ్యక్తులజాబితాలో బ్రిటన్ రాజు నిలిచారు.



## కౌటిల్యుడి అర్థశాస్త్రంలోనే సమానత్వ సిద్ధాంతం: చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్

**న్యూఢిల్లీ,జూన్26:**ఆధునిక ప్రజాస్వామ్యానికి, చట్టబద్ధ పాలనకు పునాదిగా భావించే మాగ్నా కార్టాకన్నా శతాబ్దాల ముందే భారతదేశంలో సమానత్వ భావన పుట్టిందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. కౌటిల్యుడు రచించిన అర్థశాస్త్రంలోనే దీని మూలాలు స్పష్టంగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో జరిగిన 14వ సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ న్యాయఫోరమ్‌లో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.1215లో వచ్చిన మాగ్నా కార్టా రాజుతో సహా ప్రతిఒక్కరూ చట్టానికి లోబడి ఉండాలనే విప్లవాత్మక సూత్రాన్ని ప్రపంచానికి పరిచయం చేసిందని చెబుతారని, కానీ అంతకంటేముందే నాలుగో శతాబ్దంలోనే కౌటిల్యుడి అర్థశాస్త్రం సమానత్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిందని తాను వ్యక్తిగతంగా విశ్వసిస్తున్నట్లు జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. అర్థశా మౌర్య చక్రవర్తి చంద్రగుప్తుని ప్రధాన సలహాదారుడైన కౌటిల్యుడు సంస్కృతంలో రచించారు. ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ చట్టం సమానంగా అందుబాటులో ఉండటం అనేది కేవలం ఒకప్రక్రియగా మిగిలిపోకూడదని, అది ప్రజలకు వాస్తవ హక్కులను అందించాలని స్పష్టం చేశారు. చట్టపరమైన హామీలను వల్లెవేయడం కాదుభౌగోళిక, ఆర్థిక, సామాజిక అంతరాలను అధిగమించి వాటి ఫలాలను ప్రజలకు అందించడమే అసలైన సవాల్ అని ఆయన పేర్కొన్నారు.భారత రాజ్యాంగం కూడా పౌరులందరికీ చట్టం ముందు సమానత్వం, గౌరవంగా జీవించే హక్కు వంటి అనేక ప్రాథమిక హక్కులను అందించిందని గుర్తుచేశారు.

# సంక్షిప్త వార్తలు

## కనిష్కను కూల్చింది ఖలిస్థానీ ఉగ్రవాదులే: కెనడా

**ఒట్టావా, జూన్ 26:** ఖలిస్థానీ ఉగ్రవాదంపై మెతకవైఖరి అవలంబిస్తూ వారికి పరోక్షంగా మద్దతిస్తూ, ఆశ్రయమిస్తూ వచ్చిన కెనడా తన వైఖరిని మార్చుకుంటోందా? అవుననే సమాధానం వస్తోంది. ఎయిరిండియా కనిష్క విమాన ప్రమాదం జరిగి నాలుగు దశాబ్దాలు గడిచిన తర్వాత తొలిసారి.. 329 మంది ప్రాణాలను బలిగొన్న ఆ ఘటనలో ఖలిస్థానీ ఉగ్రవాదుల పాత్ర ఉందని అధికారికంగా అంగీకరించింది. ఇన్నాళ్లు ఖలిస్థానీ వేర్పాటువాదుల పేరును ఎన్నడూ ప్రస్తావించని ఆ దేశం.. ఇప్పుడు ఆ దారుణ మారణకాండకు వారే కారణమని



స్పష్టం చేసింది. 1985 జూన్ 23న అట్లాంటిక్ మహాసముద్రంపై ఎయిరిండియా బోయింగ్ విమానం 'కనిష్క' కూలి అందులో ప్రయాణిస్తున్న వారంతా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

## అజాన్‌పై నిషేధం విధించేందుకు డెన్మార్క్ కసరత్తు



**కోపెన్ హ్యాగన్,జూన్ 26:** డెన్మార్క్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా మసీదుల నుంచి బహిరంగంగా విని పిం చే ఇస్లామిక్ ప్రార్థన పిలుపు అజా న్‌పై నిషేధం విధించే అంశాన్ని పరిశీలి స్తోంది. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ హక్కును ఉల్లంఘించకుండా దీనిని ఏ విధంగా అమలు చేయవచ్చనే అంశంపై న్యాయ సమీక్షకు ఆదేశించింది. ఈ విషయాన్ని దేశ ఇమ్మిగ్రేషన్ మంత్రి మోర్టెన్ బోడ్స్కోవ్ వెల్లడించారు. డెన్మార్క్ వీధుల్లో నడుస్తుంటే ఇస్లామాబాద్ శివారు ప్రాంతాల్లో ఉన్నామనే భావన కల గకూడదని ఆయన వ్యాఖ్యానించారు. డెన్మార్క్ పైకప్పుల వెలుపల అజాన్ వినిపించాల్సి న అవసరం లేదని, ఇక్కడ దానికి స్థానం లేదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఇస్లాం ప్రభావం పెరుగుతోందని ఈ సందర్భంగా ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## రాహుల్‌గాంధీపై బిజెపి సోషల్‌మీడియా మీమ్స్ ప్రచారం

**న్యూఢిల్లీ,జూన్ 26:** దేశ రాజకీయాల్లో సోషల్ మీడియా వేదికగా మరో డిజిటల్ వార్ మొదలైంది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా ఒక భారీ మీమ్స్ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. రాహుల్ గాంధీ తరచూ వెళ్లే విదేశీ పర్యటనల సమయం, వాటి ఉద్దేశం, అలాగే ఆ ప్రయాణాలకు అయ్యే ఖర్చుల ఫండింగ్‌ను ప్రశ్నిస్తూ బీజేపీ శ్రేణులు సోషల్ మీడియాను ముం చెత్తుతు న్నాయి. ఈనెల 25 నుంచి ఊపం దుకున్న ఈ సమన్వయ డిజిటల్ ప్రచారంలో బీజేపీ జాతీయ విభాగంతో పాటు వివిధ రాష్ట్రాల ఐటీ సెల్స్, పార్టీ నాయకులు చురు గ్గా పాల్గొంటున్నారు.




## బంకిపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో ప్రశాంత్‌కిషోర్ పోటీ



**పాట్నా,జూన్ 26:** ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఇటీవల నితిన్ నబిన్ రాజ్యసభకు వెళ్లడంతో బీహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీస్థానం ఖాళీ అయింది. దీంతో త్వరలోనే ఈ స్థానానికి ఉపఎన్నిక జరగనుంది. ఈ ఉపఎన్నికలో స్వయంగా రంగంలోకి దిగాలని ప్రశాంత్ కిషోర్ భావిస్తున్నారు. గతేడాది జరిగిన అసెంబ్లీఎన్నికల్లో పోటీ చేయకుండా ప్రచారానికి పరిమితమయ్యారు. దీంతో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే ఉపఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తాజాగా మీడియాకు తెలియజేశారు.

## గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు ధరలు భారీ పతనం..

**న్యూఢిల్లీ,జూన్ 26:** అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు శుక్రవారం భారీగా తగ్గాయి. హార్ముజ్ జలసంధిలో చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గడంతో బ్రెంట్, డబ్ల్యూటీఐ క్రూడ్ ధరలు దాదాపు రెండు శాతం మేర పడిపోయాయి. ఈ వారం మొత్తంగా రెండు బెంచ్‌మార్క్‌లు సుమారు ఏడు శాతం నష్టాలను నమోదు చేసే దిశగా సాగుతున్నాయి. ప్రారంభ ట్రేడింగ్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర రెండు శాతం తగ్గి 73.75 డాలర్లకు, అమెరికా వెస్ట్‌టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర రెండు శాతం పడిపోయి 70.42 డాలర్లకు చేరింది.

## తిరుపతి కళాకారులకు పుట్టినిల్లు

### 'శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్' నృత్య పోటీలు ఆరంభం



**తిరుపతి, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతి కళాకారులకు పుట్టినిల్లు అని, అంతరించిపోతున్న మన సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్ తరాల వారికి అందించాలనే లక్ష్యంతో వ్యయ ప్రయాసలకోర్చి అనేక సంవత్సరాలుగా విజయవంతంగా నడిపిస్తున్న రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కార్యదర్శి కెవిఎన్ రాజాల పనితీరు అభినందనీయం. శుక్రవారం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో మూడురోజులు రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో జరిగే "శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్" జాతీయ నృత్య పోటీలు ప్రారంభమయ్యాయి. టిటిడి సహకారంతో అనేక సాంస్కృతిక ఆధ్యాత్మిక పౌరాణిక ప్రదర్శనలతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన చిన్నారుల అద్భుత నృత్య ప్రదర్శనలతో నగర ప్రజలను, కళాభిమానులను అలరించారు. వేంకటేశ్వరస్వామి పద్మావతి అమ్మ ఆశీస్సులతో చిన్నారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యఅతిథిగా విచ్చేసిన పి.నవీన్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు. టిటిడి ధర్మకర్తల మండలి ఇలాంటి ఆధ్యాత్మిక పౌరాణిక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంపూర్ణ సహకారం అందించాలని నవీన్ విజ్ఞప్తి చేశారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన చిన్నారులు అద్భుతంగా తమ కళా ప్రదర్శనను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి వ్యవస్థాపక కార్యదర్శి కెవిఎన్ రాజా, ఛైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, గౌరవ కార్యదర్శి కస్పా పద్మనాభం, సభ్యులు డాక్టర్ సోము ఉమాపతి, పురోహితులు సురేష్ స్వామి, బండారి భాస్కర్ రెడ్డి, ఆర్ఎంఎస్ భాస్కర్, సిద్దేంద్ర శర్మ, ఆమూరు సుబ్రహ్మణ్యం, చంద్రబాబు నాయుడు, కన్నప్ప గారి కేశవులు, విగ్రహాల కళ్యాణి, మునేంద్ర రెడ్డి, ఆముదాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో జస్టిస్ వై.లక్ష్మణరావు



**శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరుని సేవలో శుక్రవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ ఎఇఒ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆలయ ఇఒ బి.వెంకటేశు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఆలయంలో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలు, అభివృద్ధికి సంబంధించి ఇఒ బికె వెంకటేశు వివరించారు.

## సినీ నటి రాహుకేతుదోష నివారణ పూజలు

**శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం సినీనటి కీర్తి సురేష్ కుటుంబ సమేతంగా రాగా ఆమెకు దక్షిణ గోపురం వద్ద ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గురప్పశెట్టి, తెలుగుదేశం నాయకుడు డిల్లిబాబులు స్వాగతం పలికారు. నటి ఆలయంలో నిర్వహించే రాహుకేతు దోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా ఆలయ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్ సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద వేదపండితులతో ఏర్పాటు చేసారు. పూజల అనంతరం ఆమెకు స్వామి అమ్మవార్ల అంతరా లయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లును ఆలయ ఇఒ బికె వెంకటేశు, ప్రోటోకాల్ ఎఇఒ లోకేష్‌బాబు, ఆలయ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, ఎపిఆర్ఓ రవిలు పర్యవేక్షించారు.

## వాసవి ఆలయ ద్వితీయ ద్వాదశ కుంభాభిషేకానికి సన్నాహాలు

**శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని శివయ్య సన్నిధికి సమీపంలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ద్వితీయ ద్వాదశ కుంభాభిషేకానికి ఆలయ యువ కమిటి సన్నాహాలు చేస్తున్నారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ ఇందుకుమార్ శర్మ పర్యవేక్షణలో నాలుగురోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను రూపకల్పన చేసారు. కుంభాభిషేకానికి ఆలయాన్ని సర్వాంగ సుందర్భంగా తీర్చిదిద్దుతు న్నారు. ఈ నెల 30 నుంచి వచ్చేనెల 2 వరకు కార్యక్రమాలను నిర్వహించుటకు నిర్ణయించినట్లు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు జూలుగంటి మురళి వివరించారు. 30న సాయంత్రం గణపతి పూజలతో కార్యక్రమాలు ప్రారంభమౌతాయి. జులై 2న దేవి హోమాలు కళహోమం, దేవి ఖడ్గమాల హోమం, నవగ్రహ హోమాలు,ఉపపాలక జలాధి హోమాలు, పూర్ణాహుతి నిర్వహించబడుతుందన్నారు. సాయంత్రం ఆడపడచులకు వడిబాల, అలాగే రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు అధ్యక్షులు వివరించారు.

## దుర్గమ్మ దర్శనానికి భక్తజనం




**ఇంద్రకీలాద్రి, జూన్ 26 ప్రభాతవార్త:** శుక్రవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. అంతరాలయ దర్శనం నిలిపివేభక్తుల రద్దీ విపరీతంగా పెరగడంతో అందరికీ త్వరితగతిన దర్శనం కల్పించేందుకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2:30 గంటల వరకు అంతరాలయ దర్శనంతో పాటు వి.ఐ.పి దర్శనాలను పూర్తిగా నిలిపేసి సర్వదర్శనం లైన్ల ద్వారానే భక్తులను అనుమతించారు. భక్తులకు విస్తృత సదుపాయాలుఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో ఉన్న భక్తుల కోసం మొబైల్ టిన్ల ద్వారా చల్లని తాగునీటిని నిరంతరాయంగా పంపిణీ చేశారు. అలాగే ఆలయానికి వచ్చిన భక్తులందరికీ సరిపడా ఉచిత ప్రసాదం, నిత్యాన్నదాన వితరణను విస్తృతంగా ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రు.1,01,116ల విరాళాన్ని శుక్రవారం విజయవాడకు చెందిన నంబూరు కుటుంబరావు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇంజనీర్ అరెస్టు

● కర్నూలు, తిరుపతి, హైదరాబాద్‌లో 6 చోట్ల ఎసిబి సోదాలు ● నగదు, బంగారం, వెండి, స్థిరాస్తులు, వాహనాలు స్వాధీనం





**కర్నూలు, జూన్ 26 ప్రభాతవార్త:** పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి విధులు నిర్వహించేందుకు సైతం అడ్డదారులు తొక్కాడమే ఆరోపణలపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆ మేరకు తనిఖీలు చేసి పాదానికి మించిన ఆస్తులను గుర్తించి సీజ్ చేశారు చివరగా అరెస్టు చేసి ఏసిబి కోర్టులో హాజరు పరచమన్నారు. తిరుపతి కాలుష్య నియంత్రణ మండలిలో సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న బేతి యుగంధర్ ముని ప్రసాద్‌ను శుక్రవారం కర్నూలు ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. చట్టబద్ధమైన ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారన్న విశ్వసనీయ సమాచారం మేరకు అవినీతి నిరోధక చట్టం 1988 సెక్షన్ 13(2), 13(1)(బి) కింద కేసు నమోదు నమో చేశారు ఎఫ్ఐఆర్ నమోదు సమయానికి ఆయన ఆదాయాన్ని కన్నా 130 శాతం అధికంగా ఆస్తులు ఉన్నట్లు రికార్డు చేశారు. కాగా విచారణలో అంతకుమించి ఆస్తులు గుర్తించినట్లు ఎస్సిబీడిఎస్పి సోమన్న తెలిపారు. దర్యాప్తులో భాగంగా శుక్రవారం కర్నూలు, తిరుపతి, హైదరాబాద్‌లలోని మొత్తం ఆరు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో ఆస్తి పత్రాలతో పాటు కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. సోదాల్లో ఆదిత్యనగర్‌లో జి+3 అంతస్తుల భవనం, శిఖర్ ఫ్రైడ్‌లో డ్యూప్లెక్స్ విల్లా, క్లౌడ్9 అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్, నాలుగు ఇంటి స్థలాలు, రూ.5.78 లక్షల నగదు, సుమారు 172 గ్రాముల బంగారం, 3.3 కిలోల వెండి, పోస్టల్ పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, బ్యాంకు డిపాజిట్లు, ఎల్ఐసీ బాండ్లు, బీమా పాలసీలు కలిపి సుమారు రూ.49 లక్షల విలువైన పెట్టుబడులు గుర్తించారు. అలాగే రూ.8 లక్షల విలువైన బాలెనో కారు, రూ.1 లక్ష విలువైన హోండా యాక్టివా వాహనాన్ని కూడా గుర్తించారు. సోదాల సందర్భంగా ఎస్‌బిఐ బ్యాంకు లాకర్ తాళం చెవి లభించగా, సంబంధిత లాకర్‌ను జూన్ 29న తనిఖీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మరిన్ని సోదాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి కర్నూలులోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. కర్నూలు ఏసీబీ డీఎస్పీగా సోమన్న చార్జి తీసుకున్నప్పటినుంచి ఏసిపి కేసుల వేగం పెరిగింది. గతంలో చాలా తక్కువగా నమోదయ్యే కర్నూలు పరిధిలో డిఎస్పి సోమన్న ఆధ్వర్యంలో అధికారులు అవినీతిపరులను వరుసగా పట్టేస్తుండడం ప్రశంసనీయం.

## జైలు నుంచి రియాజ్ విడుదల... మళ్లీ అరెస్ట్

**కడప (కార్పొరేషన్), జూన్ 26 ప్రభాతవార్త:** అల్మాస్ పేట ఘటనలో రియాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం కడప కేంద్ర కారాగారం నుంచి రియాజ్ ను బెయిల్ పై విడుదల చేశారు. అయితే విడుదల అయిన మరుక్షణమే టూ టౌన్ పోలీసులు మళ్లీ అదుపులోకి తీసుకున్నారు. కేంద్ర కారాగారం వద్ద భారీగా పోలీస్ బలగాలను మోహరించారు. జైలు నుండి బయటకు రాగానే రియాజ్‌ను బలవంతంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారని రియాజ్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

అల్మాస్ పేట ఘటనకు సంబంధం లేకపోయినా గతంలో గంజాయి కేసులో అరెస్ట్ చేశారని రియాజ్ కుటుంబం కుటుంబం ఆరోపించింది. సిసిటివి ఫుటేజ్ ఆధారాలతో రియాజ్ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం.

కొడుకుపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, రెండు నెలలుగా జైల్లో ఉంచారన్న రియాజ్ తల్లి వాపోయింది.

## మంత్రి ఇల్లు ముట్టడించిన ఔట్‌సోర్సింగ్ టీచర్లు



**పార్వతీపురం మన్యం జిల్లా(సాలూరు), జూన్ 26 ప్రభాతవార్త:** పార్వతీపురం మన్యం జిల్లా మంత్రి సంధ్యారాణి ఇల్లు ముట్టడి చేసిన ఔట్ సోర్సింగ్ టీచర్ రాష్ట్రంలో ఔట్ సోర్స్ టీచింగ్ వ్యవస్థ ఏ విద్యాసంస్థలో లేదని కేవలం ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో మాత్రమే ఈ వ్యవస్థ ఉందని అలాగే 15 సంవత్సరాల నుండి ఇందులో విధులు నిర్వహిస్తున్న మమ్మల్ని రెగ్యులర్ చేయాలని శుక్రవారం మంత్రి సంధ్యారాణి ఇంటి ముందు బైఠాయించి గురుకుల ఔట్‌సోర్సింగ్ టీచర్స్ పెద్దఎత్తున ధర్నా చేసి నిరసన చేపట్టారు. అలాగే మంత్రి సంధ్యారాణికి వ్యతిరేకంగా మా సమస్యలు పరిష్కరించారని ప్రాణాలైనా విడుస్తాం ఉద్యోగాలను సాధిస్తాం అని నినాదాలు చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో టౌన్ సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ అనిల్ కుమార్ సిబ్బంది రంగంలోకి దిగి టీచర్లను నిలువరించగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అయినప్పటికీ మా సమస్యలు పరిష్కరించకుంటే మరింత ఆందోళన చేపడుతామని గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయలు తెలియజేశారు.

# పసిమొగ్గపై పైశాచికం



**నాలుగేళ్ల బాలికను నీళ్ల డ్రమ్‌లో ముంచి హత్య**

**24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు**

**పక్కింటి మహిళే స్వాతినే నిందితురాలిగా గుర్తింపు**

**న్యాయం కోసం రోడ్డెక్కిన బాధిత కుటుంబం**

**కఠినంగా శిక్షించాలని బాధితుల డిమాండ్**

**పులివెందుల, జూన్ 26 ప్రభాతవార్త:** పసిమొగ్గలాంటి నాలుగేళ్ల చిన్నారి ప్రాణాలను పొట్టన పెట్టుకున్న హృదయ విదారక ఘటన పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం లో చోటుచేసుకుంది. లోపట్నూతల గ్రామంలో నాలుగేళ్ల బాలిక నిత్వికను నీళ్ల డ్రమ్‌లో ముంచి హత్య చేసిన ఘటన గ్రామాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఘటన జరిగిన 24 గంటలు కూడా పూర్తికాకముందే పోలీసులు కేసును ఛేదించి నిందితురాలిని గుర్తించారు.

గ్రామానికి చెందిన సృజన శ్రీ, రామాచారి దంపతుల కుమార్తె నిత్విక (4) గురువారం అనుమానాస్పద స్థితిలో నీళ్ల డ్రమ్‌లో మృతి చెంది కనిపించింది. చిన్నారి మృతిపై తల్లిదండ్రులు, గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు.

**రాత్రివేళ రోడ్డుపై ధర్నా:** చిన్నారిని హత్య చేసి నీటిలో పడవేశారని ఆరోపిస్తూ గురువారం రాత్రి తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు పులివెందుల-పార్నపల్లె రింగ్ రోడ్డుపై ధర్నాకు దిగారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ మురళి నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కేసును త్వరితగతిన ఛేదించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

**పోలీసుల దర్యాప్తులో కీలక ఆధారాలు:** లింగాల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరా ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా పక్కింట్లో నివసించే స్వాతిపై అనుమానం బలపడిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఆమెపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పులివెందులలో నిరసనలు: శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు పులివెందుల రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద, పూలంగల సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. చిన్నారి విషయంలో జరిగిన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిందితురాలికి కఠిన శిక్ష పడాలని డిమాండ్ చేశారు. కుటుంబాల మధ్య ఉన్న వివాదాలకు చిన్నారిని బలి చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుదిరాలికి పోలీస్ శాఖలోనే ఉన్నతాధికారి బంధువు ఉన్నారని కేసు నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం నిరసన చేశారు డీఎస్పీ మురళి నాయక్ బాధితులను కలిసి మాట్లాడు తూ నిందితురాలు వెనుక ఎవరున్నా చట్టపరంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇప్పటికే డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం, సీసీ కెమెరాల ఆధారాలతో దర్యాప్తు ముందుకు సాగిందని తెలిపారు. పులివెందుల డీఎస్పీ కార్యాలయం లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ మురళి నాయక్ మాట్లాడుతూ చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు లింగాల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోస్టుమార్టం కోసం చిన్నారి మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. నీటి నమూనాలు, ఇతర ఆధారాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారి నిత్విక మృతితో లోపట్నూతల గ్రామం విషాదంలో మునిగి పోయింది. వేగంగా స్పందించి కేసును ఛేదించిన పోలీసులపై గ్రామస్థులు విశ్వాసం వ్యక్తం చేస్తూ.. నిందితురాలికి చట్ట ప్రకారం కఠిన శిక్ష పడాలని కోరుతున్నారు.

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి



**తిరుపతి, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో విద్యా వ్యవస్థ దోపిడీ యంత్రంగా మారిందని, నీట్ పరీక్షల నిర్వహణతో కేంద్ర ప్రభుత్వ అసమర్థత బట్టబయలైందని తక్షణం కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్త్ రఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు బాలగురవం బాబు, తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు శుక్రవారం తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. నీట్ పరీక్షల నిర్వహణను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి అప్పగించి ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతోనే దేశంలో లక్షలాదిమంది యువత భవిష్యత్తు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురిచేసిందని అన్నారు. వారి జీవితాలను అంధకారంలోకి నెట్టేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని ప్రశ్నించే గొంతుకలను ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీపై బిజెపి ప్రభుత్వం కక్షగట్టి అక్రమ కేసులతో అరికట్టే చర్యలకు పాల్పడుతోంద న్నారు. యువతకు, విద్యార్థులకు లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు మాట్లాడుతూ నీట్ పరీక్షల ప్రశ్నా పత్రాలు లీకేజీ భారత విద్యా వ్యవస్థలో లోపా లను బయట పెట్టిందని చెప్పారు. నీట్ పరీక్షల కోసం విద్యార్థుల కుటుంబాలు పెడు తున్న ఖర్చు కేంద్ర ప్రభుత్వం విద్యా బడ్జెట్ తో సమానంగా ఉందని తెలిపారు. కోచింగ్ సెంటర్ల ఫీజులు, స్టడీ మెటీరియల్స్ కోసం ఇప్పటికే లక్షలాది రూపాయలు వెచ్చించిన తల్లిదండ్రులపై పునఃపరీక్షల వల్ల అదనపు ప్రయాణ ఖర్చులు, వసతి ఖర్చుల భారం పడిందని వివరించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రిని తక్షణం బర్తరఫ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, ఎన్ఎస్‌యుఐ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శివబాలాజీ, కాంగ్రెసు పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జ్ తలప దామోదర్ రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ బల్ల హరిబాబు, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ వెంకటాచలపతి, పంట శ్రీనివాసులు రెడ్డి, ఐరాల లోకేష్ రెడ్డి, తిరుపతి జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడు జ్యోతీశ్వర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం అంటేనే త్యాగం: సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** మొహర్రం పర్వదినం నేడు. ఈ నేపథ్యంలో ముస్లిం సోదరులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మొహర్రం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మొహర్రం అంటేనే త్యాగం అని సిఎం చంద్రబాబు అన్నారు. సత్య మార్గంలో నడవాలనే స్ఫూర్తిని మొహర్రం అందిస్తుందని అన్నారు. సత్యం, న్యాయం కోసం ఇమామ్ హుస్సేన్ పోరాడారని, ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని మొహర్రం సందర్భంగా స్మరించుకుందామని అన్నారు. మొహర్రం అందరికీ శాంతిని తీసుకురావాలి అన్నారు.

### శాంతి, సామరస్యాల ప్రతీకగా మొహర్రం: లోకేశ్

శాంతి, సామరస్యాల ప్రతీకగా మొహర్రం జరగాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు. హజ్రత్ హుస్సేన్ త్యాగం స్మరించుకునే సందర్భం మొహర్రం జరుపుకొంటారని అన్నారు. ధర్మ పరిరక్షణకు పాటుపడటమే మొహర్రం ఇచ్చే సందేశం అని అన్నారు. మానవత్వానికి ప్రతీక హజ్రత్ హుసేన్స్ అన్నారు.

## గోవా గవర్నర్‌కు బర్త్‌డే విషెస్ చెప్పిన మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజుకు ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యామంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఒక ప్రత్యేక పోస్ట్ చేశారు. అశోక్ గజపతి రాజును విలువల శిఖరం మనసున్న మహారాజు అంటూ లోకేశ్ కొనియాడారు. "ప్రజాస్వామ్యంలో నిలువెత్తు మానవత్వ రాజసం అశోక్ గజపతిరాజు. విద్యాలయాలకు వేల ఎకరాలు దానమిచ్చిన వితరణశీలి, ఆధ్యాత్మిక సేవకు ఆస్తులు ధారపోసిన ధర్మకర్త, రాజకీయాలలో అందరి మన్ననలు అందుకున్న అజాతశత్రువ్వు అని లోకేశ్ తన పోస్టులో ప్రశంసించారు. ప్రజల మనిషిగా వారి హృదయాల్లో స్థానం సంపాదించు కున్నారని పేర్కొన్నారు. అశోక్ గజపతిరాజు ఆయురారోగ్యాలతో, ఆనందంగా వందేళ్లు వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి లోకేశ్ తన శుభాకాంక్షల సందేశంలో తెలిపారు.

## డ్రగ్స్ మాఫియాపై డేగ కన్ను: ఈగిల్ ఐజి

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త:** యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ మాఫియాపై నిఘాను తీవ్రతరం చేసి నేరాలను అరికడుతున్నట్లు ఎ.పి. ఈగిల్ ఛీఫ్ ఐజి రవికృష్ణ స్పష్టం చేశారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని పాత ప్రభుత్వ ఆసుపత్రివద్ద రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఈగల్ ఏపీ, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, వాకథాన్ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, రాష్ట్ర విభిన్న ప్రతిభా వంతులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి హాజరైన ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈగల్ ఏపీ ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 40 వేలకుపైగా ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ చైతన్య ద్వారా రాష్ట్రంలో "జీరో గంజాయి సాగు లక్ష్యాన్ని సాధించామని పేర్కొన్నారు. తమ ప్రాంతాల్లో గంజాయి లేదా మాదకద్రవ్యాల కార్యకలాపాలు గుర్తిస్తే ప్రజలు 1972 ఈగల్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. డ్రోన్ నిఘా ద్వారా హాట్‌స్పాట్ ప్రాంతాల్లో మంచి ఫలితాలు సాధించినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం "ఈగల్ ఏపీ" ద్వారా మాదక ద్రవ్యాల సరఫరా, రవాణా, విక్రయాలపై డేగ కళ్లతో నిఘా ఉంచుతూ మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాడిని చేరుకునేందుకు దృష్టి సారించాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని, ప్రజల్లో అవగాహన పెంపొం దించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ పురస్కార గ్రహీతకి సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సన్మానం



**అనంతపురం, జూన్ 26 ప్రభాత వార్త బ్యూరో:** కేంద్ర ప్రభుత్వ పురస్కారం అందుకున్న అనంతపురం జిల్లా పెద్దవడుగూరు గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ప్రముఖ సిపిఐ నాయకులు ఎద్దుల సూర్యనారాయణ రెడ్డిని ఢిల్లీలోని ఇంద్రజిత్ గుప్త మార్గ్లో ఉన్న అజయ్ భవన్లో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ.. 92 ఏళ్ల వయస్సులో కూడా సూర్యనారాయణ రెడ్డి ఎంతో చురుకుగా ఉండటం ఆనందదాయకమని అన్నారు. సిపిఐ పార్టీకి ఎనలేని సేవలు అందించడంతో పాటు సమాజ సేవలో నిరంతరం పాల్గొంటూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం అందించిన పురస్కారం ఆయన జీవితకాల సేవలకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కె. రామకృష్ణ, అఖిల భారత స్వాతంత్ర సమరయోధుల వారసుల సంఘం జాతీయ కార్యదర్శి రాంపిళ్ల జయప్రకాశ్, గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విజయభాస్కర్, ఢిల్లీ సామాజిక కార్యకర్త గురుదేవ్ తదితరులు పాల్గొని ఎద్దుల సూర్యనారాయణ రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

## తండ్రి కట్టిన ఇల్లు.. కూల్చడం ఇష్టం లేక జాకీలతో పైకి!

### జంగారెడ్డిగూడెంలో అరుదైన దృశ్యం



**జంగారెడ్డిగూడెం, జూన్ 26 ప్రభాతవార్త:** తండ్రి జ్ఞాపకంగా నిలిచిన ఇంటిని కూల్చివేయడం ఇష్టం లేక, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఓ వ్యక్తి భవనాన్ని ఏకంగా ఐదు అడుగుల మేర పైకి లేపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన ధూబగంట్ల వెంకటేశ్వరరావుకు చెందిన ఇల్లు పరిసరాల్లోకి నీరు చేరుతుండటంతో ఈ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. తన తండ్రి సత్యనారాయణ నిర్మించిన ఈ ఇంటిని పడగొట్టి మళ్లీ నిర్మించాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో సుమారు రూ.2 నుండి 3 కోట్ల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. దీనికి తోడు తండ్రి కట్టిన ఇల్లు కావడంతో దానిని కూల్చడానికి మనసొప్పని వెంకటేశ్వరరావు.. జాకీల సాయంతో భవనాన్ని పైకి లేపేందుకు గత కొన్ని సంవత్సరాలుగా నమ్మకమైన సంస్థ కోసం అన్వేషించారు. ఈ క్రమంలో విజయవాడకు చెందిన ఒక ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పనుల కోసం సదరు సంస్థ 40 మంది కార్మికులతో, దాదాపు 600 జాకీలను ఏర్పాటు చేసి భవనాన్ని సురక్షితంగా పైకి లేపే ప్రక్రియను ప్రారంభించింది. ప్రస్తుతం ఈ పనులు తుదిదశకు చేరుకున్నాయి. కూల్చివేత లేకుండా, భారీ ఖర్చు ఆదా అవుతూ ఇల్లు పైకి లేస్తున్న ఈ అద్భుత ప్రక్రియను స్థానికులు ఆసక్తిగా తరలివచ్చి తిలకిస్తున్నారు.

## తెప్పపై విహరించిన సుందరరాజ స్వామి



**తిరుమల, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి అమ్మ వార్షిక తెప్పోత్సవాల్లో శుక్రవారం సాయంత్రం పద్మ సరోవరంలో సుందరరాజ స్వామి తెప్పపై మూడు చుట్లు విహరించి భక్తులకు దివ్య దర్శనం ప్రసాదించారు. మధ్యాహ్నం స్వామివారికి పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకం జరిపారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేసి, తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం సుందరరాజ స్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్, ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్, ఎవిఎస్ఒ రాధాకృష్ణ, సూపరింటెండెంట్‌లు సురేష్, రమేష్, ఆలయ ఇన్స్పెక్టర్ చలపతి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఉద్యోగం ఇప్పిస్తామని..
## రూ.2,16 లక్షలు నగదు మోసం

**తిరుపతి, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి 2,16 లక్షలు రూపాయలు మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తిరుపతికి చెందిన కె. వెంకన్న (51) కు సురేష్ రాజ్ అనే వ్యక్తి తనను బెంగళూరులోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్నానని పరిచయం చేసుకున్నాడు. బీటెక్ పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు ఇప్పించగలనని చెప్పి ఫిర్యాదుదారుడితో పరిచయం పెంచుకున్నాడు. తన కుమారుడు బీటెక్ పూర్తి చేశాడని ఫిర్యాదుదారుడు చెప్పగా, మమత శ్రీనివాస్ అనే ఒక మొబైల్ నంబర్ ఇచ్చాడు. ఆమెకు ఫోన్ చేయగా ఆ మహిళ తాను యాక్సెంచర్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నానని చెప్పి, ఫిర్యాదుదారుడి కుమారుడి రెజ్యూమ్‌ను పంపించాలని కోరింది. రెజ్యూమ్ పరిశీలించిన అనంతరం ఉద్యోగ ప్రక్రియలో భాగంగా వివిధ పేర్లతో వరుసగా అప్లికేషన్ ఫీజు, ప్రాసెస్ ఫీజు, ఆఫర్ లెటర్ ఫీజు, బ్యాంక్ అకౌంట్ ఫీజు, క్లయింట్ ఆఫర్ లెటర్ ఫీజు, మెడికల్ ఫీజు, ఆఫర్ లెటర్ రీజనరేషన్ ఫీజు తదితర పేర్లతో డబ్బులు చెల్లించాలని కోరారు. దీంతో వెంకన్న కుమారుడు నిందితురాలు మమత శ్రీనివాస్‌కు మొత్తం పది దఫాలుగా రూ.2,16,250లు బదిలీ చేశాడు. భారీగా డబ్బు మొత్తం అందుకున్న తర్వాత మమత శ్రీనివాస్ ఫోన్‌కు స్పందించడం లేదు. సురేష్ రాజ్‌ను సంప్రదించినప్పటికీ అతడు కూడా కాలయాపన చేస్తూ తప్పించుకోవడం ప్రారంభించాడు. దీంతో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి ఇద్దరూ కలిసి మోసానికి పాల్పడినట్లు ఫిర్యాదుదారుడు గ్రహించాడు. అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



సిఆర్‌పిఎఫ్ బలగాలు జప్తు చేసిన మావోయిస్టుల డంప్

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల డంప్ స్వాధీనం

### 24 లక్షల నగదుసహా ఆయుధాలు, పేలుడు పదార్థాలు లభ్యం

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్ నక్సలైట్ల ఏరివేతకు కేంద్రం చేబట్టిన ఆపరేషన్ కగార్ ముగిసినప్పటికీ మావోయిస్టుల కోస ం అటవీ ప్రాంతంలో వారు దాచివుంచిన డంప్‌లు, మందు పాతరలు, పేలుడు పదార్థాల కోసం కేంద్ర బలగాల వేట కొనసాగుతూనే వుంది. ఈ క్రమంలో ఛత్తీస్‌ఘడ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లా టెకా అటవీ ప్రాంతంలో నక్సలైట్ల కదలికలపై సమాచారం అందుకున్న సిఆర్‌పిఎఫ్ బలగా లు గురువారం ఉదయం నుంచి ముమ్మరంగా కూంబింగ్ చేబట్టారు. సిఆర్‌పిఎఫ్ పోలీసులకు తోడుగా జిల్లా సాయుధ పోలీసులు కూడా కూం బింగ్‌లో పాల్గొన్నారు. అయితే పోలీసుల రాకను గమనించి నక్సలైట్లు వెళ్లిపోగా పోలీసు జాగిలాలు ఒకచోట అదేపనిగా అరుస్తూ వుండడంతో అనుమానం వచ్చి పోలీసులు సోదాచేయగా మావోయిస్టుల డంప్ కనిపించింది. ఇందులో 24 లక్షల రూపాయల నగదుతోపాటు తుపాకులు, మందుగుండు సామాగ్రి లభ్యమయ్యింది. వీటిని సిఆర్‌పిఎఫ్ బలగాలు తమ స్థావరానికి తరలించారు. దీనిపై కేంద్ర హోంశాఖతోపాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీ సులకు సమాచారం అందించారు.

## సింగపూర్ కేంద్రంగా సైబర్ నేరాలు

### మ్యూల్ ఖాతాలు నిర్వహిస్తున్న నలుగురి అరెస్టు

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** సింగపూర్ కేంద్రంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఓ ముఠాకు తెలంగాణలో మ్యూల్ ఖాతాలు అందిస్తూ సహకరిస్తున్న నలుగురిని సిటీ సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి కేవలం ఒక సెల్‌ఫోన్ మాత్ర మే పట్టుబడింది. దీనికి సంబంధించిన వివరాలను సైబర్ క్రైం డిసిపి అరవింద్‌బాబు వెల్లడించారు. హైదరాబాద్‌కు చె ందిన ఓ వ్యక్తిని గత ఫిబ్రవరి నెలలో మ్యాట్రిమోనియల్ టీం పేరిట సైబర్ నేరగాళ్లు యువతి తరహాలో మాట్లాడి బురిడి కొట్టించి ఇన్వెస్ట్‌మెం ట్ పేరిట కోటి 46 లక్షల రూపాయలను కాజేశారు. తాము సూచించిన కంపెనీల్లో పెట్టుబడులు పెడితే దండిగా లాభాలు వస్తాయని నమ్మించి న వీరు ఆ తరువాత బాధితుడి ఫోన్‌కు స్పందించడం మానేశారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా దీనిపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు. కాగా ఈ కేసులో సింగపూర్ కేంద్రంగా బడా సైబర్ క్రైం జరుగుతున్నట్లు తేలింది. అక్కడి ముఠాకు తెలంగాణలో పలు ప్రాంతాలలో మ్యూల్ ఖాతాలు అందిస్తున్న నలుగురు వున్నట్లు తేలింది. బాధితుడి నుంచి కాజేసిన రూ.కోటీ 46 లక్షలు ఇండియన్ ఓవర్‌సీస్ సహా పలు బ్యాంకుల నుంచి అనేక ఖాతాలకు మళ్లించినట్లు తేలడంతో మ్యూల్ ఖాతాలు కలిగిన వారిపై ఆరాతీయగా సిద్దిపేట్‌కు చెందిన చొక్కాల సంపత్(29), సికింద్రాబాద్‌కు చెందిన హెచ్చు నరేష్ (37), ఎండ్ల సురేష్ (43), వడ్కల మహేష్(33) గోల్‌మాల్ రట్టయ్యింది. ఈ నలుగురు సింగపూర్ నేరగాళ్లకు కమీషన్ తీసుకుని మ్యూల్ ఖాతాలను అందించినట్లు తేలింది. ఇందులో రూ.46.65 లక్షలు హైదరాబాద్‌లోని పలు బ్యాంకుల నుంచి లావాదేవీలు జరిగినట్లు తేలింది. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు నుంచి 35 లక్షల రూపాయలు బదిలీ అయినట్లు తేలింది. ఈ కేసులో చొక్కాల సంపత్ కీలక నిందితుడుగా తేలింది. ఇతను 30 శాతం కమీషన్‌పై నేరం చేయగా హెచ్చు నరేష్ 15 శాతంపై, ఎండ్ల సురేష్ పది శాతం, మహేష్ 10 శాతంపై ఖాతాలు అందించినట్లు తేలింది. కమీషన్ ద్వారా అం దిన డబ్బులను నిందితులు తమ అవసరాలకు వాడుకున్నారు. వీరి వద్ద నేరం చేసేందుకు వాడిన సెల్‌ఫోన్‌ను జప్తు చేశారు. ఈ కేసులో సింగపూర్‌లో వుండే ప్రధాన నేరగాళ్లతో పాటు భారత్‌లో వారికి సహకరించిన ఇతర నేరస్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# సింగపూర్‌లో క్రమశిక్షణతో కూడిన విద్యావిధానం

- ప్రతిభ చూపితేనే హైస్కూలులో మంచిసీటు
- సీనియర్ టీచర్లు జూనియర్లకు గైడ్ చేస్తారు
- మంత్రి లోకేష్ ఎదుట ఆసక్తికరమైన అంశాలను వెల్లడించిన టీచర్లు
- టీచర్ల గౌరవాన్ని పెంచారంటూ మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఉపాధ్యాయులు

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** సింగపూర్‌లో అత్యంత విజ్ఞానవంతమైన, కఠినమైన క్రమశిక్షణతో కూడిన విద్యావిధానం అమలులో ఉండటం వల్ల అక్కడ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారని సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లిన ఉత్తమ ఉపాధ్యాయులు మంత్రి లోకేష్‌కు తెలియజేశారు. సింగపూర్ టూర్‌కు వెళ్లిన ఉత్తమ ఉపాధ్యాయులతో మంత్రి లోకేష్ నిర్వహించిన సమావేశంలో పలు ఆసక్తికరమైన అంశాలను వెల్లడించారు. అక్కడ ఉపాధ్యాయులు వారానికోసారి నిర్వహించుకునే సమావేశంలో సబ్జెక్ట్ వైజ్ డిస్కషన్, వారి మధ్య కోఆర్డినేషన్ బాగున్నాయని చెప్పారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ విద్యార్థుల్లో నైతిక విలువల పెంపుదలకే రాష్ట్రంలో మనం విలువల విద్యపై చాగంటి కోటేశ్వరరావు రూపొందించిన పాఠ్యాంశాలను ప్రవేశపెట్టామని చెప్పారు. తాను విద్యనభ్యసించిన స్టాన్‌ఫోర్డ్‌లో ఫైనల్ ఎగ్జామ్స్‌లో ఇన్విజిలేటర్లు ఉండరు, ఆనర్ కోడ్ ఉంటుంది, స్వీయ క్రమశిక్షణ వల్ల ఎవరూ అక్కడ కాపీయింగ్ వంటివి చేయరని అన్నారు. తల్లికి చెప్పలేని పని చేయొద్దన్న చాగంటి మాటలు తన మనసును హత్తుకున్నాయని చెప్పారు. భీమిలికి చెందిన హెచ్‌ఎం తిరుమల శ్రీదేవి మాట్లాడుతూ వెల్‌నెస్ అంబాసిడర్స్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ నియామకం వల్ల అక్కడ కెపాసిటీ బిల్డింగ్ బాగుంది, సీనియర్ టీచర్లు జూనియర్లకు గైడ్ చేస్తున్నారు, స్కూలు స్థాయిలో వెల్ బీయింగ్ కమ్యూనిటీస్, నెలకోసారి నిర్వహించే కాంప్లెక్ట్ మీటింగ్, స్ట్రెస్ మేనేజ్ మెంట్ వర్క్ షాపుల నిర్వహణ, టీచర్ ఎచీవ్‌మెంట్ సెలబ్రేషన్స్ వంటివి ఉపాధ్యాయులకు ప్రోత్సహాకారంగా ఉన్నాయని చెప్పారు.




**ప్రతిభ చూపితేనే హైస్కూలులో మంచిసీటు:** ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ జాన్సన్ దేవరాజ్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రైమరీ స్కూల్ లెర్నింగ్ ఎగ్జామినేషన్‌లో మంచి మార్కులు సాధిస్తేనే విద్యార్థులకు 6వతరగతిలో దగ్గరగా ఉన్న స్కూలులో సీటు లభిస్తుందని చెప్పారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో అమలుచేస్తే బాగుంటుందన్నారు. దీనివల్ల అప్పర్ ప్రైమరీతోపాటు లోయర్ సెకండరీలో నాణ్యతా ప్రమాణాలు బాగుంటాయని అన్నారు. 7వ తరగతిలో కామన్ పరీక్షలు నిర్వహించే విధానాన్ని రాష్ట్రంలో 2007లో తొలగించారని చెప్పారు. దీనిపై మంత్రి లోకేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి తట్టుకోగలరా అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని, దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సి ఉందని తెలిపారు. పల్నాడు జిల్లాకు చెందిన హెడ్ మాస్టర్ మోటా పార్వతి మాట్లాడుతూ సింగపూర్‌లో ఫ్యూచర్ ఫోకస్ ఎడ్యుకేషన్ అమలులో ఉందని, విద్యార్థులు స్కూలు నుంచే బయటకు వెళ్లే సమయానికి ఏదో ఒక స్కిల్‌తో వెళ్తున్నారని, దీనివల్ల చదువు పూర్తయ్యాక ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసే పరిస్థితి అక్కడ లేదన్నారు. గుంటూరుకు చెందిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ గుమ్మడి షీలా మాధురి మాట్లాడుతూ సింగపూర్‌లో విద్యతోపాటు క్రీడలకు సమ ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. తాను 2000 సంవత్సరంలో డిఎస్సీ స్పోర్ట్స్ కోటాలో టీచర్‌గా ఎంపికయ్యానని, ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3శాతం స్పోర్ట్స్ కోటా క్రీడలకు ప్రోత్సాహకరంగా ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మమ్మల్ని సింగపూర్ పంపి ప్రభుత్వ ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంచారంటూ మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ శాప్, ఏపీఏల ద్వారా క్రీడాకారులను ప్రోత్సహించి, వైబ్రంట్ స్పోర్ట్స్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. సింగపూర్ ప్రజల్లో కసి ఉండటం వల్లే ఒక మత్స్యకార గ్రామం ప్రపంచ ప్రఖ్యాతదేశంగా అభివృద్ధి చెందింది, మనలో కూడా అటువంటి కసి రావాలని అన్నారు.

**టీచర్లు పరిశ్రమల్లో కూడా 3నెలలు పనిచేయొచ్చు:** అనంతపురం జిల్లా పామిడికి చెందిన ఏపీ మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ అరుణ మాట్లాడుతూ సింగపూర్‌లో టీచర్ ట్రైనింగ్, గ్రేడింగ్ ఆఫ్ టీచర్స్ విధానాలు బాగున్నాయి, ప్రతిఏటా వందగంటల ఆన్ లైన్ శిక్షణను కంపల్సరీ చేయడం వల్ల ఏఐ వంటి అధునాతన కోర్సుల్లో టీచర్లు అప్ గ్రేడ్ కావడానికి అవకాశమేర్పడుతుందని అన్నారు. టీచర్లు మూడు నెలలపాటు తమకు ఆసక్తి ఉన్న పరిశ్రమలో పనిచేసే అవకాశం కూడా అక్కడ ఉందని తెలిపారు. శ్రీకాళహస్తి మండలానికి చెందిన స్కూల్ అసిస్టెంట్ ఎన్.సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ అక్కడ ప్రైమరీ సెకండరీ విద్యార్థులకు నిర్వహించే స్లిప్ టెస్ట్, మిడ్ ఇయర్ ఎసెస్ మెంట్ బాగుందన్నారు. మనవద్ద క్రియేటివిటీ, క్రిటికల్ థింకింగ్ అప్ గ్రేడ్ చేయాల్సి ఉందని తెలిపారు. అనంతపురం జిల్లా గుత్తికి చెందిన ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ బండి శ్రీనివాసులు మాట్లాడుతూ అక్కడ ఫర్ ద టీచర్, బై ద టీచర్ విధానంతోపాటు అకాడమీ ఆఫ్ సింగపూర్ వారు నిర్వహించే సింపోజియం నిర్వహణ, మెంటరింగ్ విధానాల వల్ల టీచర్లు ఒత్తిడిలేకుండా బోధన చేయగలుగుతున్నారని తెలిపారు. మంత్రి లోకేష్ స్పందిస్తూ సింగపూర్ వెళ్లిన టీచర్లు అద్భుతమైన సలహాలు ఇచ్చారు, మనవద్ద విద్యార్థి కేంద్రంగా సంస్కరణలు అమలుచేయాల్సి ఉంటుంది, అందువల్ల జాగ్రత్తగా అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లిన ఉపాధ్యాయుల ఇచ్చిన సూచనలను అమలు చేసేందుకు ఒక ప్రత్యేక మెకానిజం ఏర్పాటుచేసి, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని అన్నారు. సింగపూర్ ప్రస్తుతస్థితికి రావడానికి ఐదారు దశాబ్దాలు పట్టిందని తెలిపారు. ఇందుకు ఉపాధ్యాయుల్లో కమిట్ మెంట్, పట్టుదల కావాలి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన లీప్ యాప్‌ను కేవలం 2శాతం తల్లిదండ్రులు మాత్రమే డౌన్ లోడ్ చేసుకున్నారు, విద్యార్థులు కూడా తమ బిడ్డల భవిష్యత్తుపై బాధ్యత, శ్రద్ధ తీసుకుంటేనే వ్యవస్థలో మార్పు తేవడం సాధ్యమవుతుందని చెప్పారు.

## గ్రామీణులకు నాణ్యమైన వైద్యసేవలు అందించటంలో
# పిహెచ్‌సిల పాత్ర కీలకం

- మాజీ ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు
- ఆత్కూరులో పిహెచ్‌సి భవనం ప్రారంభం



ప్రాథమిక ఆరోగ్యకేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు

**ఉంగుటూరు(కృష్ణా), జూన్ 26 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు అందించటంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పాత్ర కీలకమని మాజీ ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలో ప్రభుత్వ, ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ లిమిటెడ్ సిఎస్ఆర్ నిధులు రూ.1.54కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రంను శుక్రవారం వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసూతిసేవలు, శిశుసంరక్షణ, రోగనిరోధక టీకాలు, అత్యవసర వైద్యసేవలు, ప్రాథమిక చికిత్స, అవసరమైన ల్యాబొరేటరీలు, ఆధునిక వైద్యపరికరాలు, మందులు వంటి సౌకర్యాలు అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైతే ఉన్నత వైద్యశాలలకు పంపించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, కూలీలకు ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించటం ఆరోగ్యకేంద్రాల బాద్యతగా ఆయన పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు. పూర్వకాలంలో ప్రజలు కాయకష్టం చేస్తూ ఆర్యోగకరమైన జీవితం గడిపేవారని, ప్రకృతిని ఆరాధిస్తూ చెట్లు, చెరువులు, నీటి వనరులను పరిరక్షించేవారని గుర్తుచేసారు. దేశంలో ప్రధాని మోడీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్ధవంతమైన పాలన అందిస్తున్నారని కితాబిచ్చారు. ప్రజలకు ఉచిత పథకాలు ఇచ్చే బదులు గ్రామాల్లో రహదారులు నిర్మించి, అందరికి ఉచిత వైద్యం, విద్యను అందించటంతోపాటు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టాలని ప్రభుత్వాలకు సూచించారు. ఆ ంధ్ర విశ్వవిద్యాలయంలో 800 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్న మంత్రి నారా లోకేష్‌ను ఈసందర్భంగా వెంకయ్యనాయుడు అభినందించారు. ఈకార్యక్రమంలో కృష్ణాజిల్లా కలెక్టర్ డికె.బాలాజీ, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ ప్రతినిధి ద్వివేది, డియంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

**విద్యసమాజ వికాసానికి దోహదపడాలి:** విద్య ఉద్యోగానికే పరిమితం కాకుండా సమాజ వికాసానికి దోహదపడే విధంగా ఉండాలని, భారతీయ సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించే బాధ్యతను ప్రతివిద్యార్థి తీసుకోవాలని మాజీ ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు సూచించారు. ఆత్కూరు గ్రామంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో వృత్తివిద్యాకోర్సుల్లో శిక్షణ పొందుతున్న అభ్యర్దులతో వెంకయ్యనాయుడు శుక్రవారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ విద్యతోపాటు, నైతిక, మానవీయ విలువలు పెంపొందించుకోవాలని, క్రమశిక్షణతో ఉంటూ దేశభక్తిని కలిగి ఉండాలని కోరారు. విద్యార్దులు తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- ప్రమాదాల ప్రదేశాలను గుర్తించి ముందస్తు భద్రతా సూచికలు ఏర్పాటు చేయాలి: మంత్రి రవికుమార్



**బల్లికురవ, జూన్ 26 ప్రభాతవార్త:** పల్నాడు జిల్లాలో ఇటీవల వరుసగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలపై జిల్లా ఇన్‌ఛార్జి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటిని యాక్సిడెంట్ స్పాట్స్‌గా గుర్తిస్తూ అవసరమైన ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. రహదారులపై ప్రమాద సూచికలు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ సైనేజీలు ఏర్పాటు చేసి, వాహనదారులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించిన మంత్రి, భారీ వాహనాలు సాంకేతిక లోపం లేదా ఇతర కారణాలతో రోడ్డుపై నిలిచిపోయిన సందర్భాల్లో, వెనుక నుంచి వచ్చే వాహనాలకు ముందుగానే హెచ్చరిక అందేలా వెంటనే భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీకి దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ట్రాఫిక్ సిబ్బంది, క్రేన్లు, అత్యవసర సహాయక బృందాలను వెంటనే రంగంలోకి దించాలని పేర్కొన్నారు. మాచర్ల నగరవనం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ కుటుంబాలకు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో గాయపడిన వారికి అందుతున్న వైద్య చికిత్సపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న మంత్రి, క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చూడాలని, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.

ప్రజల ప్రాణ భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్న మంత్రి, రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రమాదాల సంఖ్య తగ్గించే దిశగా శాశ్వత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



అనంతపురంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

# అనంతలో ఉద్రిక్తత

- తాడిపత్రికి వెళ్లకుండా వైసిపి నేతలను అడ్డుకున్న పోలీసులు
- రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేసిన వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి

**అనంతపురం, జూన్ 26 ప్రభాతవార్త బ్యూరో:** టిడిపి నేతల దౌర్జన్యాలను నిరసిస్తూ తాడిపత్రిలో చేపట్టిన నిరసన దీక్షకు వెళ్లేందుకు ప్రయత్నించిన వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని పోలీసులు అడ్డుకోవడం అనంతపురం నగరంలో ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసుల తీరును నిరసిస్తూ వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి ఇతర నేతలతో కలిసి రోడ్డుపై భైటాయించి పోలీసుల తీరును ఎండగట్టారు. వైసిపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డితోపాటు పెద్ద ఎత్తున పార్టీ నేతలు శ్రేణులు సమావేశం అయ్యారు. అక్కడి నుంచి తాడిపత్రికి వెళ్లేందుకు సిద్ధం కాగా కార్యాలయం గేటు ఎదుట పోలీసులు బారికేట్లు పెట్టి వారిని నిలువరించేప్రయత్నం చేశారు. పోలీసు ఆంక్షలు, బారికేట్లను తొలగించుకుని బయటికి వచ్చిన జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రత్యేక వాహనంలో కోర్టు రోడ్డులోని అనంత వెంకటరామిరెడ్డి నివాసానికి తరలించారు. అయితే పోలీసుల తీరును నిరసిస్తూ కోర్టు రోడ్డు ప్రధాన రహదారిపై జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీ నేతలతో కలిసి రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సంరద్భంగా జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో తాడిపత్రి నియోజకవర్గం లేదా, తాడిపత్రికి వెళ్లేందుకు ఇన్ని ఆంక్షలు ఎందుకంటూ పోలీసుల తీరును ప్రశ్నించారు. 43 ఏళ్ల నా రాజకీయ జీవితంలో పోలీసులు ఇంతగా దిగజారిన తీరును తొలిసారిగా చూస్తున్నానని మండి పడ్డారు. తాడిపత్రిలో మట్కా, గంజాయి విచ్చల విడిగా జరుగుతోందని వాటిని అడ్డుకోవడంలో పోలీసులు విఫలం అయ్యారని విమర్శించారు. తాడిపత్రిలో జెసి అనుచరులు పోలీసులను అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలు చేస్తున్నారని మండి పడ్డారు. సీఎం చంద్రబాబు అండతోనే తాడిపత్రిలో అసాంఘీక శక్తులు రెచ్చిపోతున్నాయని విమర్శించారు. తాడిపత్రిలో అసాంఘీక కార్యకలాపాలను అడ్డుకట్ట వేసే ధైర్యం చంద్రబాబుకు లేదా అని ఆయన ప్రశ్నించారు. తాడిపత్రిలో వైసిపి నాయకులపై పోలీసుల సమక్షంలోనే దాడులు జరుగుతున్నా పోలీసులు వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. మరోవైపు జెసి ప్రభాకర్‌రెడ్డి మా ఇళ్ల వద్దకు వస్తామని బెదిరిస్తున్న మాటలు ఎస్పీకి వినపడం లేదా అని ఆయన ప్రశ్నించారు. అప్రజాస్వామిక విధానాలు, టిడిపి దాడులపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్మంగా మారుస్తామని మా పోరాటం ఇక ఆగదని ఆయన హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాడిపత్రిలో పెద్దారెడ్డి ఇంటి చుట్టూ ముళ్లకంచ చుట్టూ ఇళ్ల కంచె వేసి పోలీసులు అడ్డుకుంటున్నారని, తాడిపత్రిలో ప్రత్యేక ప్రతిపత్తి, ప్రత్యేక రాజ్యాంగం ఉందా అని ప్రశ్నించారు. తాడిపత్రిలో ప్రజాస్వామిక విధానాలపై పోరాడుతున్నామని కట్టడి చేయాల్సింది దాడులు చేస్తున్నవారిపై కాకుండా మాపై పోలీసులు కట్టడి చేస్తున్నారని విమర్శించారు. తాడిపత్రిలో ప్రజాస్వామ్య పరిరక్షణకు వైసిపి పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని అక్కడి నుంచి తన నివాసానికి తరలించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైఎస్‌ఆర్‌సిపి ముఖ్య నేతలు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.

## లండన్‌లో తెలంగాణ విద్యార్థి అనుమానాస్పద మృతి



**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** లండన్‌లో కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన సావుసాని శ్రీనాథ్‌రెడ్డి (25) లండన్‌లో రెండు రోజుల క్రితం అనుమానస్పదంగా మృతి చెందాడు. ఉన్నత చదువుల కోసం తెలంగాణకు చెందిన ఆ యువకుడు ప్రాణాలు కోల్పోయాడంతో తలమడ్ల గ్రామంలో విషాదం నెలకొంది. శ్రీనాథ్ గతేడాదే లండన్‌లో చదువుకోవడానికి వెళ్లినట్లు బంధువులు తెలిపారు. శ్రీనాథ్ తలితండ్రులు మధుసూదన్ రెడ్డి, మంజుల కుమారుడి మరణవార్త తెలియడంతో హృద విదారకంగా విలపించారు. శ్రీనాథ్ రెడ్డి లండన్ లోని లీసెస్టర్ యూని వర్సిటీలో ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతు న్నాడు .రెండు రోజుల క్రితం స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లిన శ్రీనాథ్ రాత్రి అక్కడే నిద్రించాడు. తెల్లవారేసరికి విగతజీవిగా పడి ఉన్నట్లు స్నేహితులు అక్కడే ఉన్న శ్రీనాథ్ బంధువులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకొని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన తమ కుమారుడు ఇక తిరిగిరాడని శాశ్వతంగా ఈ భూమిపై నుంచి వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. శ్రీనాథ్ మృతదేహాన్ని సాధ్యమైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని మంజుల మధుసూదన్‌రెడ్డి దంపతులు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నపం చేశారు.



# సాకర్ ప్రపంచకప్‌లో కాబో వెర్డే సంచలనాల మోత

## చిన్న దేశం.. పెద్ద కలలు

**మాజీ ఛాంపియన్ స్పెయిన్‌తో 0-0తో డ్రా**
**మరో మేటి జట్టు ఉరుగ్వేతో 2-2తో డ్రా**

గ్రూప్-హెచ్‌లో ఉన్న ఈ రెండు జట్లు నాకౌట్‌కు చేరుకోవడం నల్లేరుపై నడకే అని అనుకున్నారంతా. బరిలోకి దిగాక కానీ తెలియలేదు. తమను ఓ ఫుట్‌బాల్ కూన ఇంతలా ఇబ్బంది పెడుతుందని. ఆ జట్టే కాబో వెర్డే. ఇప్పటివరకు ప్రపంచానికి పెద్దగా తెలియని పేరు.ఈపేరుతో ఓ దేశం ఉందా అన్నది సాకర్ ప్రపంచకప్‌తోనే అందరికి తెలిసింది.అలాంటి టీమ్... ఫిఫా ప్రపంచకప్‌లో అందరి అంచనాలకు భిన్నంగా రాణిస్తూ మహా మహా జట్లకే చెమటలు పట్టించింది. స్పెయిన్‌ను కనీసం గోల్ చేసే ఛాన్స్ కూడా ఇవ్వని కాబో వెర్డే... ఉరుగ్వేను అలాగే నిలువరించింది. ఓటమనేది లేకుండా ఉన్న కాబో వెర్డే పేరు సాకర్ ప్రపంచకప్‌లో మారుమోగుతోంది.

(వార్త క్రీడా విభాగం)

అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా అతిథ్యమిస్తున్న సాకర్ ప్రపంచకప్ లీగ్ స్టేజ్ చివరికొచ్చింది. ఫేవరెట్ జట్లు తమస్థాయి విజయాలతో ముందంజ వేస్తున్నాయి. ఇక స్టార్ ఆటగాళ్లు కూడా గోల్స్ వర్షంతో అంచనాలను అందుకుంటున్నారు. ఈ మధ్యలో ఒకే ఒక జట్టు కాబో వెర్డే అందర్నీ ఆకర్షిస్తోంది.అసలు ఆ దేశం ఉందా అన్నది ఈ సాకర్ ప్రపంచకప్‌తోనే పరిచయమైంది. అందరి అంచనాలకు భిన్నంగా ఈ ఫుట్‌బాల్ కూన... ఆడుతున్న తొలి సాకర్ ప్రపంచకప్‌లోనే సంచలనాల మోత మోగిస్తోంది. స్పెయిన్, ఉరుగ్వేలతో డ్రా చేసి అజేయంగా నిలిచింది. నాకౌట్ రేసులో దూసుకుపోతోంది. సౌదీ అరేబియాతో చివరి లీగ్ మ్యాచ్‌లో గెలుపొందితే నాకౌట్ బెర్త్ పక్కా.

ఆఫ్రికా ఖండానికి పశ్చిమాన అట్లాంటిక్ మహాసముద్రంలో ఉన్న చిన్న ద్వీప దేశం కాబో వెర్డే. ఇది పది అగ్ని పర్వత ద్వీప సమూహం. 9 ద్వీపాలలోనే జానావాసాలు ఉన్నాయి. దేశ జనాభా దాదాపు 5 లక్షల 40వేలు. అధికారిక భాష పోర్చుగీస్. అద్భుతమైన సముద్ర తీరాలు, ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి ఉంది. పర్యాటకానికి ప్రసిద్ధి.

కాబో వెర్డేలో ఫుట్‌బాల్ అంటే చెవికోసుకుంటారు. ప్రపంచ ఫుట్‌బాల్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే దిశగా అడుగులు వేస్తోంది.పరిమిత జనాభా, స్వల్ప వనరులు ఉన్నప్పటికీ... కాబో వెర్డే అంతర్జాతీయ సాకర్ వేదికపై క్రమంగా తన ప్రతిభను చాటుకుంటోంది. ఈ దేశ జాతీయ ఫుట్‌బాల్ జట్టు బ్లూ షార్క్స్ పేరుతో ప్రసిద్ధి చెందింది. ఆఫ్రికన్ ఫుట్‌బాల్ సమాఖ్య నిర్వహించే పోటీల్లో ఈ జట్టు పలుమార్లు మెరుగైన ప్రదర్శన కనబరిచి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యంత చిన్న దేశాల్లో ఒకటిగా 2026 ఫిఫా ప్రపంచ కప్‌కు అర్హత సాధించి సంచలనం సృష్టించింది. కామరూన్, ఈస్వాటిని లాంటి జట్లను ఓడించి సాకర్ ప్రపంచకప్‌కు అర్హత సాధించి చరిత్ర సృష్టించింది. అదే సంచలనాలను ఫిఫా ప్రపంచకప్‌లోనూ కొనసాగిసూనత యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్‌తో 0–0తో డ్రా చేసింది. రెండుసార్లు సాకర్ ప్రపంచ ఛాంపియన్ ఉరుగ్వేతో 2–2తో డ్రాగా ముగించింది. గత దశాబ్ద కాలంగా కాబో వెర్డే జట్టు ప్రదర్శించిన స్థిరత్వం, ఆ దేశ ఫుట్‌బాల్ అభివృద్ధికి నిదర్శనంగా నిలిచింది. కాబో వెర్డే జట్టులోని పలువురు ఆటగాళ్లు యూరప్‌లోని ప్రముఖ క్లబ్‌లకు ప్రాతినిధ్యం వహించడం ద్వారా జాతీయ జట్టుకు అంతర్జాతీయ అనుభవాన్ని తీసుకొచ్చారు. చిన్న దేశమైనప్పటికీ, పెద్ద కలలతో ముందుకు సాగుతున్న కాబో వెర్డే, ప్రపంచ ఫుట్‌బాల్‌లో తన ముద్ర వేస్తోంది. చిన్న దేశాలకూ అంతర్జాతీయ క్రీడల్లో విజయావకాశాలు ఉన్నాయని కాబో వెర్డె తన ప్రతిభతో మరోసారి నిరూపిస్తోంది.

## ప్రి క్వార్టర్ ఫైనల్లో కిడాంబి శ్రీకాంత్

**కాలిఫోర్నియా:** యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ఏస్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. తొలి రౌండ్‌లో 21-14, 21-12తో భారత్‌కే చెందిన సనీత్ దయానంద్‌పై గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో రౌనక్ చౌహాన్ (భారత్) 23-21, 21-16తో శంకర్ ముత్తుస్వామి (భారత్)పై గెలుపొంది ముందంజ వేశాడు.మహిళల సింగిల్స్‌లో ఐదో సీడ్ తన్వీ శర్మ, ఆరో సీడ్ దేవిక సిహాగ్ కూడా శుభారంభం చేశారు. తన్వీ 23-21, 21-16తో వొన్నె లీ (జర్మనీ)పై... దేవిక 21-14, 21-14తో లూసియా కాస్టిల్లో (పెరు)పై విజయాలు సాధించారు. మరో మ్యాచ్‌లో రక్షిత శ్రీ 21-15, 21-8తో టెరెజా స్వాబికోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచి ముందంజ వేసింది. హైదరాబాద్ అమ్మాయి శ్రియాంశి వలిశెట్టి, అన్‌మోల్, తాన్యా హేమంత్, ఆకర్షి తొలి రౌండ్‌లోనే పరాజయం పాలయ్యారు.

## తుర్కియే గెలుపు బోణీ : అమెరికాకు ఝలక్

**లాస్‌ఏంజెల్స్ :** ఫిఫా ప్రపంచకప్2026లో తుర్కియే అనూహ్య రీతిలో పటిష్ట అమెరికాపై విజయం సాధించింది. గ్రూప్-డిలో భాగంగా జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్టును 3-2తో చిత్తు చేసి తొలి విజయం నమోదు చేసింది. గ్రూప్-డి నుంచి ఇప్పటికే అమెరికా వరుసగా రెండు విజయాలతో నాకౌట్ దశకు అర్హత సాధించింది. ఈ క్రమంలో తుర్కియే మీదా గెలిచి హ్యాట్రిక్ విజయంతో అజేయంగా నిలవాలని భావించింది. కానీ తుర్కియే అంచనాలన్నీ తలకిందులు చేసింది. మూడో నిమిషంలోనే ఆస్టన్ ట్రస్టీ గోల్ కొట్టి అమెరికాకు శుభారంభం అందించాడు. అయితే, తుర్కియే ఆటగాడు బారిస్ యిల్మాజ్ ఇచ్చిన పాస్ తో ఆర్దా గూలర్ గోల్ కొట్టి 1-1తో స్కోరు సమం చేశాడు. ఇక రెండో అర్ధ భాగంలో ఒర్కూన్ కొకూ గోల్ కొట్టడంతో తుర్కియే 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే, సెబాస్టియన్ బెర్‌హాల్టర్ గోల్ కొట్టడంతో.. అమెరికా 2-2తో స్కోరు సమం చేసింది. అదనపు సమయంలో కాన్ అహ్యాన్ అనూహ్య రీతిలో గోల్ కొట్టి తుర్కియేను విజేతగా నిలిపాడు. అయినా టోర్నీ నుంచి నిష్క్రమించింది.

**ఆసీస్, పరాగ్వే సైతం**

ఇక గ్రూప్‌డి మరో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా పరాగ్వేతో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. దీంతో టేబుల్ టాపర్ అమెరికాతో పాటు.. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన ఆస్ట్రేలియా, పరాగ్వే నాకౌట్‌కు చేరాయి.



## శ్రీలంక-ఏతో ఏకైక టెస్ట్ పట్టుబగించిన భారత్

**గాలే, జూన్26:** నధికారిక టెస్టులో శ్రీలంక-ఏ జట్టుపై భారత్-ఏ ఆధిపత్యం కొనసాగుతోంది. రెండో రోజు ఆట ముగిసేసమయానికి శ్రీలంక 31 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 339 పరుగులు వెనుకబడి ఉంది.క్రీజ్‌లో నువానిదు ఫెర్నాండో(65), ఆష్టేన్ బండారా (18) ఉన్నారు. ఓపెనర్లు వీరసింగే (11), డిక్‌వెల్లా (10) విఫలమయ్యారు. అన్షుల్ కాంబోజ్, యశ్ ఠాకూర్ చెరో వికెట్ తీశారు. అంతకుముందు భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌ను 6 వికెట్లకు 452 స్కోరు వద్ద డిక్లేర్డ్ చేసింది.

**కెప్టెన్ ధ్రువ్ జురెల్ సెంచరీ**

తొలి రోజే సాయి సుదర్శన్ (132) సెంచరీ సాధించగా.. రెండో రోజు ఆ పనిని కెప్టెన్ ధృవ్ జురెల్ చేపట్టాడు. ఓవర్ నైట్ స్కోరు 333/4తో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్-ఏ కాసేపటికే షేక్ రషీద్ (63) రూపంలో వికెట్ కోల్పోయింది. అయితే, కెప్టెన్ ధ్రువ్ జురెల్ (215 బంతుల్లో 141 రన్స్;13 ఫోర్లు, ఓ సిక్స్) అద్భుత సెంచరీతో జట్టు స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతడికి హర్ష్ దూబే (51 బంతుల్లో 30) తోడ్పాటు అందించాడు. భారత్ స్కోరును 450 మార్కు దాటించారు. ఈ దశలో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేస్తూ ధ్రువ్ నిర్ణయం తీసుకున్నాడు.

శ్రీలంక బౌలర్లలో చమిక గుణశేఖర 3, దిలుమ్ సుదీరా 2, రవిందు ఫెర్నాండో ఒక వికెట్ పడగొట్టారు.





అభిషేక్ ధనాధన్

## తొలి టి20లో టీమిండియాకు ఐర్లాండ్ షాక్

**బెల్‌ఫాస్ట్, జూన్ 26:** టీ20 ప్రపంచ ఛాంపియన్ టీమిండియాకు ఐర్లాండ్ షాకిచ్చింది. తొలి టీ20 మ్యాచ్ లో 34 పరుగులతో గెలుపొందింది. రెండు టీ20ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం చాటింది. మొదట ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 182 పరుగులు చేసింది. లక్ష్యచేధనలో తడబడ్డ మెన్ ఇన్ బ్లూ 18.5 ఓవర్లలో 148 పరుగుల స్వల్ప స్కోరుకే ఆలౌటైంది. మాథ్యూ హంప్‌రేస్, మాట్‌హోలార్డ్ చెరో మూడు వికెట్లు పడగొట్టి టీమిండియా బ్యాటింగ్‌ను కుప్పకూల్చారు.

183 పరుగుల లక్ష్య చేధనలో భారత్ ఇన్నింగ్స్‌ను అభిషేక్ శర్మ(20 బంతుల్లో 49; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), సంజూ శాంమ్సన్(5) ప్రారంభించారు. తొలి ఓవర్లోనే 16 పరుగులు రాబట్టారు. అయితే మూంగ్రా వస్తూనే తొలి బంతికి సంజూను క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఒకవైపు అభిషేక్.. ఐర్లాండ్ బౌలర్లపై విరుచుకుపడుతుంటే, మరో ఎండ్‌లో భారత్ టాప్ ఆర్డర్ పెవిలియన్‌కు క్యూ కట్టింది. ఇషాన్ కిషన్(1), కెప్టెన్ శ్రేయాస్(3)ను వరుస ఓవర్లలో హోలార్డ్ అవుట్‌చేశాడు. అభిషేక్ శర్మ బౌండరీలు, సిక్స్‌లతో హాఫ్ సెంచరీకి చేరువయ్యాడు. భారీ షాట్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసే ప్రయత్నంలో మెక్‌కార్తీ బౌలింగ్‌లో అవుటయ్యాడు. వాషింగ్టన్ సుందర్ కూడా 9 పరుగులే చేసి నిరాశపరిచాడు. తిలక్‌వర్మ(19), శివమ్ దూబే(14 బంతుల్లో 25), అక్షర్ పటేల్(15) భారత్‌ను ఆదుకునే ప్రయత్నం చేసినా హంప్‌రేస్, ముంద్రా వెంటవెంటనే వికెట్లు కూల్చారు. చివరి వరుస బ్యాట్స్‌మెన్ కూడా చేతులెత్తేయడంతో భారత్ మరో 7 బంతులుండగానే 148 పరుగులకు ఆలౌటైంది. ఐర్లాండ్ బౌలర్లలో హంప్‌రేస్, హోలార్డ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా.. జై మొంద్రా 2, మెక్‌కర్తీ, గరేత్ ఒక్కో వికెట్ తీశారు.

అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ ఆరంభంలో తడబడింది.యువ బౌలర్ హర్షిత్ రాణా టాప్ ఆర్డర్ పనిపట్టాడు. అతనికి అర్షదీప్‌కూడా తోడవడంతో ఐర్లాండ్ 51 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు టిమ్ టెక్టర్(17), రాస్ అదైర్(12), బెన్ కార్లిట్జ్(15)లను హర్షిత్ రాణా అవుట్ చేయగా, హారీ టెక్టర్‌ను అర్షదీప్ డకౌట్ చేశాడు. ఈ దశలో కెప్టెన్ లొర్కాన్ టక్కర్ (50), డాక్‌రెల్ (49) క్రీజ్‌లో నిలదొక్కుకుని భారత్ బౌలర్ల జోరును అడ్డుకున్నారు. ఐర్లాండ్ స్కోరును 150 మార్కు దాటించారు. వీరి అవుట్ తర్వాత ఐర్లాండ్ వేగంగా వికెట్లు కోల్పోయింది. దీంతో 20 ఓవర్లలో 9 వికెట్లకు 182 రన్స్ చేసింది. భారత బౌలర్లలో హర్షిత్ రాణా 3, అక్షర్ పటేల్ 2, అర్షదీప్ సింగ్ 2, శివమ్ దూబే ఒక వికెట్ తీశారు. ఈ ఓటమితో ఐర్లాండ్ టూర్‌ను టీమిండియా ఓటమితో ప్రారంభించింది. రెండో టీ20 మ్యాచ్ ఆదివారం జరగనుంది.

# భారత్ ఆర్థికవృద్ధి 6.8శాతం!



వాణిజ్యం

## గోల్డ్‌మాన్ శాక్స్ అంచనా

**న్యూఢిల్లీ, జూన్ 26:** అమెరికాఇరాన్ శాంతి ఒప్పందం నేపథ్యంలో భారత్ ఆర్థిక వృద్ధిపై గోల్డ్‌మన్ శాక్స్ సానుకూల అంచనాలతో ఉంది.ముడి చమురు ధరలు తగ్గడం, దేశీయ ఆర్థిక పరిస్థితులు బలోపేతం కావడం వల్ల 2026 క్యాలెండర్ సంవత్సరానికి భారత్ జీడీపీ వృద్ధి అంచనాను 6.8 శాతానికి పెంచింది. ఇదివరకు 6.5 శాతం పరిధిలో అంచనా వేసిన సంస్థ, తాజా పరిణామాల నేపథ్యంలో వృద్ధి అంచనాలను మరింత మెరుగుపరిచింది. ఇండియా: ఇంప్రూవ్డ్ మ్యాక్రో అవుట్‌లుక్ ఆఫ్టర్ ది యూఎస్‌ఇరాన్ డీల్ పేరుతో విడుదల చేసిన నివేదికలో, ముడి చమురు ధరలు తగ్గడంతో ద్రవ్యోల్బణం, కరెంట్ అకౌంట్ లోటు వంటి స్థూల ఆర్థిక ప్రమాదాలు తగ్గాయని పేర్కొంది. ప్రస్తుతం 2026 మూడు, నాలుగో త్రైమాసికాల్లో బ్యారెల్‌కు సగటు చమురు ధర 82 డాలర్లు, 2027లో 75డాలర్లుగా ఉండొచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో 2026 క్యాలెండర్ సంవత్సరానికి భారత్ వాస్తవ జీడీపీ వృద్ధి అంచనాను 0.3 శాతం పెంచి 6.8 శాతానికి చేర్చినట్లు గోల్డ్‌మన్ శాక్స్ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గతంలో 6.1 శాతం వృద్ధిని అంచనా వేసిన సంస్థ, ఇప్పుడు ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయని పేర్కొంది.తొలి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి నమోదు చేయడం కూడా ఈ సవరణకు ప్రధాన కారణమని వెల్లడించింది.

పెట్టుబడుల పెరుగుదలతో పాటు సేవల రంగం బలంగా విస్తరించడం వృద్ధికి ఊతమిచ్చిందని తెలిపింది. 2027 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాను 5.1శాతం నుంచి 4.9శాతానికి తగ్గించింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశాలు తగ్గడంతో పాటు పెట్రోకెమికల్ ఉత్పత్తుల తయారీ వ్యయాలు కూడా తగ్గనున్నాయని పేర్కొంది.ప్రపంచ మార్కెట్లో యూరియా, ముడిచమురు ధరలు తగ్గడం వల్ల ఎరువుల సబ్సిడీ భారం తగ్గి ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులకు కూడా ఊరట లభిస్తుందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. 2026 సంవత్సరానికి కరెంట్ అకౌంట్ లోటు జీడీపీలో 1.1 శాతానికి పరిమితం అవుతుందని, బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ మిగులు 0.7 శాతానికి చేరవచ్చని నివేదికలో పేర్కొంది.

## లక్షకుపైగా ఉద్యోగాలకు వోక్స్ వ్యాగన్ కోత



**బెర్లిన్, జూన్ 26:** జర్మనీకి చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ వోక్స్ వ్యాగన్ గ్రూప్ చేపట్టిన పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా లక్ష మంది వరకు ఉద్యోగులను తొలగించడం, జర్మనీలోని నాలుగు తయారీ ప్లాంట్లను మూసివేయడం, రాబోయే ఐదేళ్ల పెట్టుబడులను గణనీయంగా తగ్గించడం వంటి చర్యలను కంపెనీ యాజమాన్యం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

కంపెనీ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి (సీఈఓ) ఒలివర్ బ్లూమ్ ప్రతిపాదించిన ఈ ప్రణాళికకు ఇంకా బోర్డు ఆమోదం లభించాల్సి ఉంది. ఈ ప్రణాళిక ప్రకారం పెట్టుబడులను సుమారు 15 శాతం తగ్గించి, వచ్చే ఐదేళ్లలో మూలధన వ్యయాన్ని 130 బిలియన్ యూరోల కంటే కొద్దిగా ఎక్కువ స్థాయికి పరిమితం చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. పునర్వ్యవస్థీకరణలో భాగంగా వోక్స్‌వ్యాగన్ తన ప్రధాన ప్రయాణికుల కార్ల విభాగం, విడిభాగాల వ్యాపారాలను ప్రత్యేక సంస్థలుగా విభజించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది. కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడం,లాభదాయకతను పెంచడం ఈ చర్యల ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొంటున్నారు.అమెరికా విధించిన దిగుమతి సుంకాలు,చైనా ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థల నుంచి పెరుగుతున్న పోటీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు మార్పుతో పెరుగుతున్న వ్యయాలు వోక్స్‌వ్యాగన్‌పై తీవ్ర ఒత్తిడిని తీసుకొచ్చాయి.

ఈ నేపథ్యంలో కంపెనీ తన ప్రధాన ఆటోమొబైల్ వ్యాపారంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సీఈఓ ఒలివర్ బ్లూమ్ పలుమార్లు పేర్కొన్నారు. ప్రస్తుత వాహన ఉత్పత్తి కార్యక్రమాలు ముగిసిన తర్వాత హానోవర్, జ్వికౌ, ఎమ్డెన్ ప్లాంట్లతో పాటు ఆడీకి చెందిన నెకార్సుల్మ్ తయారీ కేంద్రంలో ఉత్పత్తిని నిలిపివేసే అవకాశమున్నట్లు నివేదికలు వెల్లడించాయి. ప్రస్తుతం అమలులోఉన్న 50 వేల ఉద్యోగాల కోత ప్రణాళికకు మించి ఈ కొత్త చర్యలు ఉండనున్నాయి. ఇవి అమలైతే వోక్స్‌వ్యాగన్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 15 శాతం మందిపై ప్రభావం చూపే అవకాశం ఉంది.అయితే ఈ అంతర్గత ప్రణాళికలపై వోక్స్‌వ్యాగన్ అధికారికంగా స్పందించలేదు. అయితే సంస్థలో "విస్తృత స్థాయి మార్పులు తప్పనిసరి" అని మాత్రమే పేర్కొంది.

## ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ చేసుకోవాలి

### ఎన్ఎస్ఈ సీఈఓ అశిష్ చౌహాన్



**ముంబయి, జూన్ 26:** స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్‌ను అవకాశంగా వినియోగించుకోవాలని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అశిష్ చౌహాన్ సూచించారు. వ్యవస్థాపకులు రోజువారీ షేర్ ధరల మార్పులపై కాకుండా లాభదాయకమైన, దీర్ఘకాలికంగా నిలబడే సంస్థల నిర్మాణంపై దృష్టి పెట్టాలని అన్నారు.పబ్లిక్ లిస్టింగ్ ద్వారా కంపెనీలకు వృద్ధి కోసం అవసరమైన మూలధనం లభిస్తుందని, కార్పొరేట్ గవర్నెన్స్ మెరుగుపడుతుందని, మార్కెట్లో విశ్వసనీయత పెరుగుతుందని, నైపుణ్యం కలిగిన ఉద్యోగులను ఆకర్షించడం సులభమవుతుందని తెలిపారు. కంపెనీపై ప్రమోటర్ల నియంత్రణ కూడా కొనసాగుతుందని స్పష్టంచేశారు. ప్రారంభంలో కంపెనీ ఈక్విటీలో కేవలం 25శాతం వాటాను మాత్రమే మార్కెట్లోకి విడుదల చేసి, మిగిలిన 75 శాతం వాటాను ప్రమోటర్లు తమ వద్దే ఉంచుకోవచ్చని అశిష్ చౌహాన్ వివరించారు.వ్యాపార అవసరాలను బట్టి భవిష్యత్తులో మాత్రమే మరింత వాటాను విక్రయించే అవకాశంఉంటుందని చెప్పారు.ఏడాదికి 2 కోట్ల లాభం ఆర్జించే సంస్థ కూడా స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ అనంతరం 40 నుంచి 50 కోట్ల వరకు మార్కెట్ విలువను పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీంతో కంపెనీలు సులభంగా నిధులు సమీకరించి, కొత్త ఇన్వెస్టర్లను తీసుకురాగలిగి వ్యాపార విస్తరణ చేపట్టవచ్చని తెలిపారు.లిస్టెడ్ కంపెనీలకు షేర్ల రూపంలో సొంత కరెన్సీ లభించినట్లేనని, వాటిని ఇతర కంపెనీల కొనుగోళ్లకు, ఉద్యోగులకు స్టాక్ ఆప్షన్లు ఇవ్వడానికి ఉపయోగించుకోవచ్చని చెప్పారు. ఇన్ఫోసిస్ ప్రారంభ దశలో ఉద్యోగులను ఆకర్షించేందుకు స్టాక్ ఆప్షన్లను సమర్థంగా వినియోగించిన విషయాన్ని ఆయన ఉదాహరణగా ప్రస్తావించారు.లిస్టింగ్ వల్ల కంపెనీలకు విశ్లేషకుల కవరేజ్ లభించడంతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు సులభమవుతుందని, వారసత్వ నిర్వహణ కూడా సక్రమంగా జరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

## భారత్‌కు మేలుచేస్తేనే యుఎస్ ఎఫ్టీయేపై సంతకం: గోయల్

**లండన్, జూన్ 26:** భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుందని భారత ఎగుమతులకు ఇతర దేశాల కంటే ఎక్కువ మేలు చేకూరితేనే ఈ ఒప్పందంపై సంతకం చేస్తామని కేంద్రమంత్రి పియూష్‌గోయల్ స్పష్టం చేశారు. లండన్‌లో మీడియాతో మాట్లాడిన గోయల్ ఫిబ్రవరి 6నుంచే ఒప్పందంలోని ప్రధాన అంశాలపై ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయని, ప్రస్తుతం తుది నిబంధనలు, సుంకాల అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.భారత్‌కు అమెరికా మార్కెట్లో ప్రత్యర్థి దేశాల కంటే మెరుగైన టారిఫ్ రాయితీలు లభించేలా చట్టపరమైన వ్యవస్థను రూపొందించాలన్నదే ప్రస్తుతం ప్రధాన చర్చాంశమని గోయల్ పేర్కొన్నారు.



అలాంటి ప్రయోజనం తర్వాతే ఒప్పందం అమల్లోకి వస్తుందని చెప్పారు. గతంలో 18 శాతం టారిఫ్ రేటుకు భారత్ అంగీకరించినప్పటికీ అది కూడా ఇతర దేశాల కంటే భారత్‌కు ప్రత్యేక ప్రయోజనం ఉంటుందనే షరతుపైనే నని మంత్రి స్పష్టం చేశారు. భారత టెక్స్‌టైల్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఔషధాలకు అమెరికాలో వియత్నాం, బంగ్లాదేశ్ వంటి దేశాల ఉత్పత్తుల కంటే తక్కువ దిగుమతి సుంకం ఉంటే భారత ఎగుమతిదారులకు భారీ ప్రయోజనం లభిస్తుంది. దీంతో ఎగుమతులు పెరగడంతో పాటు మార్కెట్ వాటా, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడే అవకాశం ఉంటుంది. ప్రతిపాదిత భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంలో టారిఫ్‌లు, రూల్స్ ఆఫ్ ఒరిజిన్, పెట్టుబడులు, పలు రంగాల్లో పరస్పర సహకారం వంటి అంశాలు చోటు చేసుకోనున్నాయి. ఈ ఒప్పందం ప్రపంచంలోని అతిపెద్ద, ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు భారత వ్యాపారాలకు కొత్త అవకాశాలు కల్పిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## భారత్ ఫారెక్స్ ఖజానా కళకళ



**ముంబయి, జూన్26:** భారత్ విదేశీ మారక నిల్వలు మరోసారి పెరిగాయి. ఈనెల 19తో ముగిసిన వారానికి భారత విదేశీ మారక నిల్వలు 963 మిలియన్ డాలర్లు పెరిగి 672.587 బిలియన్ డాలర్లకు చేరినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. అంతకుముందు వారంలో విదేశీ మారక నిల్వలు 9.985 బిలియన్ డాలర్లు తగ్గి 671.625 బిలియన్ డాలర్ల వద్ద నమోదయ్యాయి.ఈసారి విదేశీ కరెన్సీ ఆస్తులు 3.072 బిలియన్ డాలర్లు తగ్గి 541.217 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలర్‌తో పోలిస్తే యూరో, పౌండ్, యెన్ వంటి కరెన్సీల విలువల్లో వచ్చిన మార్పులు కూడా విదేశీ కరెన్సీ ఆస్తులపై ప్రభావం చూపినట్లు ఆర్‌బీఐ తెలిపింది.

మరోవైపు, బంగారం నిల్వల విలువ గణనీయంగా పెరిగింది. బంగారం నిల్వలు 4.110 బిలియన్ డాలర్లు పెరిగి 107.930 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.అలాగే, స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్‌లు) 52 మిలియన్ డాలర్లు తగ్గి 18.647 బిలియన్ డాలర్లకు చేరగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత రిజర్వ్ స్థాయి 22 మిలియన్ డాలర్లు తగ్గి 4.793 బిలియన్ డాలర్లుగా నమోదైంది. దీంతో ఖజానా కళకళ లాడుతోంది.



## డాక్టర్ రెడ్డీస్‌లో ఎఫ్‌డిఎ తనిఖీలు

**న్యూఢిల్లీ, జూన్ 26:** ప్రముఖ ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ బాచుపల్లిలోని బయోలాజిక్స్ తయారీ కేంద్రంపై నిర్వహించిన తనిఖీల అనంతరం అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఏడు పరిశీలనాత్మక అభ్యంతరాలు జారీ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఇచ్చిన సమాచారం ప్రకారం, ఈనెల 16 నుంచి 25, వరకు బాచుపల్లి బయోలాజిక్స్ తయారీ కేంద్రంలో ఎఫ్‌డిఎ ప్రీలైసెన్స్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించింది. తనిఖీలు పూర్తైన అనంతరం ఫామ్483 కింద ఏడు పరిశీలనలు జారీ చేసినట్లు తెలిపింది. వాటికి నిర్దేశిత గడువులోగా సమాధానాలు ఇచ్చి, అవసరమైన సవరణ చర్యలు చేపడతామని కంపెనీ పేర్కొంది. గతంలోకూడా 2025 సెప్టెంబర్ 4 నుంచి 12 వరకు ఇదే ప్లాంట్‌లో నిర్వహించిన ప్రీఅప్రూవల్ ఇన్‌స్పెక్షన్ అనంతరం ఎఫ్‌డిఎ ఐదు అభ్యంతరాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో డాక్టర్ రెడ్డీస్ పనితీరు గణనీయంగా బలహీనపడింది.కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 86 శాతం తగ్గి రూ.1,593 కోట్ల నుంచి రూ.221 కోట్లకు పడిపోయింది. లెనాలిడొమైడ్ ఔషధానికి సంబంధించిన షెల్ఫ్ స్టాక్ అడ్జస్ట్‌మెంట్ కారణంగా కంపెనీకి రూ.4,530 కోట్ల ప్రభావం పడింది. అలాగే కార్-టి ఆస్తులు, ఎప్టిలాగిమోడ్ ఆల్ఫాకు సంబంధించిన రూ.27 కోట్ల ఇంపెయిర్‌మెంట్, వ్యాట్ బకాయిలకు సంబంధించిన రూ.14 కోట్ల ప్రొవిజన్లు కూడా ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపాయి.

కంపెనీ ఆదాయం కూడా 12 శాతం తగ్గి రూ.8,528 కోట్ల నుంచి రూ.7,546 కోట్లకు చేరింది. ఇక ఎబిట్డా వార్షిక ప్రాతిపదికన 60 శాతం క్షీణించి రూ.2,475 కోట్ల నుంచి రూ.981 కోట్లకు పడిపోయింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం శనివారం 27 జూన్ 2026 I



# లంక నర్సరీల్లో 'లైట్ పురుగు' కలకలం

## మంటలు.. దద్దుర్లు.. కూలీలకు నరకయాతన



**కడియం జూన్ 26 ( ప్రభాతవార్త)** కడియం మండలం,కడియపులంక గ్రామంలో గల లంక ప్రాంతంలోని నర్సరీల్లో విస్తరిస్తున్న "లైట్ పురుగు" రైతులు, వ్యవసాయ కూలీలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. గత రెండు సంవత్సరాలుగా ఈ పురుగు కనిపిస్తున్నప్పటికీ, రెండు నెలలుగా దీని ప్రభావం ఒక్కసారిగా పెరగడంతో నర్సరీల్లో పనిచేసే వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రైతుల కథనం ప్రకారం, నర్సరీ మొక్కలకు నీరు పెడుతున్న సమయంలో ఈ పురుగు శరీరంపై పాకి ఒక రకమైన ద్రావణాన్ని విడుదల చేస్తోంది. దీంతో కొద్ది గంటల్లోనే ఒళ్లు కాలిపోయినట్లుగా మంటలు, దురద, నీటి బొబ్బలు ఏర్పడుతున్నాయి. ఈ బాధ ఒకటి రెండు రోజులు కాదు, దాదాపు వారం రోజుల పాటు కొనసాగుతుండటంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో నర్సరీల్లో పనులకు వెళ్లేందుకు కూలీలు భయపడుతున్నారు. రోజువారీ పనులు దెబ్బతింటుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే నర్సరీల నిర్వహణతో పాటు వేలాది కుటుంబాల జీవనోపాధిపై ప్రభావం పడే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. ఈ సమస్యను ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అత్యవసరంగా పరిశీలించాలని రైతులు కోరుతున్నారు. సంబంధిత శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు లంక ప్రాంతాన్ని సందర్శించి ఈ పురుగు ఏ జాతికి చెందినదో గుర్తించి, దాని నివారణకు అవసరమైన క్రిమిసంహారక మందులను సూచించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే బాధితులకు ఉచితంగా ఆయింట్‌మెంట్లు, మందులు అందించి వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరుతున్నారు. అంతేకాకుండా ఈ పురుగు ప్రభావం నర్సరీలకే పరిమితం కాకుండా పరిసర గ్రామాల ప్రజలపై కూడా పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు, కూలీలు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు."నర్సరీలకు వెన్నెముకైన రైతులు, కూలీల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత. అధికారులు ఇకనైనా స్పందించి ఈ 'లైట్ పురుగు' సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు."

## ప్రతిబిఎల్ఓ రోజుకు 100 ఓటర్ల వివరాలు డిజిటలైజ్ చేయాలి

### మండలాల వారీగా ప్రత్యేక అధికారులు : జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 26( ప్రభాతవార్త)** ప్రతిబిఎల్ఓ రోజుకు 100 ఓటర్ల వివరాలు డిజిటలైజ్ చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ప్రత్యేక ఇంటెన్సీ రివిజన్ 2026 ప్రక్రియను మరింత సమర్థవంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. జూన్ 15 నుంచి ప్రారంభమైన సర్ కార్యక్రమం సెప్టెంబర్ 22 వరకు కొనసాగుతున్న నేపథ్యంలో పారాల పంపిణీ డిజిటలైజేషన్ ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రతి మండలానికి సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. బి ఎల్ ఓ లు పూర్తిస్థాయిలో ఎస్ ఐ ఆర్ విధుల్లో నిబగ్నమయ్యేలా అన్ని శాఖల అధికారులు సహకరించాలని ఆదేశించారు. మండలాల వారిగా ప్రత్యేక అధికారులు: మండలాల వారీగా ప్రత్యేక అధికారులు వివరాలు కడియం మండలానికి ఎన్ మల్లికార్జునరావు, రాజానగరం డాక్టర్ ఎం వెంకటేశ్వర్లు, సీతానగరం బి రాంప్రసాద్, కోరుకొండ డి శ్రీనివాసరావు, పెదపూడి బిక్కవోలు టి శ్రీదేవి, రంగంపేట బి గణేష్, రాయవరం బి శశాంక, మండపేట డి.వి కృష్ణారావు ,కపిలేశ్వరపురం ఎం రంగ ప్రసాద్, కొవ్వూరు ఎస్ సుభాషిని, తాళ్లపూడి ఆర్ విజయ రాజు ,చాగల్లు సిహెచ్ శ్రీనివాస్, నిడదవోలు ఏ దుర్గేష్, పెరవలి ఎం సునీల్ వినయ్, గోపాలపురం ద్వారకాతిరుమల డాక్టర్ టి శ్రీనివాసరావు, దేవరపల్లి ఇవి సుబ్బారావు, నల్లజర్ల ఎన్ నిర్మల కుమారి. ఓటర్లు ఇంటి వద్ద నుంచే తమ అన్యుమరేషన్ పారాలను ఈసీఐ పోర్టల్ ద్వారా ఆన్లైన్లో సమర్పించవచ్చిన అని అన్నారు. ఓటర్ల ఐడి లో ఉన్న పేరు ఆధార్ కార్డులో ఉన్న పేరు ఒకే విధంగా ఉండాలి. పేరు భిన్నంగా ఉంటే ఆన్లైన్లో సమర్పణ లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్స్ లేదా సమీప హెల్త్ డెస్క్ ను సంప్రదించవచ్చు అన్నారు.

## పి యం జె జె వై పథకాన్ని రిటైలర్స్ సద్వినియోగం చేసుకోవాలి




**కాకినాడ రూరల్ , జూన్ 26 (ప్రభాతవార్త):** ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవనజ్యోతి యువజన పథకం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ పట్టణ పాన్ షాప్ యజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాధవరపు శ్రీనివాసరావు కోరారు. ఫెడరేషన్ ఆఫ్ రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు శుక్రవారం ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన పథకం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఐసిఐసి బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ మాట్లాడుతూ యూనియన్ లో ప్రతి ఒక్క పాన్ షాప్ యజమానులు ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన ద్వారా రెండు లక్షల రూపాయలు స్వల్పకాలిక వడ్డీతో రుణం పొందవచ్చునని, అదేవిధంగా ప్రమాద భీమా, షాపు యొక్క సరుకు బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ పథకాన్ని ప్రతి బ్యాంకులో కూడా అమలయ్యే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ ఆఫ్ రిటైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్ర చాప్టర్ ఇంచార్జ్ మాధవరపు శ్రీనివాసరావు, రాష్ట్ర పాన్ షాప్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు అరిగెల కృష్ణారావు, పాన్ షాప్ సంఘ సభ్యులు పరిమి వీరభద్రరావు, ఆకేటీ వెంకటేశ్వరరావు, ఇంధన సత్తిబాబు, చీకట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యంగా చర్యలు

- బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు నాగ మానస



**అమలాపురం కలెక్టరేట్, జూన్ 26 ప్రభాత వార్త** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో మాదక ద్రవ్యాల (డ్రగ్స్) నిర్మూలనకు చర్యలు చేపట్టి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ పనిచేస్తోందని, ఇదే లక్ష్యంతో సంబంధిత ప్రభుత్వ శాఖలు సమన్వయంతో బాధ్యతాయుతంగా ఫీల్డ్ వర్క్ చేయాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు డాక్టర్ కొప్పుల నాగ మానస విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె వివరిస్తూ యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. గంజాయి,ఇతర నిషేధిత మత్తు పదార్థాల రవాణా జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలపై పోలీసు, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు తరచుగా నిర్వహించి నిరోధానికి పక్కాగా చర్యలు చేపట్టాలన్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా యువతకు ఎలాంటి మత్తు కలిగించే మాత్రలు, సిరప్‌లు విక్రయించకుండా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే మెడికల్ షాపుల లైసెన్సులను రద్దు చేయాలన్నారు. కళాశాలలు, పాఠశాలల పరిసరాల్లో ఎలాంటి మత్తు పదార్థాల విక్రయాలు జరగకుండా చూడాలన్నారు. విద్యార్థు లకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు ?కౌన్సిలింగ్, డీ-అడిక్షన్ మత్తు పదార్థాలకు బానిసైన వారిని గుర్తించి, వారికి సరైన కౌన్సిలింగ్ ఇచ్చేందుకు, అవసరమైతే డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు?.

## భర్త ఇంటిముందు బైఠాయించి భార్య ఆందోళన



**యు. కొత్తపల్లి: జూన్ 26 (ప్రభాతవార్త) :** పిల్లలు పుట్టలేదని వదిలేసి భర్త మరో పెళ్ళి చేసుకోవడంతో భర్త ఇంటివద్ద బైఠాయించి భార్య శుక్రవారం ఆందోళనకు దిగింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నాగులాపల్లి గ్రామానికి చెందిన చింతపల్లి మురళీరెడ్డికి రమణక్కపేటకు చెందిన చింతపల్లి రామశంకరికీ 2012 ఏప్రిల్ 6తేదీన వివాహమైంది. గత కొంతకాలంగా కాకినాడలో కాపురం ఉంటున్నామని నాకు పిల్లలు పుట్టడంలేదనే కారణంతో గత సంవత్సరం నవంబరు నెలలో మరో మహిళను వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి కాకినాడ రావడం మానేశాడు. ఎందుకు రావడంలేదని అడగ్గా మరో మహిళను వివాహం చేసుకున్నానని నీతో కాపురం చేయనవసరంలేదని సమాధానం చెబుతున్నాడు. గత 8నెలలుగా వివాదం జరుగుతూనే ఉంది. మా తల్లిదండ్రులతో కలిసి భర్త ఇంటికి శుక్రవారం రావడం జరిగిందని, మమ్మల్ని బయటకు గెంటివేసి గేటుకు తాళం వేసి బయటకు వెళ్ళిపోయాడు. వివాహ సమయంలో మా తల్లిదండ్రులు 2ఎకరాల భూమి, రూ. 2లక్షల నగదు. 40 కాసుల బంగారాన్ని కట్నంగా ఇవ్వడం జరిగింది. ఇప్పుడు పిల్లలు పుట్టడంలేదని, నాతో కాపురం చేయకుండా మరో పెళ్ళి చేసుకుని తీవ్ర అన్యాయం చేసాడు. నాకు న్యాయం జరిగే వరకూ ఆందోళన చేస్తాను. కొత్తపల్లి పోలీసులకు పిర్యాదు చేయడం జరిగిందంటూ ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై పోలీసులను వివరణ కోరగా పిర్యాదు చేయడం వాస్తవమేనన తెలిపారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

## జనసేన నిర్మాణ సారధుల కమిటీ సభ్యునిగా డాక్టర్ ప్రసాద్...



**తాళ్లరేవు, జూన్ 26( ప్రభాతవార్త):** ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్ళరేవు మండలం పి మల్లవరం కి చెందిన జనసేన సీనియర్ నాయకులు, లయన్స్ క్లబ్ ప్రతినిధి వి ఆర్ ఎన్ బి ప్రసాద్ కు ఆ పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. ఇటీవల జనసేన అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ ఏర్పాటుచేసిన అమలాపురం పార్లమెంట్ జనసేన నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ లో ముమ్మిడివరం నియోజకవర్గం నుండి నలుగురిని నియమించగా అందులో ప్రసాద్ కు అవకాశం దక్కింది. పార్టీ ప్రారంభం నుండి అప్పగించిన బాధ్యతలను అమలు చేయడం తో పాటు పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కార్యకర్తలను ఐక్యపరచి మనోధైర్యాన్ని కల్పించడంలో ఆయన విశేషంగా కృషి చేశారు. పార్టీ చేపట్టిన సభ్యత్వం కార్యక్రమంలో 600 పైబడి క్రియాశీలక సభ్యులను చేర్చటంతో ఆ పార్టీ ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఆయా నియోజకవర్గాలలో పార్టీకి రథసారధులను గుర్తించి అధినేతకు నేరుగా తెలియజేసే బాధ్యత ఈ కమిటీకి ఉంటుంది. పార్టీ నిర్మాణం లో కీలకంగా వ్యవహరించే కమిటీలో తనకు స్థానం కల్పించడం పట్ల ప్రసాద్ తమ అధినేత పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ సభ్యులుగా చేరిన అందరికీ ఆయన అభినందనలు తెలిపారు. పార్టీ ఇచ్చిన ఈ బాధ్యతలను త్రికరణ శుద్ధిగా నిర్వర్తిస్తానని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా జనసేన జెండా నీడలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రసాద్ శుక్రవారం విలేఖర్లకు తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

### కృతజ్ఞతలు తెలియజేసిన కీర్తి వెంకట సుభాష్



**శంఖవరం, జూన్ 26 ప్రభాతవార్త** ప్రత్తిపాడు నియోజకవర్గం,శంఖవరం మండలం వజ్రకూటం గ్రామానికి చెందిన పోలిశెట్టి సీతారత్నం పేరుపై ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.63,000/- చెక్కు మంజూరైంది.ఈ చెక్కును ప్రత్తిపాడు మండలం పెద శంకర్లపూడి టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు,గ్రామ మాజీ సర్పంచ్ కీర్తి వెంకట సుభాష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్యప్రభ లబ్ధిదారి కుటుంబ సభ్యుడు కీర్తి నందిబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభకు, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్‌కు లబ్ధిదారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూపేద ప్రజలు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న ఈ ఆర్థిక సహాయం వారికి ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందని అన్నారు. ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని పనిచేస్తోందని, ఎవరికీ వైద్య చికిత్సలు అందకుండా ఉండకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్,నియోజకవర్గ సీబీఎన్ ఆర్మీ కో ఆర్డినేటర్ యాళ్ల జగదీష్, బద్ది రామారావు కూటమి నాయకులు గాబు కృష్ణమూర్తి,సాదనాల లక్ష్మిబాబు, కంచిబోయిన శ్రీను, కేళంగి జనార్ధన్ కొయ్యా రమణ,కూటమి కార్యకర్తలు,గ్రామస్థులు పాల్గొన్నారు.

## శ్యామ్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులచే మత్తుపదార్థాలపై అవగాహన ర్యాలీ




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 26 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నషా ముక్తభారత్ అభియాన్ లో భాగంగా శుక్రవారం కాకినాడలో శ్యామ్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులతో మత్తుపదార్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు విభిన్న , వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ ఏవై శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు సేవిచడం విద్యార్థుల యొక్క భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. మత్తు పదార్థాలకు బానిసలై బంగారం లాంటి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఆయన తెలిపారు. అలాగే ఈగల్ టీం వారు మత్తు పదార్థాలు అమ్మడం లేదా కొనుగోలు చేయడం సరఫరాకు సంబంధించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం శ్యామ్ ఇని?స్టిట్యూట్ చైర్మన్ జి. శ్యామ్ మాట్లాడుతూతమ ఇన్స్టిట్యూట్లో ఎవరైనా విభిన్న ప్రభావంతులు వివిధ రకాల ట్రైనింగ్ తీసుకునేందుకు తమను సంప్రదించిన ఎడల వారికి 50 శాతం రాయితీపై ట్రైనింగ్, ఆన్లైన్ ఆఫ్లైన్ ద్వారా వారికి 50 శాతం రాయితీపై ఉచిత గా ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఈగల్ టీం సీఐ, వెంకటేశ్వరరావు, సీఈఓ శ్రీనివాస్ కోచ్ కాంతారావు, పుష్కర మాత కాన్వెంట్ కమిటీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి క్షేత్రం....

### స్వామివారి నిత్య కళ్యాణం,అష్టోత్తర పూజలలో పాల్గొన్న భక్తులు

### భక్తుల మెరుగైన సౌకర్యాలకు డిప్యూటీ కమిషనర్ నల్లం ప్రత్యేక చర్యలు.







**ఆత్రేయపురం, జూన్,26,(ప్రభాత వార్త)** ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి శుక్రవారం వేలాది మంది భక్తుల రాకతో ఆలయ పరిసరాలన్నీ గోవిందనామ స్మరణతో మార్మోగాయి.. శ్రీ స్వామివారి ఏడు వారాల నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజ, పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆలయంలో క్యూలైన్లు, కూలర్స్, ఫ్యాన్లు, మజ్జిగ, మంచినీరు, చలివేంద్రాలు భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఇబ్బందికి సూచించారు. అలాగే శనివారం వచ్చిన భక్తులకు స్వామివారి దర్శనం సులభంగా చేసుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు.

## ద్రాక్షారామం మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

- అర్ధరాత్రి వేళ ఒక్కసారిగా ఎగసిపడిన అగ్నికీలలు
- బూడిదైన 48 దుకాణాలు..నిలువునా మునిగిన వ్యాపారులు
- రూ.3 కోట్ల వరకు ఆస్తి నష్టం.. విలపిస్తున్న బాధితులు
- గంటలోనే రూ.60 లక్షల తక్షణ ఆర్థిక సాయం ప్రకటన



**రామచంద్రపురం జూన్ 26 (ప్రభాతవార్త)** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామంలో గురువారం అర్ధరాత్రి ఘోర విపత్తు సంభవించింది.స్థానిక మార్కెట్ సముదాయంలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదం వ్యాపారుల జీవితాల్లో చీకట్లు నింపింది.క్షణాల వ్యవధిలోనే అగ్నికీలలు ఊహించని రీతిలో వ్యాపించి,మార్కెట్ ఆవరణలోని సుమారు 48కి పైగా దుకాణాలను నిలువునా బూడిద చేశాయి.నిన్నటివరకు క్రయవిక్రయాలతో కళకళలాడిన మార్కెట్.తెల్లవారేసరికి శ్మశానాన్ని తలపిస్తూ కుప్పలుగా మారిన బూడిదతో దర్శనమిచ్చింది.ప్రాథమిక అంచనాల ప్రకారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

### సర్వం కోల్పోయిన వ్యాపారులు

గురువారం రాత్రి 11 గంటల సమయంలో మార్కెట్ సముదాయంలోని ఒక మూల ప్రారంభమైన మంటలు,గాలి తీవ్రతకు క్షణాల్లో మార్కెట్ అంతటా విస్తరించాయి.కాలిపోయిన వాటిలో 10 పెద్ద కిరాణా దుకాణాలు ఉండగా,మిగిలినవి కూరగాయలు,మాంసం దుకాణాలు ఉన్నాయి.రానున్న వ్యాపార సీజన్ కోసం ఒక్కో కిరాణా షాపులో రూ.10 లక్షల పైచిలుకు విలువైన సరుకులు నిల్వ ఉంచినట్లు బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.మంటలు అంతకంతకూ ఎగసిపడటంతో లోపల ఉన్న నయాపైసా సరుకును కూడా బయటకు తీసేందుకు వీల్లేకుండా పోయింది.ఈ ప్రమాదంలో సుమారు రూ.3 కోట్ల వరకు ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

-?సకాలంలో స్పందించిన అగ్నిమాపక సిబ్బంది

?మార్కెట్‌లో మంటలు చెలరేగిన విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.రామచంద్రపురం,మండపేట ప్రాంతాల నుంచి ఫైర్ ఇంజన్లు వేగంగా ఘటనా స్థలానికి చేరుకున్నాయి.సిబ్బంది ప్రాణాలకు తెగించి గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అడ్డుకోకపోతే,పక్కనే ఉన్న వందలాది నివాస గృహాలకు,చుట్టుపక్కల దుకాణాలకు భారీ ప్రమాదం వాటిల్లేదని స్థానికులు తెలిపారు.

### కదిలొచ్చిన అధికార యంత్రాంగం.. నేతల పరామర్శ

అగ్నిప్రమాద సమాచారం అందుకున్న వెంటనే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్,జాయింట్ కలెక్టర్ వై ఖోం నైదియా దేవి,జిల్లా ఎస్పీ రాహుల్ మీనా,ఆర్డీవో సరళావతి ఘటనా స్థలానికి చేరుకున్నారు.ప్రమాద తీవ్రతను పరిశీలించి,నష్టపోయిన వ్యాపారులను పరామర్శించారు.వీరితో పాటు రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు,జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్,వైకాపా ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్ తదితరులు మార్కెట్‌ను సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పారు.

### కష్టంలో ఉన్న కుటుంబాలను ఒంటరిగా వదిలిపెట్టం: మంత్రి సుభాష్

బాధితులెవరూ అధైర్యపడొద్దని,ప్రభుత్వం తరపున అందరికీ పూర్తి న్యాయం చేస్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు.నష్ట తీవ్రతను అంచనా వేసేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, బాధితుల పూర్తి వివరాలను సేకరించాలని మార్కెట్ కమిటీ అధికారులను ఆదేశించారు.బాధితుల కన్నీళ్లు తుడవడం ప్రభుత్వం బాధ్యతని మంత్రి భరోసా ఇచ్చారు.మానవత్వం చాటుకున్న ప్రముఖులు.కొండంత అండ ?సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ వ్యాపార కుటుంబాలను ఆదుకోవడానికి దాతలు మానవత్వంతో ముందుకొచ్చారు.మంత్రి సుభాష్ చొరవతో కేవలం గంటల వ్యవధిలోనే సుమారు రూ.60 లక్షల పైచిలుకు తక్షణ ఆర్థిక సహాయాన్ని ప్రముఖులు ప్రకటించారు.వివరాలు ఇలా ఉన్నాయి మంత్రి వాసంశెట్టి సుభాష్ (సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా):రూ.20లక్షలు, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, రూ.5లక్షలు, టిడిపి నాయకుడు పప్పుల మసేనువెంకన్న (రేవు శ్రీను):రూ.5లక్షలు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్:రూ.5లక్షలు పోలీస్ శాఖ నుండి ఎస్పీ రాహుల్ మీనా ప్రకటన: రూ.50 వేలు ఈ విధంగా ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.డిజాస్టర్ మేనేజ్మెంట్ నిధుల ద్వారా బాధితులు అందరికీ ప్రభుత్వం తరపున త్వరితగతిన సహాయం అందేలా చూస్తామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారు.జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ అగ్ని ప్రమాదం అత్యంత దురదృష్ట కరమన్నారు. ప్రాథమికంగా షార్ట్ సర్క్యూట్ అని భావిస్తున్నప్పటికీ,ప్రమాదం వెనుక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో కూడా పూర్తిస్థాయి విచారణ జరుపుతున్నామని స్పష్టం చేశారు.



-కన్నీటి పర్యంతమైన వ్యాపార సంఘం ?

తమ జీవితాలు ముగిసిపోయాయనుకున్న తరుణంలో కొండంత అండగా నిలిచిన మంత్రి సుభాష్‌కు,వాసంశెట్టి సత్యం ఫౌండేషన్‌కు మరియు ఇతర దాతలందరికీ మార్కెట్ వర్తక సంఘం నాయకులు సుబ్బరాజు ఆధ్వర్యంలో వ్యాపారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఆపద సమయంలో దేవుడిలా స్పందించి ఇంత భారీ ఆర్థిక సహాయం ప్రకటించడం వల్ల తమ కుటుంబాల్లో మళ్లీ బతుకుపై ఆశలు చిగురించాయని వారు కన్నీటి పర్యంతమయ్యారు.

## మిన్నంటిన ఎమ్మెల్యే ఆనందరావు జన్మదిన వేడుకలు

### కోలాహలంగా కూటమి విందు

### జనసంద్రంగా సముద్రతీరం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్26,ప్రభాతవార్త.** ఎక్కడ చూసినా అభిమానుల కోలాహలం.వేలాది మంది తో ఎన్నడూ లేని విధంగా అమలాపురం ఎంఎల్ఏ అయితాబత్తుల ఆనందరావు పుట్టినరోజు వేడుకలలో సముద్రం ఉప్పొంగింది. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జన్మదిన వేడుకలు, కూటమి 2 ఏళ్ల విజయోత్సవ విందుకు పోటెత్తిన జనంతో సంబరాలు మిన్నంటాయి.భారీ సంఖ్యలో తరలివచ్చిన జనసైనికులు, తెలుగు తమ్ముళ్లు, బీజేపీ నాయకులు అభిమానుల కలయిక కి ఎస్ యానం.ఆంధ్రా గోవాగా పిలవబడే 'కోకో బీచ్'వేదిక నిలచింది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భాన్ని, అలాగే అమలాపురం నియోజకవర్గ శాసనసభ్యులు ఆనందరావు గారి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని జిల్లా నలుమూలల నుంచి నేతలు తరలివచ్చారు.ఈ అపూర్వ వేడుకతో సముద్రపు అలల సవ్వడి మధ్య కోకో బీచ్ పరిసర ప్రాంతాలన్నీ పండగ వాతావరణాన్ని తలపించాయి.గత రెండేళ్ల లో చేసిన అభివృద్ధి ని సాధించిన విజయాలు నెమరు వేసుకుంటూ కోలాహలం మధ్య ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జన్మదిన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆయనకు గజమాలలతో, శాలువాలతో ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనల అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న ఈ శుభసమయంలో నా పుట్టినరోజు వేడుకలను ఇంత అద్భుతంగా నిర్వహించిన నా కూటమి కుటుంబ సభ్యులకు, అభిమానులకుహృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు.



## భక్తి శ్రద్ధలతో ఇమామ్ హుస్సేన్ షహదత్




ముమ్మిడివరం: జూన్,26(ప్రభాతవార్త ) మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ కర్బలాలో ప్రస్తుత( ఇరాక్) లో 72 మంది కుటుంబీకులతో ప్రాణాలను బలిదానం చేసి ఇస్లాంను పరిరక్షించారు. మొహరం సంతాప దినాల్లో భాగంగా 10వ రోజు షహదత్ ను ముమ్మిడివరం లోని షియా ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఇమామ్ హుస్సేన్ కుటుంబానికి ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం నుండి మజిలీస్ నిర్వహించి రక్తాలు చిందేలా మాతం చేస్తూ గుండెలు బాదుకుంటూ ఇమామ్ హుస్సేన్ కుటుంబీకులకు అశ్రునయనాలతో శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక పీర్లపంజాలు అయిన బిబి జైనబియా, అస్తాన ఏ అబుల్ ఫజల్ అబ్బాస్, మంజిలే షోహదా, బైతుల్ ఖాయం,అలి అసగర్ పంజాల వద్ద షియా మహిళలు,భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని మజలిస్ లను ఆలపించి ఇమామ్ హుస్సేన్ కుటుంబీకులను తలుచుకుంటూ కన్నీటి పర్యంతం అయ్యారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుండి విచ్చేసిన మౌలానా మీర్ మహమ్మద్ అలీ జాఫరీ కర్బలా లో జరిగిన యదార్థ ఘటనలను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సుదూర ప్రాంతాలను విచ్చేసిన భక్తులకు కమిటీ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాట్లను నిర్వహించారు.

## కొత్తలంకలో తాగునీటి కష్టాలు

ముమ్మిడివరం జూన్ 26 ప్రభాతవార్త ముమ్మిడివరం మండలం కొత్తలంక గ్రామంలో తాగునీరు లేక కొత్తలంక గ్రామ ప్రజలు అల్లాడిపోతున్నారు. తాగునీరు కోసం పలుమార్లు రాజకీయ నాయకులకు అధికారులకు విన్నవించుకున్న ప్రయోజనం లేకపోయింది అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొత్తలంక గ్రామపంచాయతీ ముమ్మిడివరం తహసీల్దార్ టి సుభాష్ స్పెషల్ ఆఫీసర్ ఉన్నప్పటికీ తాగునీటి కష్టాలు తీరతాయని ప్రజలు ఊహించారు కానీ ప్రయోజనం లేదు తాగునీరు కొత్తలంక గ్రామ ప్రజలుఅల్లాడిపోతున్నారు.

## తండ్రి మందలించడంతో పురుగులు మందు త్రాగిన కొడుకు మృతి




రాజవొమ్మంగి, జూన్ 26, ప్రభాతవార్త మద్యం సేవించి డబ్బులు దుర్వినియోగం చేస్తున్నారని తండ్రి మందలించడంతో మనస్తాపం చెంది పురుగులు మందు త్రాగిన కొడుకు మరణించాడు. 26 తేదీన పురుగులు మందు త్రాగిన గిరిజన యువకుడు మృతి వార్తలో ప్రత్యేక కథనం వచ్చింది. చేరుకుంపాలెం పంచాయతీ పాతవెలగలపాలెం గ్రామానికి చెందిన వంజరి లక్ష్మణ్ (27)సం. 26 తేదీన పురుగులు మందు త్రాగడంతో జడ్డంగి పి. హెచ్. సి కి తీసుకెని వచ్చారు. డా. పావని, డా. నాగార్జున వైద్యసేవలను అందించి అడ్డతీగల ఆసుపత్రి కి రిఫర్ చేశారు. జడ్డంగి పి. హెచ్. సి అంబులెన్సు మరమ్మతులకు గురైంది. 108 వాహనాలు అందుబాటులో లేక జడ్డంగి పి. హెచ్. సి లో గంట సమయం ఉండగా, వైద్యులు చొరవతో అడ్డతీగల ఆసుపత్రి నుండి అంబులెన్సును రప్పించి తరలించగా చనిపోయాడు. తండ్రి గంగరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసామని జడ్డంగి ఎస్. ఐ. వినబాబు తెలిపారు. మద్యం సేవించి డబ్బులు దుర్వినియోగం చేస్తున్నాడని మందలించడంతో మనస్తాపం చెంది పురుగులు మందు త్రాగి చనిపోయినట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడని ఎస్. ఐ అన్నారు. శుక్రవారం అడ్డతీగల పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని అన్నారు. ఎమ్మెల్యే ఉచిత అంబులెన్సులో అడ్డతీగల ఆసుపత్రి నుండి మృతదేహాన్ని పాతవెలగలపాలెం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. హెడ్ కానిస్టేబుల్ రాజ్ కుమార్, కుటుంబీకులు పాల్గొన్నారు.

## ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి ఆలయానికి అశేష భక్త జనం...




ఆత్రేయపురం, జూన్ 26,(ప్రభాత వార్త) ప్రపంచ ప్రఖ్యాత గాంచిన రాష్ట్రంలోనే అతి పురాతన పుణ్యక్షేత్రం స్వయంభూ ఆలయం ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారిని శుక్రవారం అశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. పక్కిలే వరిలిదే కావటంతో అత్యధికంగా భక్తులు రావడంతో ఆలయ అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజు దేవస్థానం నందు నిర్వహించే నిత్యాన్నదానంలోభక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ చైర్మన్ మెట్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, ప్రతిరోజు ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.

## ఆలయాల అభివృద్ధి మరమ్మత్తులకు రూ1.06 కోట్ల నిధుల విడుదలఎమ్మెల్యే బండారు



కొత్తపేట, జూన్ 26,(ప్రభాతవార్త) రానున్న 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధి మరమ్మత్తు పనుల నిమిత్తం రూ1.06 కోట్ల నిధులు విడుదలైనట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు పుష్కరాల పనుల్లో భాగంగా ఆలయాల ఇంప్రూవ్మెంట్ అండ్ స్పెషల్ రిపేర్ కింద ఈ గ్రాంట్లు మంజూరు అయ్యాయన్నారు కొత్తపేట శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి రూ16 లక్షలు వాడపాలెం శ్రీ మారెమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ13 లక్షలు వానపల్లి శ్రీ వైద్యనాథ స్వామి వారి ఆలయ అభివృద్ధికి రూ22 లక్షలు బిల్లకుర్రు శ్రీ మదన గోపాల స్వామి వారి ఆలయ అభివృద్ధికి రూ20 లక్షలు రావులపాలెం శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయ అభివృద్ధికి రూ11 లక్షలు గంటి శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి రూ 12.50 లక్షలు గంటి శ్రీ కేశవ స్వామి వారి ఆలయానికి రూ11.50 లక్షలు మంజూరు అయ్యాయన్నారు ఆలయాల అభివృద్ధికి నిధులు విడుదలకు కృషిచేసిన ఎమ్మెల్యే బండారుకు ఆయా గ్రామాల నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## చేనేత కార్మికులకు 52 లక్షలు మగ్గం సహాయం



అయినవిల్లి జూన్ 26 ప్రభాతవార్త కే జగన్నాధపురం చేనేత సొసైటీ పరిధిలో చేనేత మగ్గం కార్మికులకు పెద్ద నిర్మాణానికి జాతీయ చేనేత అభివృద్ధి పథకం ద్వారా సహాయం మంజూరైంది మగ్గం పెద్ద నిర్మించుకునేందుకు ఒక్కొక్క మగ్గానికి లక్ష ఇరవై వేల రూపాయలు చొప్పున 44 మందికి 52 లక్షల 80 వేలు మంజూరైనట్లు జగన్నాధపురం చేనేత సొసైటీ మాజీ చైర్మన్ ముళికి విగ్నేశ్వరుడు తెలిపారు అమలాపురం పార్లమెంట్ సభ్యులు జి హరీష్ మాధుర్ ఇంటి వద్ద శుక్రవారం పత్రాన్ని లబ్ధిదారులకు అందజేశారు తమకు ఈ సహాయం అందించేందుకు కృషిచేసిన పార్లమెంట్ సభ్యులు హరీష్ మాధురిని సొసైటీ సభ్యులు అభినందించారు ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ సంఘం నాయకులు అంకం వీర్రాజు గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# ఓటర్ స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్‌కు సహకరించాలి..

### -తాసిల్దార్ , ఆర్.డి.శ్రీరామచంద్రమూర్తి, ఎంపీడీవో, వెంకట రామన్.



ఆత్రేయపురం, జూన్ 26,(ప్రభాత వార్త) కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఓటర్ స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని తాసిల్దార్ ఆర్డీ శ్రీరామచంద్రమూర్తి, ఎంపీడీవో బి కే ఎస్ ఎస్ వెంకట రామన్ లు కోరారు. ఓటర్ లకు అవగాహన కల్పించేందుకు మండల పరిధిలోని 17 గ్రామాల్లో టాం... టాంలు వేయించడంతోపాటు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘము ఆదేశముల మేరకు మన రాష్ట్రంలో జరిగే స్పెషల్ ఇంటెన్షన్ రివిజన్ (ఎస్ ఐ ఆర్ ) -2026లో భాగముగా ప్రతి పోలింగ్ బూత్ కు సంబంధించిన బిఎల్ఓ ప్రతి ఇంటికి వచ్చి ఓటరుకు రెండు ఎన్యూమరేషన్ ఫార్మ్ అందిస్తారని తెలిపారు. ఎస్ ఐ ఆర్ ఫార్మ్స్ అందని వారు పోలింగ్ బూత్ బిఎల్ఓని సంప్రదించాలని తెలిపారు. అందరు ఓటర్లు ఎన్యూమరేషన్ ఫార్మ్ లో మీ యొక్క పూర్తి వివరాలు నింపి ఒక ఫార్మ్ పై కలర్ పాస్ పోర్ట్ సైజు ఫోటో అతికించి బిఎల్ఓకు అందించి ఓటర్ జాబితాలో ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఓటు కోల్పోయేఅవకాశం ఉందని అన్నారు. కావున ఓటు కలిగిన వారు అందరు ఈ అవకాశం వినియోగించుకోవాలని ఏమైనా సందేహాలు ఉన్న యెడల స్థానిక బిఎల్ఓ లేదా తహసీల్దార్ వారి కార్యాలయం నందు సంప్రదించలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో తెదేపా కార్యకర్త మృతి



కాట్రేనికోన జూన్ 26 (ప్రభాత వార్త) కాట్రేనికోనకు చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త మోకా లోవరాజు(38) గురువారం రాత్రి ప్రమాదవశాత్తూ గెడ్డనపల్లిలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. స్థానికులు , పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామస్వామితోటకు చెందిన మోకా లోవరాజు కాట్రేనికోన గేటు సెంటర్లో ఫాస్ట్ ఫుడ్ కేంద్రాన్ని నిర్వహిస్తూ తన కుటుంబాన్నీ పోసించుకుంటున్నాడు. వ్యక్తిగత పని నిమిత్తం గురువారం రాత్రి దొంతికుర్రు వెళ్లిన లోవరాజు తిరిగివచ్చే క్రమంలో గెద్దనపల్లికి వచ్చేసరికి రోడ్డు మధ్యలోకి పశువులు అడ్డుగా రావడంతో తన ద్విచక్ర వాహనంకు సడన్ బ్రేక్ వేశాడు. ఒక్కసారిగా కింద పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం అంబులెన్స్ లో ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నారు. వృద్ధురాలైన తన తల్లితో పాటు ఆ కుటుంబానికి లోవరాజే ఏకైక జీవన ఆధారం.. గ్రామం లో అందరితో ఎంతో మర్యాదగా, కలుపుగోలుగా ఉండే లోవరాజు మృతితో విషాదఛాయలు అలముకున్నాయి. తెదేపా కార్యకలాపాల్లో ఎంతో చురుకుగా ఉంటే ఇతని మృతిపై ఎంఎల్ ఏ దాట్ల సుబ్బరాజు, ఎంపీ గంటి హరీష్ మాధుర్, నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు,చెల్లి సురేష్ , కోటిపల్లి సత్యనారాయణ, గుత్తుల సూరిబాబు, తదితర నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అవినాష్ తెలిపారు.

## ప్రజల ముంగిటకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 26( ప్రభాతవార్త)ప్రజా సమస్యలను నేరుగా



తెలుసుకుని వేగంగా పరిష్కరించాలని లక్ష్యంతో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేపట్టిన మన వార్డులో– మన ఆది రెడ్డి కార్యక్రమం గురువారం రాత్రి 6, 31 డివిజన్ ల పరిధిలోని అన్నపూర్ణమ్మ పేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పార్టీ సీనియర్ కార్యకర్త నాలిపల్లి అప్పారావు నివాసంలో రాత్రి బస చేశారు. శుక్రవారం ఉదయం కూటమి నాయకులు స్థానిక ప్రజలతో కలిసి ఇంటింటికి వెళ్లి పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీల నిర్వహణ సీసీ రోడ్ల నిర్మాణం వీధి దీపాల ఏర్పాటు విద్యుత్ సమస్యలు తాగునీటి సరఫరా పెన్షన్లు రేషన్ కార్డులు పారిశుధ్యం తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేస్తూ వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని సమస్యలు పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావుండదని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పార్టీ కార్యకర్తలు ఆయా శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓపి ఎస్ అమలుకు ఆమోదం

### ఎమ్మెల్యే బండారుకు సన్మానం



కొత్తపేట, జూన్ 26,(ప్రభాతవార్త) డి ఎస్ సి 2003 ఉపాధ్యాయులకు ఓ పి ఎస్ అమలుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ లను నేతృత్వం లోని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు కొత్తపేట ఎస్ టి యు ఉపాధ్యాయ శాఖ తెలియజేసింది దానిని పురస్కరించుకుని శుక్రవారం కొత్తపేట శాసన సభ్యులు బండారు సత్యానంద రావు ను ఎస్ టి యు కొత్తపేట శాఖ ప్రతినిధులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో ఎస్ టి యూ కొత్తపేట మండల శాఖ.అధ్యక్షులు బండారు నారాయణ ప్రధాన కార్యదర్శి ఆచంట ప్రసాద్ గౌరవ అధ్యక్షులు సత్యానంద కుమార్ కార్యదర్శులు కొంపెల్ల శర్మ సూరిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఘన సత్కారం



రావులపాలెం, జూన్ 26 (ప్రభాతవార్త) : మండల స్థాయిలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఎస్సీ విద్యార్థినులు పల్లి వర్షిత, జాలాది అపర్ణలకు ఏపీఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అమలాపురం అంబేద్కర్ భవన్‌లో ఘన సన్మానం నిర్వహించారు. పల్లి వర్షిత 600 మార్కులకు గాను 573 మార్కులు సాధించి ప్రథమ స్థానం, జాలాది అపర్ణ 568 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గోసంగి బంగ్రరాజు, ఎంఏకే భీమారావు, పీఎస్ రాజ్‌కుమార్, జీవీ రమణ, కారుపల్లి కళ్యాణ్, బత్తుల రమేష్, కత్తుల ఆనందరావు చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. విద్యార్థినులకు మెమెంటో, శాలువా, బ్యాగ్, పతకం, నగదు బహుమతులు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## “హామీలకు విలువ లేదా..?

### -మంత్రి మరియు జాయింట్ కమిషనర్ సమక్షంలో ఇచ్చిన మాట అమలు కానప్పుడు కార్మికురాలు ఎవరిని ఆశ్రయించాలి?”



కడియం ,జూన్ 26 (ప్రభాతవార్త) ఒక సాధారణ కార్మికురాలు తోటి కార్మికులతో పాటు వీధుల్లోకి తనను కూడా విధులలోకి తీసుకోవాలంటూ అధికారులను ఆశ్రయించింది. సమస్యను విన్న కార్మిక శాఖ స్పందించింది. ఇరుపక్షాలను పిలిచి చర్చలు జరిపింది. సమావేశంలో కార్మికురాలిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని హామీ కూడా లభించింది. ఆ తరువాత రాష్ట్ర మంత్రి సమక్షంలో జరిగిన చర్చల్లో సైతం అదే హామీ మరోసారి పునరావృతమైంది. కానీ ఆ హామీలు ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది.కడియం మండలంలోని ఓ ఆంధ్ర పేపర్ మిల్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికురాలు తనకు ఎదురవుతున్న ఇబ్బందులపై కార్మిక శాఖకు ఫిర్యాదు చేయగా, జూన్ 19న ఏలూరులోని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయంలో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో కార్మికురాలిని విధుల్లోకి తీసుకుంటామని కాంట్రాక్టర్ అంగీకరించినట్లు సమాచారం.ఇదే అంశం జూన్ 24న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి వెళ్లింది. మంత్రి సమక్షంలో జరిగిన చర్చల్లో కూడా కార్మికురాలిని ఉద్యోగంలోకి తీసుకుంటామని మరోసారి హామీ ఇచ్చినట్లు తెలిసింది. అయితే రెండు సందర్భాల్లో హామీలు లభించినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి మారలేదని కార్మికురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రశ్న ఇక్కడ ఒక కార్మికురాలి ఉద్యోగానికి మాత్రమే పరిమితం కాదు. ప్రభుత్వ యంత్రాంగం, కార్మిక శాఖ, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఇచ్చిన హామీలకు ఎంత ప్రాధాన్యత ఉందన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. ఒకవేళ అధికారుల సమక్షంలో ఇచ్చిన మాటలు కూడా అమలుకాకపోతే, న్యాయం కోసం ఫిర్యాదు చేసే సాధారణ కార్మికుడు లేదా కార్మికురాలు ఎవరిని నమ్మాలన్న ప్రశ్న తలెత్తుతోంది.కార్మిక చట్టాలు కార్మికుల హక్కులను కాపాడేందుకు ఉన్నాయా? లేక కాగితాలకే పరిమితమవుతున్నాయా? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఇచ్చిన హామీలు అమలు కాకపోతే, ఆ సమావేశాల ప్రయోజనం ఏమిటన్న చర్చ కూడా వినిపిస్తోంది.ఒకవైపు పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు గురించి మాట్లాడుతుంటే, మరోవైపు ఉద్యోగం కోసం న్యాయబద్ధంగా పోరాడుతున్న కార్మికురాలు ఇప్పటికీ విధుల్లోకి చేరలేకపోవడం విచారకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని, ఇచ్చిన హామీలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కార్మిక వర్గాలు కోరుతున్నాయి.“అధికారుల ఎదుట ఇచ్చిన మాటకు గౌరవం లేకపోతే... సాధారణ కార్మికుడి నమ్మకం ఎక్కడ నిలుస్తుంది?” అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఇప్పుడు సంబంధిత వర్గాలపై ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## అంత్యక్రియలకూ పనికిరాని బుర్రిలంక స్మశాన వాటిక

### అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆవేదన



కడియం, జూన్ 26 (ప్రభాతవార్త) మరణించిన వారికి చివరి వీడ్కోలు పలికే పవిత్ర స్థలం... శివుడు కొలువై ఉంటాడని హిందువులు భావించే స్మశాన వాటిక... కానీ కడియం మండలం బుర్రిలంక గ్రామ స్మశాన వాటిక మాత్రం చెత్తకుప్పగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. అంత్యక్రియలు నిర్వహించడానికి కూడా వీలులేని దుస్థితికి చేరుకోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బుర్రిలంక స్మశాన వాటికలో కడియపులంక, బుర్రిలంక గ్రామాల నుంచి సేకరించిన చెత్తను పెద్దఎత్తున డంపింగ్ చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా స్మశానమంతా చెత్తకుప్పలతో నిండిపోవడమే కాకుండా, దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. కనీసం అంత్యక్రియలకు వచ్చే బంధువులు కూర్చునే పరిస్థితి కూడా లేకపోవడంతో మృతదేహాలను ఇతర ప్రాంతాలకు తరలించాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు.ఈ స్మశాన వాటిక జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో ప్రతిరోజూ అధికారులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి నాయకులు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నప్పటికీ దాని దయనీయ పరిస్థితిని పట్టించుకునే వారు లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుర్రిలంక గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, మండలాన్ని సైతం శాసించే స్థాయిలో ఉన్న నాయకులు ఉన్నప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని గ్రామస్తులు అంటున్నారు.బుర్రిలంక గ్రామానికి చెందిన గాధ నాగేశ్వరరావు మాట్లాడుతూ, బుర్రిలంక గ్రామంలో ఎవరైనా మరణిస్తే స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అలా అని గోదావరి నది ఒడ్డున అంత్యక్రియలు నిర్వహిద్దామంటే అక్కడ కూడా కనీస సౌకర్యాలు లేవని చెప్పారు. పైగా విషసర్పాల సంచారం ఎక్కువగా ఉండటంతో ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారిందన్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లో మృతదేహాలను ధవళేశ్వరం లేదా రాజమహేంద్రవరం కైలాస భూమికి తరలించి అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు.పవిత్రమైన స్మశాన వాటికను చెత్త డంపింగ్ యార్డుగా మార్చడం తగదని, వెంటనే చెత్తను తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, అంత్యక్రియలకు అవసరమైన షెడ్లు, తాగునీటి సౌకర్యం, కూర్చునేందుకు ఏర్పాట్లు, రహదారి వంటి కనీస మౌలిక వసతులు కల్పించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు.మనిషి జీవితంలో చివరి ప్రయాణం గౌరవప్రదంగా సాగేందుకు ఉద్దేశించిన స్మశాన వాటికే నిర్లక్ష్యానికి గురికావడం బాధాకరం.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బుర్రిలంక స్మశాన వాటికను చెత్తరహితంగా మార్చి, గ్రామస్థుల మనోభావాలను గౌరవిస్తూ అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.”

## రాజకీయ స్వార్థం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుట్ర

### - ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



రావులపాలెం, జూన్ 26 (ప్రభాతవార్త) :రాజకీయ స్వార్థం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కులాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విమర్శించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపు నాయకుల ఆత్మీయ సమావేశాల పేరుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై అసత్య ప్రచారం చేస్తూ బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాపు సామాజిక వర్గానికి న్యాయం చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీయే అని చంద్రబాబు హయాంలోనే కాపు రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ కోసం పనిచేసిన కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అనారోగ్యంతో ఉన్న సమయంలో కూడా ఆ పార్టీ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇటీవల ఆయన కుమార్తె చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు.రాజకీయ స్వార్థం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుట్ర-- ఎమ్మెల్యే బండారు సత్యానందరావురావులపాలెం, జూన్ 26 (ప్రభాతవార్త) :రాజకీయ స్వార్థం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కులాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విమర్శించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపు నాయకుల ఆత్మీయ సమావేశాల పేరుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై అసత్య ప్రచారం చేస్తూ బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాపు సామాజిక వర్గానికి న్యాయం చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీయే అని చంద్రబాబు హయాంలోనే కాపు రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ కోసం పనిచేసిన కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అనారోగ్యంతో ఉన్న సమయంలో కూడా ఆ పార్టీ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇటీవల ఆయన కుమార్తె చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు.

## కష్టకాలంలో నాగయ్య కుటుంబానికి టీడీపీ నాయకుల సహాయం



గోపాలపురం, జూన్ 26 (ప్రభాతవార్త): ఇటీవల అనారోగ్యంతో పెద్దగూడెంలో మృతిచెందిన పంచాయితీ కార్మికుడు దిర్శిపోం నాగయ్య కుటుంబాన్ని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా నాగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా టీడీపీ మాజీ టౌన్ అధ్యక్షులు జ్యేష్ఠ శ్రీధర్ తన వంతుగా రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేసారు. నాగయ్య పంచాయితీ కార్మికుడిగా గ్రామ పారిశుద్ధ్య నిర్వహణలో ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు విలువైన సేవలు అందించారని కొనియాడారు. అవసరమైన సమయంలో కుటుంబానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే రెండు బియ్యం ప్యాకెట్లను కూడా అందించారు.ఈ కార్యక్రమంలో మద్దిపాటి రమేష్, వింత ప్రసాద్, కూనపోం ప్రసాద్, కప్పల వరలక్ష్మి, తానేటి వీరరాఘవులు, కొడవటి వెంకటేశ్వర్రావ్, రాపాక ఫణి కిషోర్, చాపల రవి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సెంటర్లకు ఆధునిక వంట సామాగ్రి పంపిణీ



యు.కొత్తపల్లి, జూన్ 26(ప్రభాతవార్త) :అంగన్‌వాడీ సెంటర్లకు సౌకర్యవంతమైన ఆధునిక వంట సామాగ్రిని కూటమి ప్రభుత్వం పంపిణీ చేయడం హర్షణీయమని పాత ఇసుకపల్లి గ్రామ జనసేన పార్టీ ఇంచార్జ్ కర్ణం భాస్కర్ అన్నారు. మండలంలోని పాత ఇసుకపల్లిలో ఉన్న 5 అంగన్‌వాడీ సెంటర్లకు విద్యుత్ పొయ్య (ఇండక్షన్ స్టవ్) లను కూటమి నాయకులు కర్యకర్తలకు అందజేసారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు అందించే భోజనంలో పోషకాలు కోల్పోకుండా ఆధునిక వంట సామాగ్రి ఉపయోగపడుతుంద న్నారు. ఇకపై గ్యాస్ కొరత వచ్చినా వంటకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యకర్తలు కూడా చిన్నారుల భోజన సదుపాయంలో ప్రత్యక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నడింపల్లి సత్యనారాయణ రాజు, సాధనాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

### రచయిత కత్తిమండకు

## ముఖ్యమంత్రి అభినందన.....



సఖినేటిపల్లి జూన్ 26, ప్రభాత వార్త: ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలను అత్యంత ఘనంగా, విజయవంతంగా నిర్వహించిన ప్రముఖ కవి రచయిత శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కుమార్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అభినందించారు. ముఖ్యమంత్రిని అమరావతి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన కత్తిమండ ప్రతాప్ ఇటీవల రాజంహేంద్రవరం లో ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల నిర్వహణ, శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల గురించి వివరించారు. తెలుగు భాషా వికాసం, సాహిత్యాభివృద్ధి కోసం ప్రతాప్ చేపడుతున్న కార్యక్రమాలను ముఖ్యమంత్రి ఆసక్తిగా తెలుసుకున్నారు. తెలుగు భాషా, సాహిత్య పరిరక్షణకు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని, తెలుగు సాహిత్య వైభవాన్ని ప్రపంచానికి చాటేందుకు కృషి చేస్తానని తెలియజేశారు.

మరిన్ని వార్తలు 6లో

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



# కర్బలా అమర వీరులకు ఘన నివాళి



**మామిడికుదురు..జూన్ 26(ప్రభాతవార్త)** ఇస్లాం మత వ్యవస్థాపకులు మొహమ్మద్ ప్రవక్త మనుమడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ తోపాటు కుటుంబ పరివార సభ్యులు 72 మంది కర్బలా పుణ్యభూమిలో వీర మరణం పొందిన సంఘటనను పురస్కరించుకొని జరుగుతున్న మొహర్రం కార్యక్రమంలో భాగంగా ఆఖరి రోజైన శుక్రవారం ముస్లింలు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నగరం,మామిడికుదురు గ్రామాల్లో ఉన్న పంజాల నుంచి పీర్లను,గుమ్మటాలను తీసి రక్తం చిందించేలా మాతం చేస్తూ స్థానిక పంజేషా వరకు తీసుకొని వచ్చారు.పంజేషాలో షహాదత్ మజ్లిస్ జరిగింది.ఈ మజ్లిస్ లో మత ప్రభోధకులు సయ్యద్ మొహమ్మద్ కాజ్మీ ఇరాక్ లోని కర్బలా పుణ్య భూమిలో అమరత్వం పొందిన ఇమామ్ హుస్సేన్ తోపాటు ఆయన కుటుంబ సభ్యుల గాధను భక్తులకు వివరించారు.భక్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు.మజ్లిస్ అనంతరం పీర్లను, గుమ్మటాలను నగరం మార్కెట్ కమిటీ ప్రక్కన ఉన్న పీర్ల చెరువు వద్దకు తీసుకొని వెళ్లి శాంత పరిచారు.

## చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు అందరి బాధ్యత



**యు.కొత్తపల్లి, జూన్ 26(ప్రభాతవార్త) :** చిన్నారులు పోలియో బారిన పడకుండా వారి ఉజ్వల భవిష్యత్తును కాపాడేందుకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాజ్ కుమార్ అన్నారు. ఆదివారం జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమంపై శుక్రవారం ఏఎన్ఎం, అంగన్వాడీ ఆశా కార్యకర్తలు, వి. హెచ్.సి సిబ్బందికి శిక్షణ కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం పరిధిలో 1012 మంది 0-5 వయస్సు ఉన్న పిల్లలను గుర్తించడం జరిగింది. వీరికి పోలియో చుక్కలు వేయడానికి 8 బూత్ లు, 30 మంది సిబ్బందిని ఏర్పాటు చేసామన్నారు. 28న వేయించుకోని పిల్లలకు 29, 30 తేదిలలో గృహ సందర్శనల ద్వారా ఇంటివద్దే పోలియో చుక్కలు వేయడం జరుగుతుంది. పోలియో చుక్కలు కార్యక్రమం సూపర్ వైజర్లు పర్యవేక్షణలో జరుగుతుందన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.
### -మహిళా మండలి ప్రతినిధి: ఝాన్సీ.



**తాళ్ళరేవు జూన్ 26 (ప్రభాతవార్త):** సైబర్ నేరాల పట్ల యువతీ యువకులు అప్రమత్తంగా ఉండాలని బీమాబాయి మహిళా మండలి ప్రతినిధి ఝాన్సీ అన్నారు. తాళ్ళరేవులోని స్థానిక కార్యాలయంలో మహిళా మండలి ముఖ్య కార్యనిర్వహణ అధికారి వాసంశెట్టి నందివర్ధన అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు, యువత, కౌమర బాలికలకు సైబర్ వేధింపులను ఏమాత్రం సహించకూడదనే అంశంతో డిజిటల్ సాధికారతపై అర్ధ సంవత్సర సామర్థ్య నిర్మాణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరాలను, వేధింపులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు, డిజిటల్ నైపుణ్యాలతో కూడిన సమిష్టి కృషి అవసరమని అన్నారు. మహిళా మండలి ప్రతినిధి కార్య నిర్వహణ అధికారి నందివర్ధన మాట్లాడుతూ డిజిటల్ సాధికారతను సాధించవలసిన ఆవశ్యకతను వివరించి, పాటించవలసిన సూత్రాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ పరిధిలోని మహిళలు, బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రేవు లోవరాజు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఏ వరలక్ష్మి, సిహెచ్ సునీత, ఎన్ నాగమణి, డి దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ శాసనసభ్యులు కీ.శే.మంగెన గంగయ్య వర్ధంతి..

**సఖినేటిపల్లి/మలికిపురం జూన్ 26 ప్రభాత వార్త:** రాజోలు మాజీ



శాసనసభ్యులు కీ.శే. మంగెన గంగయ్య వర్ధంతి పురస్కరించుకొని మలికిపురం నాలుగు రోడ్ కూడలిలో ఉన్న విగ్రహానికి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మంగెన గంగయ్య ప్రజా సేవకు చేసిన విశిష్ట సేవలను, రాజోలు నియోజకవర్గ అభివృద్ధికి అందించిన కృషిని ఎమ్మెల్యే స్మరించుకున్నారు. వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన శ్రీరామమూర్తి



**గోపాలపురం, జూన్ 26 (ప్రభాతవార్త):** గోపాలపురం మండలం, కోమటిగుంటలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మండల వైసీపీ అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి శుక్రవారం పరిశీలించారు. బీఎల్ఓలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ, జాబితాలో ఏవైనా తప్పులు, అవకతవకలు లేదా అర్హుల పేర్లు గల్లంతయ్యాయా అనే అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి అర్హుడైన ఓటరు ఓటు హక్కును పరిరక్షించుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అందజేస్తున్న డిక్లరేషన్ ఫారాలను పూర్తి వివరాలతో సక్రమంగా నింపి సంబంధిత అధికారులకు అందించాలని ప్రజలకు సూచించారు. ఓటర్ల జాబితాలో పొరపాట్లు ఉంటే వెంటనే బీఎల్ఓల దృష్టికి తీసుకువచ్చి సరిచేసుకోవాలని కోరారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయకుండా సహకరించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు మాకిరెడ్డి మురళి కృష్ణ రెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి పెనుబోయిన గంగరాజు, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చెల్లె మహేష్, గ్రామ రైతు కార్యదర్శి మాకిరెడ్డి సంజీవ రెడ్డి, మండల విద్యార్థి విభాగం వైస్ ప్రెసిడెంట్ ముల్లంగి కిషోర్ రెడ్డి పాల్గొన్నారు

## జనసేన అబ్జర్వేషన్ టీమ్‌కు అప్పారావు ఎంపిక



**రాజవొమ్మంగి, జూన్ 26, ప్రభాతవార్త** రాజవొమ్మంగి గ్రామానికి చెందిన జనసేన సీనియర్ పార్టీ నాయకులు పి. వి. వి. ఎస్ అప్పారావు అరకు పార్లమెంట్ పరిధిలో జనసేన అబ్జర్వేషన్ టీమ్ కు ఎంపికయ్యారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో జనసేన పార్టీ స్థాపించిన నుండి పార్టీకి సేవలను అందించిన 28 మందిని సమాచార సేకరణ కమిటీని ఎమ్మెల్సీ కె. నాగేంద్రబాబు ఆధ్వర్యంలో జాబితాను ప్రకటించడం జరిగింది. ఈ కమిటీ గ్రామ స్థాయి నుండి పార్లమెంట్ స్థాయి వరకూ జనసేన పార్టీ కోసం పని చేసే ఆశక్తి కలిగి వివిధ విభాగాల్లో పని చేయడానికి సిద్ధంగా ఉన్న వారి యొక్క వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి అందజేస్తారు.

## సర్ ప్రక్రియపై వైసీపీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి రాజమండ్రి పార్లమెంట్ పరిశీలకులు గురుమూర్తి రెడ్డి

**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 26 (ప్రభాతవార్త)** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎన్నికల ఓటర్ల సవరణ జాబితాలో పేర్లు ఉండేలాగా ముఖ్యంగా వైసీపీ పార్టీకి చెందిన సానుభూతిపరులు మద్దతుదారుల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని రాజమండ్రి పార్లమెంట్ పరిశీలకు గురుమూర్తి రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పై వైఎస్ఆర్సిపి వార్డ్ ఇన్చార్జిలు బూత్ లెవెల్ ఏజెంట్లు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పరమేశ్వర రావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన పోర్టల్ లో ఓట్లు నమోదు కొరకు ఎపిక్ నెంబర్ మొబైల్ నెంబర్ తో లాగిన్ కావాలని సూచించారు. బి ఎల్ ఏ లు ఓటర్లకు ఫారాలను ఇవ్వాలని పూర్తి చేసిన ఫారాలను బిఎల్వోలు సబ్మిట్ చేశారో లేదో నిర్ధారించుకోవాలి అన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను పార్టీ నాయకుల దృష్టికి తీసుకురావాలని అధికార పార్టీ నాయకులు అధికారులు కలిసి చేసే తప్పులను నిరంతరం గమనించాలన్నారు. వైసిపి నాయకులు కార్యకర్తలను అధికార పార్టీ నాయకులు అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేసిన మనోధైర్యం కోల్పో వద్దన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు అద్దంకి ముక్తేశ్వర రావు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**కాట్రేనికోన జూన్ 26 (ప్రభాత వార్త)** సార్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో,



శ్రీంప్ సినర్జీ ప్రాజెక్ట్ సహకారంతో కాట్రేనికోన మండలం నాగపట్నం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కిమ్స్ హాస్పిటల్, దిశా వెహికల్, రెడ్ క్రాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సంయుక్తంగా పాల్గొని గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. మొత్తం136 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు, గైనకాలజీ పరీక్షలు, ఈసీజీ, షుగర్, రక్తపోటు ,రక్త పరీక్షలు నిర్వహించారు.పరీక్షల అనంతరం ఇద్దరికి కళ్లజోళ్లు అవసరమని, నలుగురికి కంటి శస్త్రచికిత్స తప్పనిసరి అని వైద్యులు నిర్ధారించారు. 39 మందికి నిర్వహించిన రక్త పరీక్షల ఫలితాలు సాధారణంగానే ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదసింగు శ్రీనివాసరావు, ఓలేటి మాత్రాజు, పాళ్ళ సత్యం, ఓలేటి నర్సింహామూర్తి, సార్డ్స్ సంస్థ డీపీఎం నాగార్జున, దిశా వెహికల్ కౌన్సిలర్ రమ్య, కిమ్స్ పీఆర్వో ప్రసాద్, పీఆర్వో ధర్మా, ఆశా కార్యకర్త సూర్యకళతో పాటు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిలో దూకి మహిళా ఆత్మహత్య



**ముమ్మిడివరం జూన్ 26 (ప్రభాతవార్త)**ఐ. పోలవరం మండలం ఎదుర్లంక జి. ఎం. సి. బాలయోగి వారధిపై నుండి గోదావరిలో దూకి కొమరగిరి లైన్ పేటకు చెందిన వివాహిత కలవల దుర్గా భవాని (33) ఆత్మహత్య చేసుకుంది.గోదావరిలో దూకడం చూసి కాపాడే యత్నం చేసిన స్థానిక మత్యకారులు.. కాపాడే లోపే గోదావరి లో మునిగి మృతి చెందింది.సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు గత కొంతకాలంగా మానసిక వ్యాధితో భాద పడుతూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రులో భవాని చికిత్స పొందుతుందని భర్త ఆటో డ్రయివర్ విజయకుమార్ పేర్కొన్నారు.ఆసుపత్రికి వెళ్తున్నానని చెప్పి వచ్చి గోదావరిలో దూకేసిందని తెలుపుతున్న భర్త... వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

## జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ స్కూల్లో బకిం చంద్ర చటర్జీ 189వ జయంతి వేడుకలు:



**జగ్గంపేట, జూన్ 26 (ప్రభాతవార్త )** బకిం చంద్ర చటర్జీ 189వ జయంతి వేడుకలను శ్రీ ప్రజ్ఞ స్కూల్స్ చైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో శ్రీ ప్రజ్ఞ విద్యాసంస్థలలో శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. తొలుత చటర్జీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి చైర్మన్ నాగబాబు, డైరెక్టర్ తుమ్మల శ్వేత ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ బండారు నాగబాబు మాట్లాడుతూ --- 1838 జూన్ 26న జన్మించిన బకిం చంద్ర చటర్జీ అక్షరాన్ని ఆయుధంగా మలిచిన మహనీయుడు. 'వందేమాతరం' అనే రెండు అక్షరాలతో నిద్రాణమైన భారత జాతిని మేల్కొలిపిన దార్శనికుడు ఆయన.వందేమాతరం నినాదం వినపడితే బ్రిటిష్ పాలకుల వెన్నులో వణుకు పుట్టేది. లాఠీ దెబ్బలు, కారాగారాలు సైతం ఆ నినాదపు ప్రవాహాన్ని ఆపలేకపోయాయి. స్వాతంత్ర్య సమరంలో అది ప్రతి భారతీయుడి ఊపిరిగా మారింది.నేటి విద్యార్థి లోకం చటర్జీ సాహిత్యాన్ని చదవాలి. దేశభక్తి అంటే కేవలం భావోద్వేగం కాదు, అది బాధ్యత. అందుకే పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో 'వందేమాతరం' గీతాలాపన తప్పనిసరి. ఎందరో త్యాగాల ఫలితమే ఈ స్వేచ్ఛ అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.కార్యక్రమంలో డైరెక్టర్ తుమ్మల శ్వేత, ప్రిన్సిపాల్ అభి, ఇంచార్జి శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొని చటర్జీకి నివాళులు అర్పించారు.

## "సర్" ప్రక్రియలో అధికారులు..



**అంబాజీపేట,జూన్ 24, (ప్రభాతవార్త):**లకేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బిఎల్వోలు బిఎల్ఎలు పాల్గొని ఇంటింటికి తిరుగుతూ ఓటర్లకు సంబంధించిన ఫామ్ లను అందజేశారు.బూత్ లెవెల్ అధికారులు అడిగిన సమాచారం, ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని తెలిపారు. మండలంలోని ఇసుకపూడి గ్రామపంచాయతీ పరిధిలో 107 పోలింగ్ బూత్లో డిప్యూటీ తాసిల్దార్ సిహెచ్. వెంకటేశ్వరరావు,బిఎల్వో జ్యోతి,వార్డుల బిఎల్ఎ లు ఓటర్ల లిస్టు క్షుణ్ణంగా పరిశీలించి,ఫామ్స్ పూర్తి చేసే విధానాన్ని ఓటర్లకు అవగాహన కల్పించారు.టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు యనమదల సాయిబాబా, తదితరులు ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్నారు.

## ఓటర్ల వివరాలు సక్రమంగా ఉండాలి



**కొత్తపేట,జూన్ 26, (ప్రభాతవార్త)** గ్రామాల్లో బీఎల్ఓ లు ఇంటింటికి వెళ్లి సేకరించే ఓటర్ల వివరాలు సక్రమంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తపేట ఏఎంసి వైస్ చైర్మన్ కంఠం శెట్టి శ్రీనివాసరావు సూచించారు శుక్రవారం కొత్తపేటలోని 151 బూతులో డోర్ టు డోర్ ఓటర్ సర్వేలో ఆయన పాల్గొన్నారు ఓటర్ల జాబితాలో ఎటువంటి లోపాలు దోషాలు లేకుండా చూసేందుకే ఎలక్షన్ కమీషన్ ఎస్ ఐ ఆర్ ను నిర్వహిస్తోందన్నారు మరణించిన వారు వలస వెళ్లి పోయిన వారి పేర్లు తొలగించి కొత్త ఓటర్లను నమోదు చేసుకోవాలన్నారు కార్యక్రమంలో కాశీ ధనరాజు సాదా శ్రీను పినిపే ప్రసాద్ గంటి అంజిబాబు కుసుమే రమణ నెల్లి నాని తదితరులు పాల్గొన్నారు

## రామచంద్రాపురంలో ఉచిత వైద్య శిబిరం



**సీతానగరం , జూన్ 26, (ప్రభాతవార్త)** :మండలంలోని రామచంద్రపురం గ్రామంలో శుక్రవారం 'హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ అండ్ అవేర్నెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' అధ్యక్షుడు సత్య గుమ్మాపు, కార్యదర్శి బిందు చౌదరి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం, ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే ఆధార్ కౌంటర్ ద్వారా 40 మందికి ఆధార్ సేవలను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో కలగర సర్వరాయుడు, గుర్రం ఉదయ భాస్కర్, కోడేబత్తుల వెంకట దొరాజీ, పల్లి శశికళ, ఉండవల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు రాజవొమ్మంగిలో ఉచిత కంటి వైద్య శిబిరం

**రాజవొమ్మంగి, జూన్ 26, ప్రభాతవార్త** రాజవొమ్మంగి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం ఉదయం 9 గంటలు నుండి అడ్డతీగల రాజ్ ఐ కేర్ అండ్ జనరల్ క్లినిక్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహిస్తున్నట్లు బి. వి. వి. ఎస్.గుప్త తెలిపారు. శుక్లాలు, కళ్ళు ఎర్రబడటం, దృష్టి లోపం అన్ని రకాల కంటి సమస్యలకు వైద్య పరీక్షలను చేస్తారన్నారు. మధ్యాహ్నం వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భోజన సౌకర్యం ఉందని బి. వి. వి. ఎస్.గుప్త తెలియజేస్తున్నారు.

## గొల్లప్రోలు లో ఎక్స్ ప్రెస్ రైళ్ల హాల్ట్ పునరుద్ధరించాలి
### -ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కు వినతి పత్రం



**గొల్లప్రోలు, జూన్ 26,(ప్రభాతవార్త)** గొల్లప్రోలులో 8 సంవత్సరాల క్రితం రద్దు చేసిన ఎక్స్ ప్రెస్ రైళ్ల హాల్టును పునరుద్ధరించాలని కోరుతూ స్వచ్ఛ గొల్లప్రోలు ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు.శుక్రవారం కాకినాడలోని ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు ఉదయ్ శ్రీనివాస్ ను కలిసి సమస్యలను వివరించారు.గొల్లప్రోలు రైల్వే స్టేషన్ కు గతంలో సింహాద్రి,బొకారో, రాయగడ ఎక్స్ ప్రెస్ లకు హాల్టు ఉండేదని రైలు బోగీల సంఖ్య పెంచడం వల్ల ప్లాట్ ఫామ్ పొడవు సరిపోక హాల్టు రద్దు చేసారని ఎంపీకి వివరించారు.ప్రయాణికుల తరఫున పలు వినతి పత్రాలు అధికారులకు అందడంతో రైల్వే స్టేషన్ ఆధునీకరణ,ప్లాట్ ఫామ్ విస్తరణకు 310 కోట్ల రూపాయలు విడుదల చేశారని తెలిపారు.పనులు పూర్తయిన తర్వాత హాల్టులు యధావిధిగా పునరుద్ధరిస్తామని అప్పటి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్, డిఆర్ఎమ్ లు హామీ ఇచ్చారని ప్రస్తుతం రైల్వే స్టేషన్ ఆధునీకరణ,ప్లాట్ పామ్ విస్తరణ పనులు పూర్తయినందువల్ల బొకారో, సింహాద్రి,రాయగడ ఎక్స్ ప్రెస్ రైళ్ల హాల్టులు యధావిధిగా పునరుద్ధరించాలని ఎంపీని కోరారు. గొల్లప్రోలు వాణిజ్య కేంద్రం,సుమారు 30 గ్రామములకు ముఖ్య కూడలి అయినందువల్ల ఎక్స్ ప్రెస్ రైళ్లకు హాల్ట్ లేనందువల్ల వ్యాపారులు, ఉద్యోగులు,విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.దీనిపై ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ స్పందిస్తూ రైల్వే ఉన్నతాధికారులతో చర్చించి హాల్ట్ పునరుద్ధరణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఎంపీకి వినతిపత్రం అందజేసిన వారిలో స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొసిరెడ్డి రాజా,బి ప్రత్తిపాడు మాజీ సర్పంచ్ వూటా రామకృష్ణ, గొల్లప్రోలు చరితామృతం పుస్తక రచయిత బొజాజ ప్రసాద్,పడాల బాలరాజు,పడాల శివప్రసాద్ తదితరులు ఉన్నారు.ఎగొల్లప్రోలులో నేటి నుండి పాదాంబికా అమ్మవారి జాతర మహోత్సవాలు గొల్లప్రోలు, ఆంధ్రప్రభగొల్లప్రోలు పట్టణ పరిధి రైల్వే స్టేషన్ సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ పాదాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం నుండి ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మొగలి అయ్యారు తెలిపారు.27న అమ్మవారిని పురవీధులలో ఊరేగించడం జరుగుతుందని (గ్రామోత్సవం) తెలిపారు. గ్రామోత్సవం సందర్భంగా కుల మతాలకు అతీతంగా తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కాగడాలతో స్వాగతం పలకలమన్నారు.28 ఆదివారం అమ్మవారి జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ప్రధాన జాతరను పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ నైవేద్యములు సమర్పించి పునీతులు కావాలన్నారు.29 సోమవారం తిరుప్పావడ సేవ సందర్భంగా అమ్మవారికి 18 రకాల ప్రత్యేక నైవేద్యాలతో మహా నివేదన జరుగుతుందని తెలిపారు.మహా నివేదన అనంతరం భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.పాదాంబిక అమ్మవారి జాతర మహోత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ అయ్యారావు కోరారు.

## గొల్లప్రోలులో నేటి నుండి పాదాంబికా అమ్మవారి జాతర మహోత్సవాలు



**గొల్లప్రోలు, ఆంధ్రప్రభ** గొల్లప్రోలు పట్టణ పరిధి రైల్వే స్టేషన్ సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ పాదాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం నుండి ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మొగలి అయ్యారు తెలిపారు.27న అమ్మవారిని పురవీధులలో ఊరేగించడం జరుగుతుందని (గ్రామోత్సవం) తెలిపారు. గ్రామోత్సవం సందర్భంగా కుల మతాలకు అతీతంగా తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కాగడాలతో స్వాగతం పలకలమన్నారు.28 ఆదివారం అమ్మవారి జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ప్రధాన జాతరను పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ నైవేద్యములు సమర్పించి పునీతులు కావాలన్నారు.29 సోమవారం తిరుప్పావడ సేవ సందర్భంగా అమ్మవారికి 18 రకాల ప్రత్యేక నైవేద్యాలతో మహా నివేదన జరుగుతుందని తెలిపారు.మహా నివేదన అనంతరం భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.పాదాంబిక అమ్మవారి జాతర మహోత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ అయ్యారావు కోరారు.

## బిఎల్ఎ,ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన సదస్సు

**రామచంద్రపురం,జూన్ 26(ప్రభాత వార్త ):**స్థానిక పట్టణ వైఎస్ఆర్సిపి పార్టీ



కార్యాలయంలో రామచంద్రపురం నియోజకవర్గ ఇన్చార్జ్ పిల్లి సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ – బిఎల్ఎ యాప్ అవగాహన సమావేశం విజయవంతంగా నిర్వహించారు.?ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు,మాజీ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, నియోజకవర్గ అబ్జర్వర్ కర్రి నాగిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై బూత్ లెవెల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు.సమావేశంలో భాగంగా బిఎల్ఎలకు యాప్ ఇన్స్టాలేషన్,లాగిన్ విధానం,పాస్వర్డ్ రీసెట్ చేయడం మరియు యాప్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించే అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.ప్రతి బిఎల్ఎ తమ బూత్ పరిధిలో ఈ ప్రక్రియను సమర్ధవంతంగా పూర్తి చేయాలని నేతలు పిలుపునిచ్చారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps